PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 134 | విజయవాడ, గురువారం 15 డిసెంబర్ 2022 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Thursday 15 December 2022 | Rs

రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అర్హులైన పేదలు బియ్యం రేషన్ కార్డుల కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్ అరుణ్‌కుమార్ తెలిపారు. అర్హతపత్రాలను జతపరచి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వాటిని సచివాలయ సిబ్బంది ఆరుదశల్లో ధ్రువీకరిం చాక, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్హులుగా నిర్ధారించిన తరువాత పేదలకు బియ్యం కార్డు మంజూరవుతుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



ఫైనల్లో అర్జెంటీనా

- సెమీస్‌లో క్రొయేషియాపై 3-0తో గెలుపు
- ఫిఫా ప్రపంచకప్

లోపలి పేజీలో..

సత్వరమే ఆస్తులు పంచండి

- సుప్రీంకోర్టులో ఏపి పిటిషన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఆస్తులను, అప్పులను విభజించాలని సర్వోన్నత న్యాయ స్థానాన్ని ఏపి సర్కార్ ఆశ్రయించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత ఇరు రాష్ట్రాలకు రావాల్సిన ఆస్తులను, అప్పులను నిష్పాక్షికంగా, సమాన, సత్వర ప్రాతిపదికన విభజన చేయాలని విన్నవించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21లో పొందుపర్చిన హక్కుల కింద విస్తృత ప్రజా ప్రయోజనార్థమే తాము సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సివచ్చిందని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌ను 2014 జూన్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌గా పునర్వ్యవస్థీకరణ చేసినప్పటికీ.. అందుకు ఉద్దేశించిన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం చేపట్టాల్సిన ఆస్తులు, అప్పుల విభజన ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదని ఏపి ప్రభుత్వం తరపున న్యాయవాది మహఫూజ్ ఎ నజ్కి దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో పేర్కొన్నారు. చట్టంలోని షెడ్యూల్-9 (91 సంస్థలు), షెడ్యూల్ -10 (142 సంస్థలు), మరో 12 సంస్థల ఆస్తులను, అలాగే బాధ్యతలను ఇరు రాష్ట్రాల మధ్య విభజించలేదన్నారు. రూ.1,42,601 కోట్ల విలువైన ఆస్తులను విభజన చేయకపోవడంతో తెలంగాణకు ఆ మేరకు ప్రయోజనం చేకూరుతోందని, వీటిలో 91 శాతం ఆస్తులు ఉమ్మడి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనే ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఖర్చు చేసిందని తెలిపారు. షెడ్యూల్ - 9 సంస్థల ప్రధాన కార్యాలయాల ఆస్తుల విలువ సుమారు రూ.24,018.53 కోట్లుగా అంచనా వేశారని, వీటిలో రూ.22,556.45 కోట్ల విలువైన ఆస్తులు (93.9 శాతం) తెలంగాణ రాష్ట్రంలోనే ఉన్నాయని పేర్కొన్నారు. షెడ్యూల్ - 10 సంస్థలకు సంబంధించి రెండు రాష్ట్రాల మధ్య విభజించాల్సిన స్థిర ఆస్తుల మొత్తం విలువ రూ.34,642.77 కోట్లని, వీటిలో రూ.30,530.86 కోట్ల విలువైన ఆస్తులు (88 శాతం) తెలంగాణ రాష్ట్రంలోనే ఉన్నాయని పేర్కొన్నారు. చట్టం లోని షెడ్యూల్ -9, షెడ్యూల్ -10 లో పేర్కొనని 12 సంస్థలకు సంబంధించిన రూ.1,759 కోట్ల విలువ చేసే ఆస్తులు కూడా తెలంగాణాలోనే ఉన్నాయని తెలిపారు.



దిక్కుతోచన స్థితిలో ఉద్యోగులు..

ఆస్తుల విభజన జరగకపోవడం వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం ప్రాథమిక హక్కులపై తీవ్ర ప్రభావం పడుతోందని, ఇది అనేక సమస్యలకు దారితీసిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. 'షెడ్యూలులో పేర్కొన్న సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు (సుమారు 1,59,096) విభజన పూర్తికాకపోవడం వల్ల 2014 నుండి దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఏపి ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. విభజన తరువాత పదవీ విరమణ చేసిన పింఛనుదారుల పరిస్థితి దయనీయంగా ఉందని, వారిలో చాలా మందికి పదవీ విరమణ ప్రయోజనాలు (టెర్మినల్ బెనిఫిట్లు) అందలేదని పేర్కొంది. అందువల్ల ఈ ఆస్తులన్నింటినీ వీలైనంత త్వరగా విభజించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేసింది. ఆస్తుల విభజన జరగకపోవడం సదరు సంస్థల పనితీరు కూడా బలహీనపడినట్లు తెలిపింది. వీటిని పరిగణలోకి తీసుకొని రాష్ట్రాల మధ్య ఆస్తులను వేగంగా విభజించడానికి అవసరమైన అన్ని ఆదేశాలను జారీ చేయాల్సిందిగా సుప్రీంకోర్టును ఏపి ప్రభుత్వం కోరింది.

CHIEF MINISTER'S OFFICE
Andhra Pradesh

Note No.147/Addl.Secy(MR)/2022, Dt.13-12-2022

During the Cabinet meeting held on 13.12.2022, the HCM observed that the Village Revenue Officers and the Village Surveyors are not properly marking attendance at their respective Village Secretariat which is against the instructions issued earlier.

Hence it is requested to issue suitable instructions to mark their attendance at the respective village Secretariats in time without fail

R. Mutyalaraju 13/12.
(MUTYALA RAJU REVU)
Addl. Secretary to C.M.

చిరుద్యోగులపై సర్కారు దాడి

- నిన్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు
- నేడు విఆర్‌ఓలు, సర్వేయర్లు
- అటెండెన్స్‌పై కేబినెట్‌లో చర్చ
- సిఎం కార్యాలయ ఆదేశాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర సచివాలయంలో అత్యున్నత స్థాయి అధికారులు ఎందరు సకాలంలో కార్యాలయాలకు వస్తున్నారో? నిర్ధేశించిన విధంగా అటెండెన్స్‌ను ఎందరు నమోదు చేస్తున్నారో చెప్పగలరా...? హెచ్‌ఓడిలలో... జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో ఉన్నతాధికారులు ఈ ప్రక్రియను సజావుగా నిర్వహిస్తున్నారా? ఈ ప్రశ్నకు జవాబు అందరికీ తెలిసిందే! చిత్రంగా రాష్ట్ర మంత్రిమండలి మాత్రం విఆర్‌ఓలు, సర్వేయర్లపై దృష్టి సారించింది. వీరు సక్రమగా అటెండెన్స్ వేయడం లేదని నిర్ధారించింది. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వీరి పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో సిఎం కార్యాలయం రంగంలోకి దిగింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విఆర్‌ఓలు, సర్వేయర్లను సక్రమంగా హాజరు నమోదు చేసేలా చూడాలని ఆదేశించింది. జిఎస్‌డబ్ల్యుఎస్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, సిసిఎల్‌ఎ, సర్వే అండ్ సెటిల్‌మెంట్స్ ల్యాండ్ రికార్డ్సు కమిషనర్లకు ఈ బాధ్యతలు అప్పగిస్తూ ఏకంగా ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగుల హాజరు విషయంలో నిబంధనలు పాటించమనడం తప్పులేదు కానీ, విఆర్‌ఓలు, సర్వేయర్ల వంటి చిరుద్యోగులపై ఏకంగా కేబినెట్‌లో ప్రస్తావనకు రావడం విశేషం. కొద్దిరోజుల క్రితం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఆ తరువాత ప్రభుత్వ కార్యాలయాల్లోని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, నిన్న ఆర్‌టిసి అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, ఇప్పుడు క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బంది పట్ల సర్కారు అనుసరిస్తున్న వైఖరి చర్చనీయాంశంగా మారుతోంది. చిరుద్యోగులపై ప్రభుత్వం దాడి చేస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇవీ ఆదేశాలు

'13.12.2022న జరిగిన కేబినెట్ సమావేశంలో గ్రామ రెవిన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు వారికి కేటాయించిన గ్రామ సచివాలయంలో సక్రమంగా హాజరు నమోదు చేయడం లేదని గౌరవనీయ ముఖ్యమంత్రి గారు గుర్తించారు. ఇది గతంలో జారీ చేసిన ఆదేశాలకు విరుద్ధం. అందువల్ల వారికి కేటాయించిన గ్రామ సచివాలయంలో తప్పని సరిగా హాజరు నమోదుచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోగలరు.'

ఏమిటి కష్టం...?

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో విఆర్‌ఓలు, సర్వేయర్లు నిర్వహిస్తున్న కీలక పాత్ర గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ సర్వేలో వీరు మరింత ముఖ్యం! ఈ క్రమంలోనే వారిపై పని ఒత్తిడి విపరీతంగా పెరిగింది. ఈ ఒత్తిడి తట్టుకోలేక రాష్ట్రంలో ఇప్పటి వరకు ఇద్దరు విఆర్‌ఓలు, ఒక ఆహసిల్దార్ ఆత్మహత్యకు పాల్పడ్డారు.

పని ఒత్తిడి తగ్గించాలని విఆర్‌ఓల సంఘం ఆందోళనకూ పిలుపునిచ్చింది. ఇంత పనిచేస్తున్న వారు అటెండెన్స్ ఎందుకు వేసుకోరు? సాధారణంగా వచ్చే ప్రశ్నే ఇది! పైగా తాజా నిబంధనల ప్రకారం ప్రతిరోజూ మూడు పూటలా గ్రామ సచివాలయానికి వచ్చి అటెండెన్స్ వేసుకోవాలి. అయితే, వారికి కేటాయించిన సచివాలయానికి, పనిచేస్తున్న ప్రాంతానికి పొంతన ఉండటం లేదు. పదుల కి.మీ. దూరం ఉంటోంది. కొన్ని సమయాల్లో తమకు కేటాయించిన సచివాలయానికి 50 కి.మీ దూరంలో పనిచేయాల్సివస్తోందని చెబుతున్నారు. సిబ్బంది కొరత తీవ్రంగా ఉండటంతో పాటు, సర్వే ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా ముగించాలన్న ఒత్తిడి కూడా పైనుండి వస్తోంది. దీంతో ఎక్కువమంది నేరుగా సర్వే నిర్వహిస్తున్న ప్రాంతానికే వెళ్తున్నారు. దీంతో ఒక్కసారి హాజరు వేసుకోవడమే కష్టంగా మారుతోందని, మూడు సార్లు ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నిస్తున్నారు.

సిబ్బంది కొరత ఇలా...

రాష్ట్ర వ్యాప్తంగా 17,604 రెవిన్యూ గ్రామాలు ఉండగా, విఆర్‌ఓలు సుమారుగా 14 వేల మందే ఉన్నారు. ఇవి కాక మున్సిపాల్టీల్లోనూ కొరత ఉంది. సర్వేయర్లు పాత వాళ్లు నాలుగు వేల మంది ఉండగా, కొత్తగా 13వేల మందిని నియమించారు. వీరికి ఆన్‌లైన్ ట్రైనింగ్ మాత్రమే ఇవ్వడంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. తాజాగా జరుగుతున్న సర్వేలో ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం 30 ఎకరాలు సర్వే చేయాలన్నది ప్రభుత్వ ఆదేశం. దీంతో ఈ భారం అంతా కొందరి మీదనే పడుతోంది.

'ఆశా' పోస్టుల కుదింపు!

గ్రామాల్లో వెయ్యి మందికి, అర్బన్‌లో 2,500 మందికి ఒక్కరే • ఏజెన్సీ ప్రాంతాల్లో సేవలపై తీవ్ర ప్రభావం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఆర్థిక భారం తగ్గించుకొనే పేరుతో ఆశా వర్కర్ల పోస్టులను కుదించాలని ప్రభుత్వం యోచిస్తోంది. అందులో భాగంగా ఆశా కార్యకర్తలు అందిస్తోన్న సేవల పరిధి పెంచింది. ఇప్పటివరకూ గ్రామీణ ప్రాంతాల్లో 800 లోపు జనాభా ఉన్నా ఒక ఆశా కార్యకర్తను నియమించేవారు. అర్బన్ ప్రాంతాల్లో వెయ్యి మంది జనాభాకు ఒక ఆశా వర్కర్ నియామకం చేపట్టారు. ఇకపై గ్రామీణ ప్రాంతాల్లో కనీసం వెయ్యి మంది జనాభా ఉంటేనే ఆశాను నియమిస్తారు. అర్బన్ ప్రాంతాల్లో కనీసం 2,500 మంది జనాభాకు మాత్రమే ఆశాను కేటాయిస్తారు. దీనిపై జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులకు ప్రభుత్వం వారం రోజుల క్రితం ఒక సర్క్యులర్ జారీ చేసింది. భవిష్యత్తులో చేపట్టనున్న ఆశా కార్యకర్తల పోస్టుల భర్తీలో ఈ విధానం అనుసరించాలని సూచించింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 42 వేల మంది ఆశా కార్యకర్తలు పనిచేస్తున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో భవిష్యత్తులో వీరి సంఖ్య తగ్గనుంది. వీరిని ఇప్పటికిప్పుడు తొలగించకపోయినా భవిష్యత్తులో ఖాళీలను భర్తీ చేయరని తెలుస్తోంది. దీంతో ఆ మేరకు పనిభారం పెరగనుంది.

సమస్యల పరిష్కారానికి శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు (ఫైల్)

ప్రభుత్వం నిర్దేశించినట్లుగా గ్రామీణ ప్రాంతాల్లో వెయ్యి మంది జనాభా ఉండి, అక్కడ ఖాళీ ఏర్పడితేనే ఆ పోస్టును భర్తీ చేస్తారు. అర్బన్ ప్రాంతంలోనూ అదే విధానాన్ని అనుసరించనున్నారు. ఒకవేళ వెయ్యిలోపు జనాభా ఉండి అక్కడ ఏదైనా కారణంతో ఖాళీ ఏర్పడితే, ఆ ప్రాంతాన్ని సమీప సచివాలయ పరిధిలోని ఆశా కార్యకర్తకు అప్పగించనున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ఆశాల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై తీవ్ర ప్రభావం పడనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఏజెన్సీ ప్రాంతాల్లో కొన్నిచోట్ల 300 మంది జనాభాకు ఒక ఆశా వర్కర్ (కమ్యూనిటీ హెల్త్ వర్కర్) ఉన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఆశా పరిధిలోకి 300 జనాభా ఉండే మరో మూడు నాలుగు గిరిజన గూడేలు

మిగతా 2లో

కాటేసిన కల్తీ మద్యం

- బీహార్‌లో 20 మంది మృతి

పాట్నా : బీహార్‌లోని చాప్రా జిల్లాలో వివిధ గ్రామాల్లో బుధవారం కల్తీ మద్యం తాగి 20 మంది వరకు మరణించారు. తీవ్ర అస్వస్థతకు గురైన మరికొందరు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అయితే కల్తీ మద్యం వల్లే మరణాలు సంభవించాయని మృతుల కుటుంబ సభ్యులు చెబుతున్నప్పటికీ అధికారులు మాత్రం దీనిని ఇంకా నిర్ధారించలేదు. కల్తీ మద్యం మరణాలపై బీహార్ అసెంబ్లీలో బిజెపి ఎమ్మెల్యేలు నితీష్‌కుమార్ ప్రభుత్వంపై ఆరోపణలకు దిగారు. ఆయన ధీటుగా తిప్పికొట్టారు. రాష్ట్రంలో సుదీర్ఘకాలం పాలనలో ఉన్న బిజెపి వల్లే కల్తీ మద్యం వేళ్లూనుకుందని, తాము అధికారంలోకి వచ్చాక ఆ వేళ్లను ఒక్కొక్కటిగా పెకిలిస్తున్నామని తెలిపారు. అయితే ఈ మరణాలపై తగిన విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని నితీష్ తెలిపారు.

బీమా కొరెగావ్ కేసులో నిందితులందరినీ విడుదల చేయాలి

- 'ఆర్సెనల్' నివేదిక నేపథ్యంలో సిపిఎం డిమాండ్

ఇండియా న్యూస్ నెట్‌వర్క్ - న్యూఢిల్లీ

బీమా కొరెగావ్ కేసులో ఫాదర్ స్టాన్ స్వామిని అక్రమంగా ఇరికించేందుకు ప్రయత్నాలు జరిగాయంటూ తాజాగా అమెరికా ఫోరెన్సిక్ కంపెనీ ఆర్సెనల్ నివేదిక వెల్లడించిన నేపథ్యంలో తక్షణమే ఈ కేసులోని నిందితులందరినీ విడుదల చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. స్టాన్ స్వామిని 'దేశద్రోహి'గా చిత్రీకరించేందుకు ఆయన కంప్యూటర్‌ను హ్యాక్ చేసి నకిలీ పత్రాలు చొప్పించి వాటినే సాక్ష్యాధారాలుగా చూపించారంటూ ఆర్సెనల్ కన్సల్టింగ్ కంపెనీ తాజా నివేదికలో పేర్కొంది. 2017-19 మధ్య కాలంలో చోటుచేసుకున్న ఈ పరిణామాలపై ఆర్సెనల్ ఫోరెన్సిక్ ఆధారాలతో సహా విడుదల చేసిన ఈ నివేదికలోని ప్రధానాంశాలను సిపిఎం ప్రస్తావించింది. స్టాన్‌స్వామి, ఇతర నిందితులపై జరిగిన ఈ కుట్ర చాలా హేయమైనదని పేర్కొంది. ఈ మేరకు ఆ పార్టీ పొలిట్‌బ్యూరో బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. స్టాన్ స్వామిని పూణే పోలీసులు అరెస్టు చేయబోతున్న విషయాన్ని హ్యాకర్లకు ముందుగానే చేరవేసినట్లు ఫోరెన్సిక్ సాక్ష్యాధారాల్లో వెల్లడికావడం మరింత దిగ్భ్రాంతికరమైన అంశమని తెలిపింది. కేవలం ఒక్క రోజు ముందు మాత్రమే, వారి కార్యకలాపాలకు సంబంధించిన గుర్తులేవీ లేకుండా తుడిచేసేందుకు వారు ప్రయత్నించినట్లు కూడా నివేదికలో వెల్లడైందని తెలిపింది. అన్నింటికంటే అధ్వాన్నమైన అంశమేమంటే, స్టాన్ స్వామికి బెయిల్ తిరస్కరించడం, ఆయనకు కనీస సదుపాయాలు కల్పించడానికి కూడా నిరాకరించడం, కస్టడీలో ఆయన మరణించడమంటే హత్య చేయడం తప్ప మరొకటి కాదని సిపిఎం విమర్శించింది. తానెన్నడూ చేయని ఒక నేరానికి నిందితుడిగా కస్టడీలోనే స్టాన్‌స్వామి బలైపోయారని ఆందోళన వ్యక్తం చేసింది.

స్టాన్‌స్వామి, ఇతర బీమాకొరెగావ్ నిందితుల కంప్యూటర్లలోకి చొరబడి నకిలీ పత్రాలు చొప్పించినట్లు సాక్ష్యాధారాలతో బయటపెట్టిన నివేదికల్లో 'ఆర్సెనల్' నివేదిక అయిదవదని పొలిట్‌బ్యూరో తెలిపింది. కంప్యూటర్లలో దొంగచాటుగా చొప్పించిన ఈ ఫైళ్ళ గురించి నిందితులకు తెలియదని, వాటిని కనీసం వారు చూడలేదని కూడా ఫోరెన్సిక్ విచారణలో రుజువైందని తెలిపింది. బీమా కొరెగావ్ కేసులో నిందితులందరి పైనా ప్రధాన సాక్ష్యాధారంగా పేర్కొంటున్న ఈ నకిలీ ఫైళ్లలో చాలా వాటిని నిరంకుశ యుఎపిఎ (ఉపా) నిబంధనల కింద

మిగతా 5లో

బ్రిటన్‌లో శ్రమజీవుల పోరుబాట

- ఇప్పటికే రైల్వే, పోస్టల్ కార్మికుల నిరసనలు
- నర్సులు, బస్సు డ్రైవర్లు సైతం ఉద్యమ కార్యాచరణ

లండన్ : బ్రిటన్‌లో శ్రమజీవులు పోరుబాట పడుతున్నారు. రైల్వే కార్మికులు మంగళ, బుధవారాల్లో రెండు రోజుల జాతీయ సమ్మె చేశారు. ద్రవ్యోల్బణం పెచ్చరిల్లుతున్న సమయంలో వేతనాలను తక్కువగా పెంచడాన్ని నిరసిస్తూ దేశంలోనే అతిపెద్ద రైల్వే యూనియన్ ఆర్‌ఎంటి ఆందోళన చేపట్టింది. చిట్ట చివరి నిముషంలో నెట్‌వర్క్ రైల్ నుండి వచ్చిన వేతన పెంపు ప్రతిపాదనను ఆర్‌ఎంటి సభ్యులు తిరస్కరించారు. గతేడాది నుండి అమల్లోకి వచ్చేలా ఐదు శాతం పెంపును, వచ్చే ఏడాది నుండి మరో నాలుగు శాతాన్ని పెంచేందుకు నెట్‌వర్క్ రైల్ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన సరిగా లేదని, ద్రవ్యోల్బణానికి మించి వేతన పెంపు ప్రతిపాదన వుండాలని ఆర్‌ఎంటి ప్రధాన కార్యదర్శి మైక్ లించ్ పేర్కొన్నారు. శుక్రవారం నుండి రైల్వే కార్మికులు మరో విడత రెండు రోజుల సమ్మె చేయనున్నారు. వారితోపాటు బస్సు డ్రైవర్లు, హైవ వర్కర్లు, ఎయిర్‌పోర్టు బ్యాగేజీ హాండ్లర్లు కూడా సమ్మెలో పాల్గొననున్నారు. అలాగే నర్సుల నుండి పాస్‌పోర్ట్ కంట్రోల్ వర్కర్ల వరకు పలు రంగాలకు చెందిన కార్మికులు, ఉద్యోగులు కూడా ఈ నెలలోనే సమ్మెకు దిగుతుండడంతో క్రిస్మస్ పండుగ సీజన్ హడావిడికి అంతరాయం కలుగుతోంది. 1980ల తర్వాత ఎన్నడూ లేని స్థాయిలో బ్రిటన్‌లో పారిశ్రామిక కార్యాచరణ పెద్ద ఎత్తున సాగుతోంది. ద్రవ్యోల్బణం రెండంకెలకు చేరడంతో జీవన వ్యయం భారంగా మారుతోంది. బుధవారం నుండి పోస్టల్ కార్మికులు కూడా రెండు రోజుల సమ్మెకు దిగారు. 106 ఏళ్ళ యూనియన్ చరిత్రలో మొట్టమొదటిసారిగా నర్సులు గురువారం నుండి సమ్మెకు దిగుతున్నారు. పెరుగుతున్న ఇంధన వ్యయం, ఇతర ఖర్చుల నేపథ్యంలో వేతనాల పెంపుకోసమే వీరందరూ ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

భారత, చైనా ద్వైపాక్షిక వాణిజ్యం 34% వృద్ధి



న్యూఢిల్లీ : వాణిజ్య పరంగా భారత్, చైనా మధ్య పరస్పర సహకార సంబంధాలు మెరుగ్గా కొనసాగుతున్నాయి. 2022 మార్చితో ముగిసిన 12 మాసాల కాలంలో ఇరు దేశాల మధ్య మొత్తం సరకుల వ్యాపారం ఏకంగా 34 శాతం పెరిగి 115.83 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.9.5 లక్షల కోట్లు)గా నమోదయ్యింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ ఏప్రిల్ నుంచి అక్టోబర్ కాలంలో 69.04 బిలియన్ డాలర్ల వ్యాపారం జరిగిందని వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఉత్పత్తుల కోసం చైనా పైన ఆధారపడటం తగ్గించుకోవడానికి ప్రయత్నించాలని ఇటీవల ప్రధాని మోడీ పేర్కొన్నారు. 2020లో ఇరు దేశాల సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో అనేక చైనా ఉత్పత్తుల దిగుమతులపై భారీ ఆంక్షలను విధించారు. అయినప్పటికీ చైనా దిగుమతులపైనే భారత్ ఆధారపడాల్సి రావడం గమనార్హం.

రాష్ట్రంలో 50,677 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ

- పార్లమెంటులో కేంద్రం వెల్లడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో 50,677 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. రాజ్యసభలో ఆమ్‌ఆద్మీ పార్టీ ఎంపి సంజయ్ సింగ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2021-22లో ఏపిలో 50,677, తెలంగాణలో 18,588 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. దేశంలో ఉన్నత విద్యా సంస్థల్లో 3,753 బ్యాక్‌లాగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వైసిపి ఎంపి ఆర్ కృష్ణయ్య అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి సుభాష్ సర్కార్ సమాధానం ఇచ్చారు.

అక్రమ మైనింగ్‌లో మూడో స్థానం

అక్రమ మైనింగ్ కేసుల్లో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉంది. లోక్‌సభలో ఒక ఎంపి అడిగిన ప్రశ్నకు కేంద్ర గనుల మంత్రి ప్రహ్లాద్ జోషి సమాధానం ఇచ్చారు. 2021-22లో ఏపిలో అక్రమ మైనింగ్‌కు సంబంధించి 9,351 కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. 3,396 వాహనాలు సీజ్ చేసినట్లు, రూ.420.91 కోట్ల జరిమానా రాష్ట్ర ప్రభుత్వం విధించిందని పేర్కొన్నారు. కోర్టుల్లో 24 కేసులు దాఖలు అయ్యాయని, 39 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు అయ్యాయని తెలిపారు. తెలంగాణలో 2,831 కేసులు నమోదు కాగా, 73 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. అక్రమ మైనింగ్‌లో ఉత్తరప్రదేశ్ (23,787), మధ్యప్రదేశ్ (9,361) మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

నత్తనడకన రైల్వే ప్రాజెక్టులు

ఆంధ్రప్రదేశ్‌లో 31 రైల్వే ప్రాజెక్టులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ ప్రాజెక్టుల పనులు వివిధ స్థాయిల్లో ఉన్నాయని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. వైసిపి ఎంపి పోచా బ్రహ్మానంద రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 31 ప్రాజెక్టుల్లో 16 ప్రాజెక్టులు కొత్త లైన్లు కాగా, 15 ప్రాజెక్టులు డబుల్ లైన్లవని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టులు రూ.70,594 కోట్ల వ్యయంతో 5,581 కిలో మీటర్ల పొడవు ఉంటాయని అన్నారు.

లోపలి పేజీలో...

రైతులను ఆదుకోవాలి

- ఇన్‌పుట్ సబ్సిడీ రూ.25 వేలు ఇవ్వాలి
- పాత పద్ధతిలో ఇన్సూరెన్సు విధానం అమలు చేయాలి : వి.శ్రీనివాసరావు

'మద్దతు' చట్టం కోసం ఐక్య పోరు

- ఎఐకెఎస్ మహాసభ తీర్మానం

ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాలో భాగమే ఎన్‌ఇపి

- ఫాసిస్టు, మతతత్వ విధానాలు దేశానికి ప్రమాదం
- ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత మహాసభల్లో మాజీ నేతలు

వయొలిన్ విద్వాంసులు ద్వారం మంగతాయారు కన్నుమూత

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రముఖ వయొలిన్ విద్వాంసులు ద్వారం మంగతాయారు (92) చెన్నైలో కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో ఆమె బుధవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. మంగతాయారు దిగ్గజ వయొలిన్ విద్వాంసులు పద్మశ్రీ వెంకటస్వామి నాయుడి పెద్ద కుమార్తె. వీరి స్వస్థలం విజయనగరం. మంగతాయారు బాల్యమంతా విజయనగరంలోనే గడిపారు. మహారాజా ప్రభుత్వ సంగీత కళాశాలలో వయొలిన్‌లో డిప్లొమా కోర్సు పూర్తి చేశారు. 1973లో అదే కళాశాలలో ప్రొఫెసర్‌గా చేరారు. రెండేళ్ల తరువాత ఆమె చెన్నై వెళ్లి ఆలిండియా రేడియోలో ఎ- గ్రేడ్ కళాకారిణిగా 16 సంవత్సరాలపాటు తన సేవలందించారు. దేశ, విదేశాల్లో అనేకచోట్ల సంగీత కచేరీల్లో పాల్గొన్నారు. ఎంఎస్ సుబ్బలక్ష్మి, డికె పట్టమ్మాళ్, వేదవల్లి, ఎంఎల్ వసంతకుమారి వంటి ఘన సారథుల కచేరిల్లో వాయిద్య సహకారం అందించారు. వయొలిన్‌లో సంగీత అకాడమీ నుంచి జీవిత సాఫల్య పురస్కారం, 2012లో సంగీత విద్యా నిధి పురస్కారం అందుకున్నారు. 2015లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళారత్న పురస్కారం అందజేసింది. ద్వారం కుటుంబం మొత్తం శాస్త్రీయ సంగీత ప్రపంచానికే అంకితమైన అరుదైన గుర్తింపు పొందింది. సంగీతమే జీవిత భాగస్వామిగా ఆస్వాదించిన మంగతాయారు వివాహం చేసుకోలేదు. ఆమె మృతి పట్ల సంగీతాభిమానులు తీవ్ర సంతాపాన్ని తెలిపారు.

ప్రేమోన్మాది దాడిలో గాయపడిన యువతి తల్లి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తనతో పెళ్లికి నిరాకరించిందన్న కోపంతో హైదరాబాద్ మియాపూర్‌లో ఓ ప్రేమోన్మాది చేసిన దాడిలో తీవ్రంగా గాయపడ్డ తల్లీ కూతురు గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం విదితమే. యువతి తల్లి శోభ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తను ప్రేమించిన వైభవికి మరొకరితో నిశ్చితార్థం జరుగుతుందని తెలిసి నిందితుడు సందీప్.. యువతి ఇంటికి వెళ్లి ఆమెతోపాటు ఆమె తల్లి శోభపై కత్తితో తీవ్రంగా దాడి చేసి అనంతరం తానూ ఆత్మహత్యాయత్నం చేశాడు యువతి వైభవికి ఛాతీభాగంలో 22 కుట్లు పడ్డాయి. ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉంది. నిందితుడు సందీప్‌కు కోఠిలోని ఇఎన్‌టి ఆస్పత్రి వైద్యులు గొంతు భాగంలో ఆపరేషన్ చేశారు.

అనుమానాస్పద స్థితిలో తోడికోడళ్లు మృతి

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

అనుమానాస్పద స్థితిలో తోడికోడళ్ళు మృతి చెందారు. వీరు హత్యకు గురైనట్లు అనుమానం వ్యక్తమవుతున్నాయి. కర్నూలు జిల్లా ఓరకల్లు మండలంలో బుధవారం రాత్రి చోటుచేసుకున్న ఈ సంఘటనకు స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నన్నూరు గ్రామానికి చెందిన పెద్ద రామ గోవిందు, చిన్న రామగోవిందు అన్నదమ్ముళ్లు. చిన్న రామ గోవిందు భార్య రేణుక (33), పెద్ద రామ గోవిందు భార్య రామేశ్వరమ్మ (35) బుధవారం ఉదయం 11 గంటలకు గడ్డి కోసమని పొలానికి వెళ్లారు. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో వారి భర్తలు వెతుక్కుంటూ పొలానికి వెళ్లగా తోడికోడళ్లు ఇద్దరూ కంది పొలంలో మృతి చెంది కనిపించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గుర్తుతెలియని వ్యక్తులు మహిళల గొంతు కోసి హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. దిశ డిఎస్‌పి వెంకటరామయ్య, సిఐ శ్రీనివాసులు రెడ్డి, ఓర్వకల్లు ఎస్ఐ మల్లికార్జున, ఉలిందకొండ ఎస్ఐ నల్లప్ప కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎపికి 'జాతీయ ఇంధన పరిరక్షణ' అవార్డు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంధన పొదుపు, సంరక్షణలో 'జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డు'ను రాష్ట్రం అందుకుంది. ఇంధన సామర్థ్యం, పరిరక్షణ అంశాల్లో ఈ అవార్డు పొందింది. కేంద్రప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి చేతుల మీదుగా ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, ఆంధ్రప్రదేశ్ ఇంధన పరిరక్షణ మిషన్ (ఎపిఎస్ఈసిఎం) సిఇవో ఎ.చంద్రశేఖర్‌రెడ్డి ఢిల్లీలో బుధవారం ఈ అవార్డు అందుకున్నారు. ఇంధన వినియోగం ఆధారంగా దేశంలోని రాష్ట్రాలను నాలుగు గ్రూపులుగా విభజించగా, రెండో గ్రూపులో రాష్ట్రం అత్యుత్తమ పనితీరు కనపరిచి మొదటి బహుమతిని సొంతం చేసుకుంది. ఎపిఎస్ఇసిఎం స్టేట్ ఎనర్జీ ఎఫిషియన్సీ ఇండెక్స్ - 2020లో రాష్ట్రానికి 50.5 స్కోర్ వచ్చిందని, 2022లో 77.5 స్కోర్ వచ్చాయి. ఈ సందర్భంగా కె విజయానంద్ మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో వివిధ కీలక రంగాల్లో అమలుచేసిన ఇంధన సామర్థ్య కార్యక్రమాల వల్ల రూ.3,800 కోట్ల విలువైన 5,600 మిలియన్ యూనిట్ల (ఎంయు) విద్యుత్‌ను ఆదా చేయగలిగామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎ చంద్రశేఖర్‌రెడ్డి, విద్యుత్ పంపిణీ సంస్థల సిఎండిలు జె పద్మ జనార్ధన రెడ్డి, కె సంతోషరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవలో ఎంబి జీవితం ఆదర్శం

- మాకినేని బసవపున్నయ్య జయంతి సభలో మధు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎంబి జయంతి సభలో మాట్లాడుతున్న పి. మధు

ప్రజా సేవ చేయడంలో మాకినేని బసవపున్నయ్యను ఆదర్శంగా తీసుకోవాలని, సమసమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఛైర్మన్ పి.మధు పిలుపునిచ్చారు. మార్క్సిస్టు ఉద్యమ నిర్మాత మాకినేని బసవపున్నయ్య జయంతి సందర్భంగా ఎంబివికె ఇన్‌ఛార్జి బి.తులసీరావు అధ్యక్షతన బుధవారం జరిగిన సభలో ఎంబి చిత్రపటానికి మధు, ఎంబివికె కార్యదర్శి పి.మురళీకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మధు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, సోషలిస్టు ఉద్యమకారుల్లో ఒకరైన బసవపున్నయ్య స్వాతంత్ర్యోద్యమంలో చురుకైన పాత్ర పోషించారని చెప్పారు. గుంటూరు ఎసి కాలేజిలో చదువుకుంటూ విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహించి, బ్రిటీషు వారికి వ్యతిరేకంగా, జమీందారులకు, భూస్వాములకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల్లో ముందుండి ప్రజలను సమీకరించారని చెప్పారు. భారతదేశంలో స్వాతంత్ర్యం, సోషలిజం నిర్మాణం కోసం, పేదరికంలేని నవ సమాజం నిర్మించడానికి అంతర్జాతీయంగా స్టాలిన్, మావోతో సంప్రదింపులు జరిపారని తెలిపారు. ఆయన జీవిత కాలంలో తను నమ్మిన సిద్ధాంతం కోసం రాజీలేని పోరాటం నిర్వహించారని చెప్పారు. తను చదువుకునే రోజుల్లో నది దాటడానికి అగ్రకులాల వారి బిడ్డలను మాత్రమే ఎక్కించి, దళితుల పిల్లలను ఎక్కనివ్వకపోవడంతో ఆ దురాచారాన్ని అడ్డుకున్నారని తెలిపారు. గుంటూరు బాపనయ్యను దళితుడని పడవను ఎక్కనివ్వకపోవడంతో పోరాడి ఆయనను పడవ ఎక్కించేటట్టు చేశారని చెప్పారు. ఆ విధంగా దళితుల సమస్యలపై ఎంబి తన జీవిత కాలంలో నిరంతరం పోరాటం చేసిన ఘనుడని తెలిపారు. పేదవారి అభ్యున్నతికి, నిరుద్యోగులు, ఆకలి మంటలతో ఉండే వారికి ఏదో ఒక విధంగా సహాయపడాలనే బసవ పున్నయ్య ఆశయాల బాటలోనే ఎంబి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. అందులో భాగంగానే కరోనా కాలంలో ఐసొలేషన్ ఏర్పాటు చేసి అనేకమందిని వైద్యాన్ని అందించామని, నిరంతరం ఈ విజ్ఞాన కేంద్రంలో మహిళల స్వయం సాధన కోసం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పి.మురళీకృష్ణ మాట్లాడుతూ ఆర్థిక అసమానతలు ఉండకూడదని, స్త్రీ, పురుషులకు సమాన హక్కులు ఉండాలని, కుల రహిత సమాజం రావాలని బసవ పున్నయ్య కృషి చేశారని తెలిపారు. వ్యవసాయ కార్మికులు, కార్మికుల సమస్యలపై విశేష కృషి చేశారని, ఆయన పేరుతో ఏర్పాటు చేసిన విజ్ఞాన కేంద్రం సేవా సహాయక కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

'మాండూస్'తో నష్టపోయాం

- నష్టపరిహారం చెల్లించాలని రైతుల ధర్నా

ప్రజాశక్తి - గూడూరు

గూడూరు ఆర్‌డిఒ ఎఒకు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

మాండూస్ తుపాను కారణంగా నష్టపోయిన తమను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రైతులు బుధవారం తిరుపతి జిల్లా గూడూరు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. తొలుత గూడురులో ప్రదర్శన నిర్వహించారు. స్థానిక సిపిఎం కార్యాలయం నుండి ప్రారంభమైన ప్రదర్శన ముత్యాలపేట మీదుగా టవర్‌క్లాక్ సెంటర్‌కు చేరుకుని ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం గూడూరు ఆర్‌డిఒ ఎఒకు వినతిపత్రం సమర్పించారు. ధర్నానుద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు మాట్లాడుతూ.. తుపాను తీవ్ర నష్టాలను మిగిల్చిందని, పంటలపై తీవ్ర ప్రభావం చూపి, రైతుల వెన్ను విరిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా కొన్ని గ్రామాలు ముంపులోనే ఉన్నాయని తెలిపారు. గూడూరు డివిజన్ పరిధిలోని కోట, వాకాడు, చిట్టమూరు, నాయుడుపేట, వెంకటగిరి తదితర మండలాల్లో తుపాను కారణంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్ మాట్లాడుతూ తుపాను కారణంగా దివిపాలెం పంచాయతీ రైతులకు సంబంధించి 75 శాతం నారుమళ్లు కొట్టుకుపోయాయని తెలిపారు. మాగాణి భూముల్లో ఇసుక మేట వేసి ఉందన్నారు. లోతట్టు ప్రాంతమైన ఎస్‌విఆర్‌సి కాలేజీ ప్రాంతంలో నివసిస్తున్న 52 కుటుంబాల వారి బట్టలు, బియ్యం, ముడిసరుకులు తడిచిపోయాయని తెలిపారు. నిర్వాసితులకు నగదు, నిత్యావసరాలు, రైతులకు ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు పామంజి మణి, సుబ్బయ్య, జి.రాజగోపాల్, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

జనవరిలోపు 175 దేవాలయాల్లో కంప్యూటరీకరణ

- కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

2023 జనవరి 31లోపు రాష్ట్ర వ్యాప్తంగా 175 దేవాలయాల్లో పూర్తి స్థాయిలో కంప్యూటరీకరణ చేయాలని 9 అండ్ 9 సాఫ్ట్‌వేర్ సంస్థను డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ ఆదేశించారు. కంప్యూటరీకరణ వల్ల పారదర్శకతతోపాటు అవినీతికి తావు లేకుండా భక్తులకు మెరుగైన సేవలు అందించవచ్చన్నారు. ఇప్పటికే 16 దేవాలయాల్లో మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. విజయవాడ జమ్మిదొడ్డిలోని దేవాదాయశాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. మేజర్ దేవాలయాల్లో ఆన్‌లైన్ పద్ధతులను పాటించాలని, విద్యుత్‌కు అంతరాయం లేకుండా యుపిఎస్‌లు వాడుకోవాలని సూచించారు. ధూప, దీప నైవేద్యం కోసం 185 దేవాలయాల నుంచి ప్రతిపాదనలు వచ్చాయని, ఆయా దరఖాస్తులను పరిశీలించి అనుమతి ఇస్తారని తెలిపారు. టిటిడి తరహాలో ప్రొటోకాల్ విభాగాన్ని అనుసరించేందుకు మార్గదర్శకాలు జారీ చేయాలని కమిషనరును మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో దేవాదాయశాఖ కమిషనరు ఎం.హరిజవహర్‌లాల్, అదనపు కమిషనరు టి.చంద్రకుమార్, జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్, దేవాదాయశాఖ చీఫ్ ఇంజనీర్ ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెట్టుబడులు వస్తుంటే ఓర్వలేక దుష్ప్రచారం

సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రం నుండి పరిశ్రమలు తరలివెళ్లిపోతున్నాయని ఇన్నాళ్లు దుష్ప్రచారం చేసిన తెలుగుదేశం పార్టీకి ఒకే రోజు రూ.24 వేల కోట్ల పెట్టుబడులకు క్యాబినెట్ అనుమతి ఇవ్వడంతో దిక్కుతోచక నిబంధనలు పాటించడం లేదంటూ కొత్తపల్లవి ఎత్తుకున్నారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి పెట్టుబడులు వస్తుంటే తెలుగుదేశం ముఠాకు దిక్కుతోచడం లేదని అన్నారు. గత ప్రభుత్వం పెట్టుబడిదారులకు పెద్దఎత్తున రాయితీలు ఇచ్చేదని, తమ ప్రభుత్వం పరిశ్రమ పెట్టడం ద్వారా రాష్ట్రానికి ఆదాయం సమకూరేలా నిబంధనల ప్రకారం అనుమతులిస్తున్నామని తెలిపారు. ఉత్తుత్తి ఎంఓయులు కాకుండా, నిజంగా పెట్టుబడిని పెట్టి ఉత్పత్తిని ప్రారంభించే పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. తెలుగుదేశం హయాంలో కడప స్టీల్‌ప్లాంట్‌ను ఎందుకు చేపట్టలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి ఇందిరా ఆవాస్ యోజన పథకం కింద తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి లక్షా 79 వేల ఇళ్లు మంజూరయ్యాయని, అవన్నీ వివిధ దశల్లో వున్నాయని మార్చి 2024 నాటికి పూర్తి చేస్తామని తెలిపారు.

నేటి నుంచి నెల్లూరులో ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి-నెల్లూరు

ఎపిఎస్‌ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర 12వ మహాసభ గురువారం నుంచి నెల్లూరులో జరగనుంది. నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నేటి నుంచి రెండ్రోజులపాటు ఈ మహాసభ నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ జిలానీ బాషా, సిహెచ్ సుందరయ్య తెలిపారు. ఈ మహాసభలో ఆల్ ఇండియా రోడ్డు, ట్రాన్స్‌పోర్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మయ్య, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గఫూర్ పాల్గొననున్నారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ కార్యాలయంలో జిలానీ బాషా, సిహెచ్ సుందరయ్య బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఆర్‌టిసి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం మేలు చేయకపోగా కీడుతలపెడుతోందని విమర్శించారు. కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసినప్పటికీ వారికి రావాల్సిన బకాయిలు నేటికి చెల్లించలేదన్నారు. ఏడు సంవత్సరాల నుంచి లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించలేదని తెలిపారు. 2017 పే స్కేల్ అరియర్స్ రూ.1400 కోట్ల మేర ప్రభుత్వం బకాయి పడిందన్నారు. ఈ బకాయిని చెల్లించిన తరువాతే ఆర్‌టిసికి వచ్చిన ఆదాయం తీసుకుంటామని ప్రభుత్వం నమ్మబలికిందని, అందుకు విరుద్ధంగా ఆర్‌టిసికి వచ్చిన ఆదాయంలో 25 శాతం తీసుకుంటోందని తెలిపారు. జనవరి నుంచి నూరుశాతం ఆదాయం తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించడం దుర్మార్గమన్నారు. ఆర్‌టిసిలో 8200 బస్సులు ఉన్నాయని, వీటిలో 3000 స్క్రాబ్ బస్సులున్నాయని చెప్పారు. ఈ బస్సులు ఎక్కడబడితే అక్కడ నిలిచిపోతున్నాయని, వీటిని మెయిన్‌టైన్ చేయడం చాలా కష్టంతో కూడిన పని అన్నారు. కొత్త బస్సులను ప్రభుత్వం కొనుగోలు చేయకుండా, సిబ్బందిని రిక్రూట్‌మెంట్ చేయకుండా సంస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. పై సమస్యలపై మహాసభలో చర్చించి, భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామన్నారు. ఈ మహాసభకు రాష్ట్రం నలుమూలల నుంచి తరలిరానున్నారని తెలిపారు.

ట్రూఅప్ భారం సంగతేంటి?

- ఇప్పటికే రూ.2,900 కోట్లు వసూలు చేస్తున్న డిస్కమ్‌లు
- పెండింగ్‌లో రూ.1108 కోట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ పంపిణీ సంస్థలు ఎపిఇఆర్‌సికి సమర్పించిన ఆదాయ అవసర నివేదిక (ఎఆర్‌ఆర్)ల్లో ట్రూ అప్ ఛార్జీలపై ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే ప్రజల నుంచి డిస్కంలు రూ.2,900 కోట్లు వసూలు చేస్తున్నాయి. మరో రూ.1048 కోట్ల భారం పెండింగ్‌లో ఉంది. ఎఆర్‌ఆర్‌లో ఈ అంశాలు పొందుపరచలేదు. 2023-24 ఆదాయ అవసర నివేదికలను (ఎఆర్‌ఆర్) డిస్కంలు మంగళవారం సమర్పించిన విషయం తెలిసిందే. గతేడాది ఇచ్చిన ఎఆర్‌ఆర్‌లో రూ.6,165 కోట్ల ట్రూఅప్ భారాన్ని వినియోగదారులపై డిస్కమ్‌లు ప్రతిపాదించాయి. ఈ ట్రూఅప్ భారాన్ని రద్దు చేయాలని ప్రజాసంఘాలు, వినియోగదారులు ఆందోళనలు చేయడంతో రూ.2,910 కోట్లకు ఇఆర్‌సి అనుమతించింది. ఈ అనుమతి ఇచ్చిన ఛార్జీలను డిస్కమ్‌లు ఈ ఏడాది ఆగస్టు నుంచి వసూలు చేస్తున్నాయి. యూనిట్‌కు 0.23పైసలు చొప్పున ఎపిఎస్‌పిడిసిఎల్, 0.22పైసలు చొప్పున ఎపిసిపిడిసిఎల్ 36 నెలలు పాటు వసూలు మొదలుపెట్టాయి. ఇపిడిసిఎల్ యూనిట్‌కు 0.07పైసలు చొప్పున 18 నెలల పాటు ఇప్పటికే వసూలు చేస్తోంది. 2021-22 చివరి త్రైమాసికంలో తమకు నష్టాలు వచ్చాయని రూ.1048 కోట్లను డిస్కమ్‌లు ఈ ఏడాది ఆగస్టు 11న ఇఆర్‌సికి ప్రతిపాదించాయి. ప్రస్తుతం దీనిపై ఇఆర్‌సి ఒకసారి విచారణ జరిపింది. సరఫరా వ్యాపారంలో ట్రూఅప్ కింద ఈసారి రూ.285.77 కోట్లను ఎస్‌పిడిసిఎల్ చూపించింది. 2023-23లో కూడా ఆదాయ లోటు రూ.11,911 కోట్లు డిస్కమ్‌లు సమర్పించాయి. ఇందులో రూ.11,123.21 కోట్లు రాయితీ ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అన్ని రాష్ట్రాల కంటే టారిఫ్ ఎపిలోనే తక్కువ అని చెబుతూ శ్లాబుల మార్పుతో రూ.1400 కోట్ల మేర భారం ప్రజలపై మోపింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఎఆర్‌ఆర్‌లో మూడు డిస్కమ్‌లు రూ.12,782 కోట్లు ఆదాయ లోటుగా చూపించాయి. ఈ లోటును ఎలా భర్తీ చేసుకుంటారన్న విషయాన్ని గోప్యంగా ఉంచాయి. ఈ భారం ఎవరిపై పడనుందన్న విషయం చర్చనీయాంశంగా మారింది. దీంతో మళ్లీ ట్రూఅప్ వసూలుకు డిస్కమ్‌లు ప్రతిపాదిస్తాయనే ఆందోళన వినియోగదారుల్లో నెలకొంది.

జగనన్న ఊళ్లు ఎప్పుడు కడతావు ?

- మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జగనన్న ఊళ్లు ఎప్పుడు కడతావని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ప్రశ్నించారు. పైసా భారం పడకుండా రాష్ట్రంలో ఇళ్లులేని పేదలందరికీ తన ప్రభుత్వమే 30 లక్షల ఇళ్లు నిర్మిస్తుందని జగన్ గొప్పలు చెప్పుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూమ్ యాప్ ద్వారా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా ఇళ్ల నిర్మాణంలో జగన్ వైఫల్యాన్ని ఎత్తిచూపిందని విమర్శించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం కింద మూడున్నరేళ్లల్లో ఎపి ప్రభుత్వం ఐదిళ్లు మాత్రమే నిర్మించినట్లు తెలిపిందని పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణం పేరుతో వైసిపి నేతలు చేసిన వందల కోట్ల అవినీతిని నిరూపించడానికి తాము సిద్ధమని పేర్కొన్నారు.

అమూల్‌కు రాష్ట్ర డైయిరీలు తాకట్టు:బిఎన్ రాజసింహులు

రాష్ట్రంలో కోఆపరేటివ్ డెయిరీలన్నింటిని సిఎం జగన్ అమూల్‌కు తాకట్టు పెడుతూ పాడిరైతులను బానిసలను చేస్తున్నారని టిడిపి ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒంగోలు, చిత్తూరు డెయిరీలను నిర్వీర్యం చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. చిత్తూరు డెయిరీని ఏడాదికి కోటిచొప్పున 99 ఏళ్ల పాటు అమూల్‌కు లీజుకు ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ప్రైవేట్ డెయిరీల కంటే అమూల్ డెయిరీ పాడిరైతులకు లీటర్‌పాలకు రెండు రూపాయల నుండి మూడు రూపాయలు తక్కువ ఇస్తోందని, రైతులను బెదిరించి ప్రభుత్వం పాలుపోయిస్తోందని అన్నారు. మూడున్నరేళ్లలో రూ.3 లక్షల కోట్ల ప్రజాధనాన్ని జగన్ లూఠీ చేశారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు.

'ఆశా' పోస్టుల కుదింపు!

(మొదటి పేజీ తరువాయి)

అదనంగా చేరనున్నాయి. దీంతో, గర్భిణులు, చిన్నారులకు సకాలంలో వైద్య సేవలు అందడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఖర్చు తగ్గించుకునేందుకేనా?

ఆశాలకు వేతనాల రూపంలో చెల్లిస్తున్న ఖర్చును తగ్గించుకునేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా చర్చ సాగుతోంది. ఆశాలకు గతంలో ప్రసవాలు, నవజాత శిశువులు, కుటుంబ నియంత్రణ, ఇమ్యునైజేషన్ తదితర పనులు మాత్రమే ఉండేవి. ప్రసవానికి రూ.250, కుటుంబ నియంత్రణకు రూ.100, ఇమ్యునైజేషన్‌కు రూ.100 ఇలా పనికి తగిన పారితోషికం ఇచ్చేవారు. ఆశాల ఆందోళనల ఫలితంగా 2018 ఆగస్టులో అప్పటి టిడిపి ప్రభుత్వం వీరికి నెలకు రూ.2,800 చెల్లించేది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వైసిపి ప్రభుత్వం 2019 జులై నుంచి నెలకు రూ.పది వేలు చెల్లిస్తున్నట్లు ప్రకటించింది. వేతనాలు పెంచిన ప్రభుత్వం అంతకుమించిన పనులను వారికి అప్పగించింది. గతంలో నిర్వర్తించిన విధులతోపాటు సచివాలయాల పరిధిలో ఇంటింటికీ వెళ్లి కుటుంబాల ఆరోగ్య పరిస్థితి, బిపి, సుగర్, లెప్రసీ, కుష్టు వ్యాధి తదితర సర్వేలన్నీ వీరితోనే చేయిస్తోంది. పొరుగునే ఉన్న సచివాలయాలనూ అప్పగిస్తే వారిపై మరింత పనిభారం పెరగనుంది.

అర్హతలనూ మార్చిన ప్రభుత్వం

ఆశా పోస్టులకు ఇప్పడున్న అర్హతల్లోనూ మార్పు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ఆశా కార్యకర్తగా పనిచేయాలంటే గతంలో ఎనిమిదో తరగతి అర్హత కాగా, ప్రస్తుతం దాన్ని పదో తరగతికి మార్చింది. అర్బన్ ప్రాంతాల్లో పదో తరగతి అర్హతగా పేర్కొన్నా ఇంటర్, ఎఎన్‌ఎం, జిఎన్‌ఎం తదితర అర్హతలు ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొంది. వీటితోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు ఉండాలని నిర్దేశించింది.

సాయి అశ్విత, చక్రవర్తికి శుభాకాంక్షలు చెబుతున్న సిఎం జగన్మోహన్ రెడ్డి

వివాహ వేడుకల్లో సిఎం జగన్

ప్రజాశక్తి - తగరపువలస, గుంటూరు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బుధవారం రెండు వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. విశాఖ జిల్లా భీమునిపట్నం మండలం దాకమర్రి జంక్షన్ వద్దగల రఘు ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన విజయనగరం జిల్లా నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కుమారుడి వివాహానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. నూతన వధూవరులు మణిదీప్, స్నేహను ఆశీర్వదించారు. తిరిగి విశాఖ నుంచి విజయవాడ చేరుకున్నారు. అక్కడి నుంచి గుంటూరు జిల్లా మంగళగిరిలోని సికె కన్వెన్షన్‌లో మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ కుమార్తె వివాహనికి సిఎం హాజరయ్యారు. నూతన వధూవరులు సాయి అశ్విత, మంచుకొండ చక్రవర్తిని ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో మంత్రులు బొత్స సత్యనారాయణ, తానేటి వనిత, బూడి ముత్యాలనాయుడు, విడదల రజని, టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పల్నాడు, బాపట్ల పట్టణాభివృద్ధి సంస్థల ఏర్పాటుపై పున:పరిశీలన చేయండి

సిపిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బాపట్ల, పల్నాడు పట్టణాభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర కేబినెట్ చేసిన నిర్ణయాన్ని పున:పరిశీలన చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు సిపిఎం రాష్ట్రకమిటీ తరుపున బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పల్నాడు పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలోకి ఎనిమిది మున్సిపాలిటీలతోపాటు 28 మండలాల్లోని 349 గ్రామాలు, బాపట్ల పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలోకి రెండు మున్సిపాలిటీలు, తొమ్మిది మండలాలు 101 గ్రామాలను తీసుకోవడం సరైంది కాదని పేర్కొంది. పట్టణాలు అభివృద్ధి చెందితే ఏర్పాటు చేయాలి తప్ప, గ్రామీణ ప్రాంతాలన్నీ కలిపి పట్టణాభివృద్ధి సంస్థగా ఏర్పాటు చేయడం అప్రజాస్వామికమని పేర్కొంది.

ఈ పట్టణాభివృద్ధి సంస్థల ఏర్పాటు వల్ల పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం కావడంతోపాటు రియల్ ఎస్టేట్ పెరిగి వ్యవసాయం దెబ్బతింటుందని తెలిపింది. ఆదాయాలలో తీవ్ర అసమానతలు ఉండే ప్రాంతాలను ఒకే పరిధిలోకి తీసుకురావడం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, వ్యవసాయాన్ని దెబ్బతీయడమే అవుతుందని పేర్కొంది. అభివృద్ధికి ప్రణాళికలు చేయాలన్నా సాధ్యం కాని పని అవుతుందని, పెద్దసంఖ్యలో గ్రామీణ ప్రాంతాలను విలీనం చేయడమంటే ఇక నుంచి పల్లెల్లో కూడా పట్టణాలతో సమానంగా పన్నులు, నిర్మాణాలకు ప్లానింగ్ అనుమతులు తీసుకోవాల్సి వుంటుందని తెలిపింది. రహదారులు, పారిశ్రామిక వాడల ఏర్పాటు కోసం భూములు సమీకరించాల్సి వుంటుందని పేర్కొంది. గ్రామీణ ప్రజలపై పన్నులు, ఫీజుల పేరుతో పెనుభారాలు మోపడం తప్ప మరొకటి కాదని, భవిష్యత్తులో తమ భూములు కోల్పోతామని ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపింది. సిఆర్‌డిఎను నిర్వీర్యం చేసేందుకే బాపట్ల, పల్నాడు పట్టణాభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేస్తున్నారనే అనుమానం ప్రజలలో ఏర్పడిందని, ఈ అనుమానాలను ప్రభుత్వమే నివృత్తి చేయాలని కోరింది. పట్టణాభివద్ధి సంస్థల ఏర్పాటుపై ప్రభుత్వం పునరాలోచించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది.

జగన్‌ను ఓటమి భయం వెంటాడుతోంది

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఎం వైఎస్ జగన్ ముందస్తు ఎన్నికలకు వెళ్లేందుకు ఆలోచన చేస్తున్నారని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతున్న విషయం జగన్‌కు అర్థమయిందని తెలిపారు. ఎన్నికలకు 'మే'లో వెళ్లాలా ?, 'అక్టోబర్'లో వెళ్లాలా, లేక 2024 వరకు ఆగాలా అనే అంశంపై ఆలోచనలో పడ్డారని పేర్కొన్నారు. 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంపై చంద్రబాబు టిడిపి నేతలతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైసిపి చిత్తుగా ఓడిపోవడం ఖాయమన్నారు. టిడిపి చేపట్టిన 'బాదుడే బాదుడు', 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాలతో అన్ని వర్గాల ప్రజలు బయటకు వచ్చి తమ సమస్యలపై చర్చిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీయడంతో అర్హులకు పెన్షన్లు, ఇతర పథకాలు నిలిపేస్తూ కోతలు పెడుతున్నారని విమర్శించారు. రైతులు ధాన్యం అమ్ముకునేందుకు నానా కష్టాలు పడుతున్నా ప్రభుత్వం కనీస స్థాయిలో స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ విధానాలతో అటు రాష్ట్రం, ఇటు ప్రజలు వ్యక్తిగతంగా అప్పుల పాలయ్యారని మండిపడ్డారు. 13వ తేదీ దాటినా నేటికీ ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి గతంలో ఎన్నడూ తలెత్తలేదని అన్నారు. టిడిపి ప్రభుత్వం పేదలకు 12 లక్షల ఇళ్లు నిర్మిస్తే, వైసిపి ప్రభుత్వం మూడున్నరేళ్లల్లో ఐదు ఇళ్లు మాత్రమే నిర్మించిందని తెలిపారు. దక్షిణ భారతదేశంలో తలసరి ఆదాయంలో అన్ని రాష్ట్రాల కంటే ఎపి వెనుకబడి పోవడానికి కారణం జగన్ విధానాలేనని విమర్శించారు.

పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధిహామీ అమలు

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రాంతాలతోపాటు, నూతనంగా ప్రకటించిన పల్నాడు, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల్లో జాతీయ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలతో 37 మండలాల పరిధిలోని గ్రామాల్లో పేదలు పనులు కోల్పోయే ప్రమాదం వుందని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణ ప్రాంతాల్లో కూడా జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేసిన తర్వాతే అర్బన్ అథారిటీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నర్సారావుపేట కేంద్రంగా ఏర్పాటయ్యే పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి పరిధిలోకి 28 మండలాలు, ఎనిమిది పట్టణాలు, 349 గ్రామాలు వస్తాయని, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి తొమ్మిది మండలాల పరిధిలో 101 గ్రామాలు వస్తాయని తెలిపారు. ఈ రెండు అథారిటీల్లో 450 గ్రామాల పరిధిలో జాతీయ ఉపాధిహామీ పనులు నిలిచిపోయే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిల్లోనూ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

18న జనసేన కౌలురైతు భరోసా యాత్ర

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి ప్రభుత్వ విధానాలతో రైతులు విసిగిపోయారని, ఈనెల 18న సత్తెనపల్లిలో జనసేన కౌలు రైతు భరోసా యాత్ర నిర్వహిస్తామనిజనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడారు. కౌలు రైతు భరోసాయాత్రలో పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పాల్గొని, ఆత్మహత్య చేసుకున్న ప్రతి కౌలు రైతు కుటుంబానికి లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తారని తెలిపారు. గుంటూరు జిల్లాలో 280 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. జిందాల్ సంస్థకు కడప స్టీల్స్ ఇవ్వడంలో లబ్ధి ఎవరికి ? రూ.5 వేలకోట్ల రాయితీ వెనుక మతలబులేమిటని నాదెండ్ల మనోహర్ ప్రశ్నించారు.

ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్
ప్రాంతీయ కార్యాలయం : సురభి ఆర్కేడ్, బ్యాంక్ వీధి, కోఠి, హైదరాబాద్-500001.
ఫోన్: 040-23468851. ఈ-మెయిల్: 0808sec@iobnet.co.in

టెండరు ప్రకటన

హైదరాబాద్, వరంగల్, విజయవాడ & విశాఖపట్నం రీజియన్లలోని బ్రాంచ్‌లలో నెట్‌వర్క్ బేస్డ్ సిసి టివి సిస్టమ్స్ సరఫరా, అమర్చుట & నిర్వహణ కొరకు టెండర్లు ఆహ్వానిస్తున్నాము. పూర్తి వివరములు, విధివిధానం, నియమ & నిబంధనల కొరకు బ్యాంక్ యొక్క వెబ్‌సైట్ https://www.iob.in/TenderDetails.aspx?Tendertype=Tender నందు లాగిన్ అవ్వగలరు. ఇరత వివరములకై సంప్రదించవలసిన మొబైల్ నెం.లు. విజయవాడ - 8500614618, విశాఖపట్నం - 9492389891, హైదరాబాద్ & వరంగల్ 8309519267. టెండరు సమర్పించుటకు ఆఖరి తేదీ : 05-01-2023 (17.00 గం.లలోపు)

సం/- చీఫ్ రీజనల్ మేనేజర్

వెంకటేష్ మృతదేహం

పైడి రవి (ఫైల్)

ధనంజయరావు (ఫైల్)

విద్యుదాఘాతంతో ముగ్గురు మృతి

- శ్రీకాకుళంలో ఇద్దరు నెల్లూరులో ఒకరు..

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, మర్రిపాడు

విద్యుదాఘాతంతో ముగ్గురు మరణించారు. వ్యవసాయ పనులకు వెళ్లి ఒకరు.. రైస్ మిల్లులో విద్యుత్ లైట్లు మార్చుతుండగా ఒకరు..అతన్ని కాపాడే క్రమంలో మరొకరు మరణించారు. ఈ రెండు ఘటనలు నెల్లూరు, శ్రీకాకుళం జిల్లాల్లో బుధవారం చోటు చేసుకున్నాయి.పోలీసుల వివరాల మేరకు..

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కుశాలపురంలో మోడరన్ రైస్ మిల్లును వైసిపి నేత పైడి రవి నిర్వహిస్తున్నాడు. మిల్లులోని 30 అడుగుల ఎత్తులో ఉన్న విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో వాటిని సరిచేయాలని ఎలక్ట్రీషియన్ ధనుంజయరావు (31)కు చెప్పాడు. ఇనుప లేడర్‌ను తీసుకెళుతుండగా..33కెవి విద్యుత్ తీగలు తగిలి ధనుంజయరావు, రవి షాక్‌కు గురయ్యాడు. వారిద్దరినీ కాపాడేందుకు కర్రతో కొట్టిన స్థానికుడు నర్సింగరావు కూడా విద్యుతాఘాతానికి గురయ్యాడు. స్థానికులు గమనించి వారందరినీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రవి, ధనుంజయరావు మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. నర్సింగరావు చికిత్స పొందుతున్నాడు. మిల్లు యజమాని రవి మృతిపై రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

నెల్లూరు జిల్లా మర్రిపాడు టౌన్‌కు చెందిన వెంకటేష్ (21) వ్యవసాయ కూలి పనులకు వెళ్లేవాడు. ఓ రైతు సాగు చేసిన మిరప తోటలో కూలి పనులకు వెళ్లారు. పక్క తోట రైతు తన పొలానికి కంచె వేశారు. మంచినీటి కోసం వెంకటేష్ పక్క పొలంలోకి వెళ్తుండగా.. విద్యుత్ సరఫరా అవుతున్న కంచె తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మరణించారు.

రైతులను ఆదుకోవాలి

- ఇన్‌పుట్ సబ్సిడీ రూ.25 వేలు ఇవ్వాలి
- పాత పద్ధతిలో ఇన్సూరెన్సు విధానం అమలు చేయాలి : వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

మాండూస్ తుపాను కారణంగా నష్టపోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు, చదలవాడ గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న పొగాకు, మిర్చి పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఒంగోలులో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పత్తి, మిర్చి, పొగాకు పంటలతోపాటూ అన్ని పంటలూ దెబ్బతిన్నాయని తెలిపారు. పంటలన్నీ ఇంకా ఇంకా నీళ్లలోనే ఉండడంతో ఎందుకూ పనికిరాకుండా పోయాయన్నారు. తిరిగి అవకాశం ఉన్న పంటలు వేసుకునేందుకు ప్రభుత్వం రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.25 వేలు ఇవ్వాలని కోరారు. ఇప్పటికే రైతులు పొగాకు, మిర్చికి రూ.50 వేలు, శగనకు రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టారన్నారు. శనగ విత్తనాలు పూర్తి సబ్సిడీపై ఇవ్వాలని కోరారు. పాత ఇన్సూరెన్సు విధానాన్ని రద్దు చేయడం వల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. ఇప్పుడు కేంద్రమే బీమా పథకాన్ని అమలు చేస్తోందని, దాని ప్రకారం ఎప్పుడో నూర్పిడి పూర్తయ్యాక క్రాప్ కటింగును బట్టి పరిహారం ఇస్తుందని తెలిపారు. దాని వల్ల రైతులకు ఎటువంటి లాభమూ ఉండదన్నారు. రైతుల నుంచి వసూలు చేసిన బీమా ప్రీమియంలో 40 శాతం మాత్రమే పరిహారం

నీట మునిగిన శనగ పంటను పరిశీలిస్తున్న వి.శ్రీనివాసరావు

రూపంలో చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. రైతులను ప్రయివేటు బీమా కంపెనీలు దోచుకుంటున్నాయని, పాత ఇన్సూరెన్సు విధానాన్ని పునరుద్ధరించి మునిగిన పంటలను ఎన్యూమరేషన్ చేసి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులను వెంటనే క్షేత్ర స్థాయికి పంపించి పంట నష్టం అంచనా వేయాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులను ఆదుకోకుంటే రైతులపక్షాన పోరాటాలు తప్పవని హెచ్చరించారు. నష్టపోయిన పంటల పరిశీలించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, జిల్లా నాయకులు పూనాటి ఆంజనేయులు, రైతు సంఘం, కౌలు రైతుసంఘం నేతలు ఎస్‌కె.మాబు, బాలకోటయ్య, జయంతిబాబు, శ్రీకాంత్ ఉన్నారు.

ఇ-ఆక్షన్ ద్వారా మైనింగు లీజు : మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

లక్ష్యానికి అనుగుణంగా మైనింగు రెవెన్యూ సాధించాలని రాష్ట్ర గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. మైనింగు ప్రారంభించని చోట్ల లీజు రద్దు చేయాలని పేర్కొన్నారు. గనుల శాఖపై బుధవారం సచివాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్ మైనింగులో అనేక సంస్కరణలు తీసుకొచ్చారని వివరించారు. దీనిలో భాగంగా ఇ - ఆక్షన్ విధానాన్ని ప్రవేశపెట్టారని, గతంలో మొదట వచ్చిన వారికి ప్రాధాన్యత అనే క్రమంలో పెట్టడం వల్ల కొత్తవారికి అవకాశం లేకుండా పోయిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఖనిజ వనరులు అపారంగా ఉన్నాయని, వాటిని వెలికితీసి పరిశ్రమలకు ఉపయోగిస్తే వాటికీ ప్రోత్సాహం లభిస్తుందని, నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందని తెలిపారు. ప్రస్తుతం గుర్తించిన అన్ని మైనింగు ఏరియాల్లో తప్పనిసరిగా ఆపరేషన్స్ ప్రారంభం కావాలని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రారంభం కానిచోట అనుమతులు రద్దు చేయాలని ఆదేశించారు. మైనింగు ద్వారా ఐదువేల కోట్ల రూపాయల ఆదాయం ఆర్జించాలనే లక్ష్యానికి అనుగుణంగా అధికారులు పనిచేయాలని సూచించారు. ఈ ఆక్షన్ విధానంపై అందరికీ అవగాహన కల్పించాలని, గుర్తించిన మైనింగ్ ప్రాంతాల్లో ఔత్సాహికులతో సమావేశాలు నిర్వహించాలని అన్నారు. రాష్ట్రంలో మొత్తం మీద మైనర్ మినరల్స్‌కు సంబంధించి 33 ఏరియాలకు ఈ ఆక్షన్ నిర్వహించాల్సి ఉండగా 11 ఏరియాలకు విజయవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు. సీనరేజి వసూళ్లను అవుట్‌సోర్సింగ్ కింద చేపట్టడం ద్వారా మైనింగ్ ఆదాయం పెరుగుదలను పరిశీలించాలని, అన్ని ఏరియాల్లో దీన్ని వర్తింపజేసేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మైనింగ్ డైరెక్టర్ విజి వెంకటరెడ్డి, డిప్యూటీ సెక్రటరీ రమాదేవి, జాయింట్ డైరెక్టర్ రాజబాబు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జగనన్న సాంస్కృతిక సంబరాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖ నగరంలోని వుడా చిల్డ్రన్స్ థియేటర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న జోనల్ స్థాయి జగనన్న స్వర్ణోత్సవ సంబరాలు రెండో రోజూ ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక ప్రదర్శనలను టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి బుధవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన కళాకారులు సంప్రదాయ నృత్యాలు, గాత్రం, జానపద కళారూపాలు, తప్పెటగుళ్లు, కాళికా వేషాలు, థింసా నృత్యాలతో అలరించారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజనాభివృద్ధి శాఖ మంత్రి ఆర్‌కె రోజా కోలాటం ఆడి, థింసా కళా బృందాలతో కలిసి నృత్యం చేసి ఉత్సాహం నింపారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న కళాకారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ పోటీలకు ప్రముఖ సంగీత ప్రొఫెసర్ డాక్టర్ మండపాక శారద, నాట్యాచార్యులు శ్రీహరి రామ మూర్తి, భరణి శంకర్, జానపద కళాకారులు

తప్పెటగుళ్లు ప్రదర్శనతో ఆకట్టుకున్న కళాకారులు

నాగరాజ్ పట్నాయక్, విజయ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కోరాడ రామయ్య బృందం తప్పెటగుళ్లు ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రదర్శనలను తిలకించిన వారిలో రాష్ట్ర మంత్రులు విడదల రజిని, గుడివాడ అమర్‌నాథ్, శాసన సభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్ కుమార్, అదీప్ రాజ్, శాసనమండలి సభ్యులు వరుదు కళ్యాణి, వంశీకృష్ణ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ మల్లికార్జున, రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ఛైర్‌పర్సన్ వంగపండు ఉష, మత్స్యశాఖ కార్పొరేషన్ ఛైర్మన్ కోలా గురువులు ఉన్నారు.

మంత్రులతో కలిసి భూమి పూజ చేస్తున్న వైవి సుబ్బారెడ్డి

విశాఖలో వైసిపి కార్యాలయానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పిఎం.పాలెం (విశాఖపట్నం)

విశాఖ ఎండాడలోని పనోరమా హిల్స్ సమీపంలో రెండెకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న వైసిపి కార్యాలయానికి టిటిడి ఛైర్మన్, వైసిపి ప్రాంతీయ సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ విశాఖ పరిపాలనా రాజధాని కానున్న నేపథ్యంలో ఈ కార్యాలయమే భవిష్యత్తులో పార్టీ రాష్ట్ర కార్యాలయం అవుతుందని తెలిపారు. 45 నుంచి 60 రోజుల్లో పార్టీ కార్యాలయ మొదటి దశ పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉండేలా రాష్ట్రంలో అన్ని పార్టీ కార్యాలయాల్లో రోజంతా పని చేసేలా కాల్ సెంటర్లను అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. న్యాయపరమైన చిక్కులు పరిష్కారమైన వెంటనే పాలనా రాజధాని పనులు మొదలు కానున్నట్లు తెలిపారు. జనవరిలో భోగాపురం ఎయిర్‌పోర్టుకు ముఖ్యమంత్రి జగన్ శంకుస్థాపన చేస్తారని చెప్పారు. అదానీ డేటా సెంటర్ అందుబాటులోకి వస్తే విశాఖలోని 40 వేల మందికి ఉపాధి కలుగుతోందని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయని అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు విడదల రజని, గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్ కుమార్, తిప్పల నాగిరెడ్డి, అదీప్ రాజు, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, నెడ్ క్యాప్ ఛైర్మన్ కెకె రాజు, పలువురు ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల డైరక్టర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తిరుమలలో అన్నమయ్య ఇంటిని పునఃనిర్మించాలి: విజయ శంకర స్వామి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుమలలో శ్రీ వెంకటేశ్వరస్వామికి పరమ భక్తుడైన తాళ్లపాక అన్నమాచార్యులు నివాసమున్న ఇంటిని కూల్చడం దారుణమనిఅన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయ శంకర స్వామి అన్నారు. ఆ ఇంటిని వెంటనే పున్ణనిర్మించాలని డిమాండ్ చేశారు. అన్నమయ్య గృహ సాధన సమితి, జై భారత్ సంస్థలు సంయుక్తంగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించిన యాత్రలో 11 లక్షల 50 వేల సంతకాలను సేకరించామన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ యాత్రకు కోవిద సహృదయ ఫౌండేషన్, చినుకు కల్చర్ సొసైటీ తదితర అనేక కళాత్మక సంస్థలు చేయూతను అందించాయన్నారు. మాడవీధుల విస్తరణలో భాగంగా 2003లో తిరుమలలోని శ్రీ వరాహస్వామి ఆలయం వెనుక ఉన్న అన్నమయ్య ఇంటిని, ఆయన పూజించిన హనుమంతుని విగ్రహాన్ని టిటిడి తొలగించిందని తెలిపారు. నాటినుండి అన్నమయ్య ఇంటిని పున్ణనిర్మించాలని చాలామంది అనేక వినతులు ఇచ్చినా టిటిడి పెడచెవిన పెట్టడం శోచనీయమన్నారు. అగ్రవర్ణ పెద్దరికాన్ని కాపాడడానికి టిటిడి ఆరాటపడుతోందని విమర్శించారు. భగవంతుని ముందు మనుషులందరూ ఒక్కటే అని తన గేయం ద్వారా లోకానికి తెలియజేసిన అన్నమయ్యకు టిటిడి ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. అక్టోబర్ ఐదు నుండి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో డిసెంబర్ పదోవ తేదీ వరకు దాదాపు పదివేల కిలోమీటర్లు యాత్ర నిర్వహించి శ్రీవారి భక్తుల నుండి లక్షా 50 వేల సంతకాలకు చెందిన 115 పుస్తకాలతో ఈ నెల 16న టిటిడి పరిపాలన భవనం వద్ద వినతి ఇస్తామని తెలిపారు. అనుమతించని పక్షంలో అదే లక్షమందితో తిరుమలలో తామే అన్నమయ్య ఇంటిని పున్ణనిర్మించుకోవ డానికి పయనమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య గృహ సాధన సమితి కార్యదర్శి త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అనంతబాబు విడుదల

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కారు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యకేసులో రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న ఎమ్మెల్సీ అనంతబాబు బుధవారం బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ హత్య కేసులో ఈ ఏడాది మే 23న అనంతబాబును కాకినాడలోని ప్రత్యేక మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. అప్పటి నుంచి ఆయన రాజమహేంద్రవరంలోని సెంట్రల్ జైల్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. పలుమార్లు జిల్లా, హైకోర్టులో బెయిల్ కోసం ప్రయత్నించారు. పోలీసులు ఛార్జిషీట్‌ను సకాలంలో వేయకపోవడంతో రిమాండ్‌ను పొడిగిస్తుండడంతో అనంతబాబు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో మంగళవారమే సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. గురువారం రాజమహేంద్రవరం ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కోర్టు రూ.50 వేలతో ఇద్దరు పూచీకత్తు పెట్టాలని, పాస్‌పోర్టును కోర్టులో హాజరుపర్చాలని, విదేశాలకు వెళ్లకూడదనీ కోర్టు షరతులు విధించి బెయిల్ మంజూరు చేసింది. గురువారం రాత్రి ఏడు గంటల సమయంలో ఆయన సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి

బదిలీల్లో అక్రమాలపై ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి - అనకాపల్లి

బదిలీల్లో అక్రమాలను నిరసిస్తూ అనకాపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద బుధవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. కౌన్సిలింగ్ ప్రక్రియను తుంగలో తొక్కి ఉపాధ్యాయుల బదిలీలను దొడ్డిదారిన చేపడుతుండడం దారుణమని, తక్షణమే ఆ ప్రక్రియను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. జిఒ నెంబర్ 187ను అనుసరించి బదిలీలు జరుగుతాయనుకుంటున్న నేపథ్యంలో 129 మందిని నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సుల మేరకు అక్రమ బదిలీలు చేయడం వల్ల సీనియర్ ఉపాధ్యాయులకు, మారుమూల గ్రామాల్లో పనిచేసే వారికి తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. జిల్లాల విభజన నేపథ్యంలో తమ సొంత జిల్లాలకు బదిలీపై వెళ్దామని ఆశిస్తున్న ఉపాధ్యాయులకు తీవ్ర నిరాశే మిగలనుందని తెలిపారు. ఉపాధ్యాయులకు నష్టం చేకూర్చే చర్యలు తగవన్నారు. ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయులకు న్యాయం చేయకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి జిఎస్.ప్రకాష్, నాయకులు శ్రీకాంత్, దేవుడు నాయుడు, లక్ష్మి పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

పారిశ్రామికాభివృద్ధితో ఉపాధి అవకాశాలు

- ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి జిల్లా)

ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు వంటి విభజన హామీలపై కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అడుగడుగునా అన్యాయం చేస్తోందని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు అన్నారు. వచ్చే నెల 2, 3, 4 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరగనున్న సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ నేపథ్యంలో బుధవారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో 'పారిశ్రామికాభివృద్ధికి అవకాశాలు-అవరోధాలు' అనే అంశంపై జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన జరిగిన సదస్సులో లక్ష్మణరావు పాల్గొని మాట్లాడారు. పరిశ్రమలు ఏర్పాటైన చోటే జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. విశాఖపట్నం అభివృద్ధికి అక్కడ పరిశ్రమలు, పోర్టులు, హార్బర్, స్టీల్‌ప్లాంటే కారణమని అన్నారు. విశాఖ ఉక్కును మోడీ ప్రభుత్వం ప్రయివేటీకరించాలని చూడడం దారుణమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 600 కళాశాలలు ఉన్నాయని, సంవత్సరానికి సుమారు మూడు లక్షల మంది యువత నిరుద్యోగులుగా మారుతున్నారని తెలిపారు. విభజన హామీలు అమలై ఉంటే రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి సాధించి ఉపాధి అవకాశాలు పెరిగేవన్నారు. విభజన హామీలను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని వైసిపి, టిడిపి నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం మానుకొని విభజన హామీలపై కేంద్రంతో పోరాడాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని, ముందుగా అక్కడి నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. సదస్సులో భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షులు కనుమూరి సత్యనారాయణరాజు, బిల్డర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు గన్నాబత్తుల శ్రీనివాస్, ప్యాడీ అండ్ రైస్‌మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు చవ్వాకుల నరసింహారావు, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కురిసేటి రాజా, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జి.జేమ్స్, సిఐటియు నేతలు పాల్గొన్నారు.

ఐడిబిఐ బ్యాంక్ బిడ్ల దాఖలుకు గడువు పెంపు

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని ఐడిబిఐ బ్యాంక్ ప్రయివేటీకరణకు వీలుగా బిడ్ల దాఖలకు గాను గడువును పొడిగించినట్లు డిజిన్వెస్ట్‌మెంట్ శాఖ (దీపమ్) వెల్లడించింది. 2023 జనవరి 7 వరకు బిడ్లను నమోదుకు అవకాశం కల్పించినట్లు పేర్కొంది. తొలుత ప్రకటించిన గడువు ముగియనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం, ఎల్‌ఐసికి ఐడిబిఐ బ్యాంక్‌లో 94.71 శాతం వాటాలున్నాయి. ఇందులో 60.72 శాతం వాటాను విక్రయానికి పెట్టింది. విదేశీ ఇన్వెస్టర్లు కూడా దీన్ని స్వాధీనం చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం నిబంధనలు సడలించింది.

5.85 శాతానికి టోకు ద్రవ్యోల్బణం సూచీ

న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాది నవంబర్‌లో టోకు ద్రవ్యోల్బణం సూచీ (డబ్ల్యుపిఐ) 5.85 శాతంగా నమోదయ్యింది. ఆహార పదార్థాలు, చమురు, తయారీ వస్తువుల ధరలు తగ్గుముఖం పట్టడంతో ఈ సూచీ 21 నెలల కనిష్టానికి దిగివచ్చినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 19 నెలలు పాటు ఈ సూచీ రెండంకెల సంఖ్యలోనే నమోదయ్యింది. అక్టోబర్‌లో తొలిసారి 8.39 శాతానికి తగ్గగా.. గతేడాది నవంబర్‌లో 14.87 శాతంగా చోటు చేసుకుంది.

బ్యాంకుల సహకారంతో అన్ని నియోజకవర్గాల్లో స్కిల్ హబ్స్

- కొత్త శిక్షణ కోర్సులపై బ్యాంకర్లకు ప్రభుత్వ సూచన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర వ్యాప్తంగా యువతలో వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు గాను ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్న స్కిల్ హబ్‌లకు బ్యాంకర్ల సహాయం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలల సమన్వయంతో, వాటిలో అందుబాటులో ఉన్న స్వల్పకాల శిక్షణ కోర్సుల ఆధారంగా స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. హబ్‌లలో ఏ స్థాయిలో శిక్షణ ఇవ్వాలి, ఏయే కోర్సుల్లో శిక్షణ ఇవ్వాలన్న దానిపై ఇప్పటికే మార్గదర్శకాలు సిద్ధం చేసినట్లు తెలిసింది.

హబ్‌ల ఏర్పాటుకు ఆర్థిక, సాంకేతిక సాయం అందించడంతోపాటు క్షేత్రస్థాయిలో మరిన్ని సేవలకు బ్యాంకర్లు ముందుకు రావాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది. ఇప్పటికే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంకు, ఇండియన్ బ్యాంకు వంటివాటి సహాయంతో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాలు (ఆర్‌ఎస్‌ఇటిఐఎస్) నిర్వహిస్తున్నారు. ఇటువంటివే రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని కేంద్రాలను బ్యాంకుల సహకారంతో ఏర్పాటుచేయాలని తాజాగా ప్రతిపాదిస్తున్నారు. ఈ కేంద్రాల ద్వారా నూతన కోర్సులను ప్రవేశపెట్టి శిక్షణ ఇవ్వాలని భావిస్తున్నారు. ఈ కొత్త కేంద్రాల కోసం అవసరమైన రోడ్ మ్యాప్‌ను కూడా సిద్ధం చేయాలని సంబంధిత శాఖల అధికారులకు ప్రభుత్వం సూచించింది. ఇదే తరహాలో పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక హబ్‌ను, రాష్ట్ర స్థాయిలో ఒక స్కిల్ విశ్వవిద్యాలయాన్ని కూడా ఏర్పాటుచేయాలని, వాటికి కూడా బ్యాంకుల సహకారం తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది.

ఈస్ట్ కోస్ట్ రైల్వే
ప్రకటన నం. eT-East-WAT-35-2022, తేది: 12.12.2022
పని పేరు: వాల్తేరు డివిజన్‌లో సీనియర్ డివిజనల్ ఇంజినీర్/ ఈస్ట్ అధికార పరిధి క్రింద IB సెక్షన్ మరియు స్లాబ్ బ్రిడ్జిలు, వివిధ స్టేషన్ యార్డుల వద్ద పాయింట్లు మరియు క్రాసింగ్స్‌ల డీప్ స్క్రీనింగ్.
సుమారు పని విలువ రూ. 3,27,70,864.99/-, బయానా రూ.3,13,900.00/-, పని పూర్తిచేయుకాలం : 12 (పన్నెండు) నెలలు.
టెండరు ముగింపు తేది మరియు సమయం: 03.01.2023న 1500 గం.లు
సదరు ఇ-టెండర్లపై పోస్ట్/కొరియర్/ఫ్యాక్స్ లేదా వ్యక్తిచే స్వయంగా పంపబడిన మాన్యువల్ ఆఫర్లు, ఒక వేళ వీటిని సరియైన సమయంలో స్వీకరించినను మరియు సంస్థ లెటర్ హెడ్‌పై దాఖలు చేయబడినను అట్టి స్వీకరణ పరిగణించబడదు. సదరు మాన్యువల్ ఆఫర్లు తిరస్కరించబడతాయి. ఇందుకుగాను ఎటువంటి ప్రతిఫలం ఉండదు. ఇ-టెండరు డాక్యుమెంట్లతో కలుపుకొని పై ఇ-టెండరు యొక్క పూర్తి సమాచారం లభించు వెబ్‌సైట్: https://www.ireps.gov.in
గమనిక: కాగోరు టెండరు దారులు ఈ టెండరు కొరకు జారీ చేయబడే ఏదేని మార్పులు మరియు సవరణలు గమనించుటకు టెండరు ముగింపు తేది లోగా 15 (పదిహేను) రోజులలో వెబ్‌సైట్‌ను తిరిగి దర్శించవలసిందిగా సూచించబడుచున్నారు.
డివిజనల్ రైల్వే మేనేజర్ (Engg.) వాల్తేరు.
PR-805/N/22-23

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండర్ నోటీసు
నం.28/2022-23,నిట్ నం.94, తేది: 09.12.2022
గుంటూరు పరిధిలోని సత్తెనపల్లి నియోజకవర్గములో రెంటపాళ్ల గ్రామములోని యస్.పి. కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మించుట. అంచనా విలువ: రూ.50.00లక్షలతో మంజూరైన పనికి టెండర్లు 16.12.2022 నుండి ఇ-ప్లాట్‌ఫారం ద్వారా కోరబడుచున్నవి. వివరాలను www.apeprocurement.gov.in లో చూడగలరు.
సం/- పర్యవేక్షక ఇంజనీరు, పంచాయతీరాజ్, గుంటూరు.
DIPRNo.7079/CL/ADVT/1/1/2021-22

Karur Vysya Bank Smart way to bank
ది కరూర్ వైశ్యాబ్యాంకు లిమిటెడ్
కంకిపాడు బ్రాంచ్, డోర్ నెం.2-104, మెయిన్ రోడ్, ట్రావెలర్స్ బంగ్లా దగ్గర, కంకిపాడు, ఆంధ్రప్రదేశ్-521151.
బంగారు నగల వేలము ప్రకటన
ఈ క్రింది ఉదహరించిన ఖాతాదారుడు బంగారు నగలపై మా శాఖలో అప్పు తీసుకొని సకాలంలో తమ బకాయిలు చెల్లించని కారణంగా బ్యాంక్ నిబంధనలు ప్రకారం తేది.29.12.2022 అనగా గురువారం మధ్యాహ్నం 3.00 గం॥ల నుండి మా బ్రాంచి ఆవరణలో వేలం వేసి బాకీలు వసూలు చేసుకుందామని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.
షరతులు నిబంధనలు : 1) వేలంలో పాల్గొనదలచినవారు ఋణ మొత్తమునకు రూ.10,000/- ధరావత్తు కట్టి వేలంలో పాల్గొనవలెను. 2) హెచ్చు పాటదారుడు మొత్తం సొమ్ము అదేరోజు చెల్లించి వస్తువులను పొందవలెను. 3) నగలు బరువునకు, నాణ్యతకు బ్యాంకు వారి పూచీ ఏమాత్రం లేదు. 4) ఏ విధమైన కారణం చూపకనే వేలం షరతులు మార్చుకొనుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ, వేలం ఆపుటకు గానీ, రద్దు చేయుటకు గానీ బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. 5) అడ్రస్ నిర్ధారించు ఆధార్ కార్డు కాపీని గాని, పాన్‌కార్డు కాపీని జతచేయవలెను. 6) ఈ ఖాతాదారులలో ఎవరైననూ మరణించిన యెడల వారి వారసులకు ఈ ప్రకటన పూర్వకముగా తెలియపరచినట్లుగా భావించవలెను. 7) అప్పు వసూలు నోటీసు అందనివారు మరియు నోటీసులు తిరస్కరించినవారు ఈ ప్రకటన తుది నోటీసుగా భావించి వేలం తేదీలోగా సొమ్ము చెల్లించవలెను. 8) జి.ఎస్.టి. వర్తించబడును. 9) వేలం ద్వారా వచ్చు సొమ్ము బాకీ మొత్తానికి సరిపోనియెడల మరి ఎటువంటి నోటీసు ఇవ్వకనే మీ పైన తీసుకొను చట్టపరమైన చర్యలన్నింటికీ మీ సొంత ఖర్చులపై తీసుకొనగలమని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఖాతా నెం.	ఋణగ్రస్తుని పేరు మరియు చిరునామా	వస్తువులు మొత్తం	బంగారం బరువు గ్రా॥లో
14629520000 10931	శ్రీ కాగిత శశికాంత్, 2-50, పులి రామారావు వీధి, కంకిపాడు, కృష్ణా, ఆంధ్ర-521151	3	50.4
14629530000 12832	శ్రీ అరవపల్లి వెంకట గోపి నాథ్, ప్లాటు నెం.70, విష్ణుపురం కాలనీ, పెనమలూరు మండలం, పోరంకి ఆంధ్రప్రదేశ్-521137	1	6.8

తేది : 14.12.2022, ప్రదేశం : కంకిపాడు అధీకృత అధికారి, ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్, కంకిపాడు

Union Bank of India
ఎడ్లపాడు శాఖ
చిరునామా: డో.నం.6-74/1, మెయిన్ రోడ్డు, ఎడ్లపాడు, గుంటూరు, పిన్-522233, టెలి నం.: 08647-276108.
స్థిరాస్తుల అమ్మకము కొరకై విక్రయ ప్రకటన
సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8 (6) నిబంధనలను చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2022 కింద ఇ-వేలం స్థిరాస్తుల అమ్మకానికి విక్రయ నోటీసు
ఇచ్చిన నోటీసు, సాధారణ ప్రజానీకం మరియు ప్రత్యేకించి రుణగ్రహీత(లు) / సహ - రుణగ్రహీత(లు)/ తాకట్టుదారు(లు) / హామీదారు(లు) కు, తాకట్టు పెట్టిన/ ఛార్జి చేయబడిన దిగువ వివరించిన స్థిరాస్తులను గతంలో ఆంధ్రా బ్యాంక్, ప్రస్తుతం యునియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధికృత అధికారిచే స్వాధీనం తీసుకొన బడినది. వీటిని "ఎక్కడ ఉన్నవి అక్కడే" "ఎలా ఉన్నది అలానే" మరియు "ఏమి ఉంటే అది" ప్రాతిపదికన 31.12.2022 న ఇ-వేలం ద్వారా అమ్మబడును. క్రింద పేర్కొన్న రుణగ్రహీత(లు)/ సహ-అప్లికెంట్(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)ల నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెల్లించవలసిన బకాయి రివకరీ కోసం.
రిజర్వు ధర మరియు ధరావత్తు మొత్తం క్రింద వివరించిన సంబంధిత ఆస్తులకు వ్యతిరేకంగా పేర్కొన్న విధంగా ఉంటుంది:

1) రుణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు): 1) మెసర్స్. గాయత్రి కాటన్ ట్రేడర్స్ ప్రొప్రైటర్. కల్లూరి పవన్ కుమార్, చిరునామా: 6 40 2 పెద్ద బజార్ ఎడ్లపాడు గుంటూరు 522233. 2) పేరు: శ్రీమతి. కల్లూరి నాగ రాణి, చిరునామా: భర్త. కల్లూరి పవన్ కుమార్, 6 40 2 పెద్ద బజార్ ఎడ్లపాడు గుంటూరు 522233.
అసాధారణ మొత్తం: 77,41,879.41/- (డెభై ఏడు లక్షల నలభై ఒక వేల ఎనిమిది వందల డెభై తొమ్మిది రూపాయల నలభై ఒక పైసలు మాత్రమే) 06.04.2021 నాటికి ప్లస్ భవిష్యత్తు వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు.
స్థిరాస్తి వివరణ:
1. స్థలం మరియు భవనం-రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నం.503 4వ అంతస్తు సన్నిధి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ (2 బిహెచ్‌కె ఫ్లాట్) డో.నం.68/1 కొరిటెపాడు జెకెసి కాలేజీ రోడ్డు 7వ లైన్ విజయపురి కాలనీ జిఎస్‌ఆర్ టవర్స్ ఎదురు ఎన్‌ఆర్‌ఐ ఉమన్స్ కాలేజీ గుంటూరు కల్లూరి నాగమణికి చెందిన మరియు కట్టుదిట్టమైన: ఉత్తరం: కె. సుబ్బారావు మరియు ఇతరుల 701/2 అడుగులు., దక్షిణం: బజార్ 701/2 అడుగులు., తూర్పు: ఓ బాపిరెడ్డి మరియు ఇతరులు 115 అడుగులు., పడమర: కె. సుబ్బారావు ఆస్తి ఉమ్మడి 15 అడుగుల వెడల్పు రోడ్డు 113.1/2 అడుగులు.
రిజర్వు ధర: రూ. 43,91,000/- ధరావత్తు: రూ. 4,39,100/-, బిడ్ ఇంక్రిమెంట్: రూ. 43,910/-
2. స్థలం మరియు భవనం- రెసిడెన్షియల్ భవనం డో.నం.6-40/2 డో.నం.362/ఎ పరిధిలో 68.14 చ.గజాలు. ఎన్‌టిఆర్ స్టాచ్యూ సెంటర్ వద్ద ఎడ్లపాడు, గుంటూరు-522233. కట్టుదిట్టమైన : తూర్పు: కొరిటాల బజార్ 24.8, దక్షిణం: ఏలిశెట్టి అంజమ్మ 24.10, పడమర: మారెళ్ల ఆదిలక్ష్మి 24.10, ఉత్తరం: గలి బజార్ 25.6.
రిజర్వుధర:రూ.17,90,000/- ఇఎమ్‌డి:రూ.1,79,000/- బిడ్ ఇంక్రిమెంట్:రూ.17,900/-

2) రుణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు): 1. పేరు: మెసర్స్. లక్ష్మి భార్గవ్ కాటన్ ట్రేడర్స్, ప్రొప్రైటర్. శ్రీ. నాగభీరు నరేంద్ర, తిమ్మాపురం గ్రామం ఎడ్లపాడు మండలం గుంటూరు జిల్లా 522233. 2. శ్రీ. వంకాయలపాటి పూర్ణచంద్రరావు, తండ్రి. అప్పారావు, తిమ్మాపురం గ్రామం ఎడ్లపాడు మండలం గుంటూరు జిల్లా-522233.
అసాధారణ మొత్తం: రూ. 51,52,000/- (యాభై ఒక లక్షా యాభై రెండు వేల రూపాయలు మాత్రమే) 01.04.2021 నాటికి ప్లస్ తదుపరి వడ్డీ, ఛార్జీలు మరియు ఖర్చులు.
స్థిరాస్తి యొక్క వివరణ:
1. స్థలం మరియు భవనం-డో.నం.312/బి లో రెసిడెన్షియల్ ఇంటి ఆస్తి, డో.నం.2-1/1 పరిధి 222.3 చ.గజాలు. నాగభీరు నాగేంద్ర పేరున గల (సేల్ డీడ్ నం.4063/2013) తిమ్మాపురం గ్రామం, ఎడ్లపాడు మండలం, గుంటూరు జిల్లా మరియు మొత్తం ఆస్తి కట్టుదిట్టమైన: తూర్పు: కొరిటాల కృష్ణ సైట్, అట్లూరి బాబూరావు ఇల్లు 82 అడుగులు., దక్షిణం: 9 అడుగుల వెడల్పు గల్లీ బజార్ 24 అడుగులు., పడమర: పావులూరి కొటేశ్వరరావు సైట్ 82 అడుగులు., ఉత్తరం: 12 అడుగుల వెడల్పు బజార్ 24.8 అడుగులు.
రిజర్వుధర:రూ.25,40,000/-, ధరావత్తు:రూ.2,54,000/-, బిడ్ ఇంక్రిమెంట్:రూ.25,000/-
2. స్థలం మరియు భవనం- డో.నం.46/2లో రెసిడెన్షియల్ ఆస్తి పరిధి 349.25 చ.గజాలు., డో.నం.11-16 వద్ద, బ్లాక్ నం.11 నాగభీరు నరేంద్ర పేరున ఉన్న (సేల్ డీడ్ నం.2327/2016) పురుషోత్తం గ్రామం, వేలూరు రోడ్డు, చిలకలూరిపేట మున్సిపల్ పరిధి, గుంటూరు జిల్లా మరియు మొత్తం ఆస్తి కట్టుదిట్టమైన: తూర్పు: వండ్లన జలజ యొక్క సైట్ 128 అడుగులు., దక్షిణం: వడ్లన జలజ యొక్క సైట్ 24.6 అడుగులు., పడమర: వడ్లన దాసు మరియు మొదలైన యొక్క సైట్ 128 అడుగులు., ఉత్తరం: మున్సిపల్ బజార్ 24.8 అడుగులు.
రిజర్వుధర:రూ.24,40,000/- ఇఎమ్‌డి:రూ. 2,44,000/- బిడ్ ఇంక్రిమెంట్:రూ. 24,000/-

ఇ వేలం యొక్క తేది మరియు సమయం : 31.12.2022
సా. 3.00గం.ల నుండి సా.5. 00 గం.ల వరకు
(10 నిమిషాల ఆటో ఛార్జీలతోపాటు) ఇ-వేలం వెబ్‌సైట్ www.mstcecommerce.com అమ్మకం తాలూకా పూర్తి వివరాల కోసం, దయచేసి ఇక్కడ ఇచ్చిన లింక్ www.unionbankofindia.com ను చూడండి.
సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 (6)/రూల్ 9 (1) క్రింద చట్టబద్ధ 15 రోజుల అమ్మకపు ప్రకటన
సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002, యొక్క రూల్ 8 (6)/ రూల్ 9 (1) క్రింద రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) పైన పేర్కొన్న తేదిన జరుగబోయే ఇ-వేలం అమ్మకపు ఇచ్చిన నోటీసుగా పరిగణించవలెను.
తేది : 14.12.2022, ప్రదేశం : ఎడ్లపాడు.
చీఫ్ మేనేజర్ & అధికృత అధికారి యునియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (గతంలో ఆంధ్రా బ్యాంక్)

సంపాదకీయం

అన్నీ కార్పొరేట్లకే...

కేంద్ర ప్రభుత్వం దేశ విదేశీ కార్పొరేట్లకు వివిధ రకాల రాయితీలు, కానుకలు సమర్పిస్తూ వారిని మరింత సంపన్నవంతం చేయడం దారుణం. మంగళవారం నాడు రాజ్యసభలో సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ కరాద్ లిఖితపూర్వక సమాధానం ఇస్తూ భారత రిజర్వు బ్యాంకు గణాంకాల ప్రకారం గడచిన ఐదేళ్లలో షెడ్యూల్డు వాణిజ్య బ్యాంకులు రూ.10,09,510 కోట్ల రుణాలను మాఫీ చేశాయని తెలిపారు. అంటే సగటున ఏడాదికి రెండు లక్షల కోట్ల రూపాయల రుణాలు సంపన్నులకు రద్దయాయన్నమాట. ఇందులో దాదాపు సగం సార్వత్రిక ఎన్నికల సమయంలో అంటే 2018-19, 2019-20 సంవత్సరాల్లోనే 4,70,435 కోట్లు రద్దు చేశారు. ఆ సమయంలోనే ఎన్నికల బాండ్లు భారీగా అమ్ముడు పోవడం, అందులో 90 శాతానికి పైగా కమలం పార్టీ ఖాతాలో పడిన విషయాలను కలిపి చూస్తే ఎవరికైనా అసలు కిటుకు బోధపడుతుంది. అయితే మాఫీ అంశం సాంకేతిక పరమైనదేనని బ్యాంకులు తమ బ్యాలెన్స్ షీట్లను పరిశుభ్రం (క్లీన్) చేసే ప్రక్రియ లో భాగమేనని మంత్రి సమర్ధించుకోవడం విడ్డూరం. కేవలం మాఫీ ప్రకటించడమే తప్ప రుణ వసూలు ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుందని నమ్మబలికారు. ఐదేళ్లలో ఇటువంటి మాఫీ చేసిన రుణాల్లో రూ.1,32,036 కోట్లు వసూలు చేసినట్లు గొప్పగా చెప్పుకొచ్చారు. అంటే మాఫీ చేసిన మొత్తంలో దాదాపు పదో వంతు మాత్రమే బ్యాంకులకు వసూలయిందన్నమాట. అది కూడా ఎన్నేళ్ల క్రితం నాటి బకాయో ఎవరికీ తెలియదు. ఇటువంటి మాఫీ మాత్రమేగాక కార్పొరేట్లు తీసుకున్న రూ.4.5 లక్షల కోట్ల బ్యాంకు రుణాల్లో కేవలం రూ. 1.61 లక్షల కోట్లు మాత్రమే వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పేరుతో వసూలు చేశారు. అంటే బ్యాంకులు రూ.2.85 లక్షల కోట్లు కోల్పోయాయి. కాబట్టి రాజుల సొమ్ము రాళ్లపాలన్న ఒకప్పటి సామెత బ్యాంకుల సొమ్ము కార్పొరేట్ల పాలు అన్నది ఇప్పటి నానుడిగా మారుతోంది. బ్యాంకుల్లోని సొమ్ము అంటే అది ఎవరిదో కాదు సుమా, సాక్షాత్తూ ఈ దేశ ప్రజలదే!

మోడీ ప్రభుత్వం వచ్చాక పరోక్ష పన్నులను, సెస్సులను పెంచి జనంపై భారాలు పెంచి, ప్రత్యక్ష పన్నుల్లో కార్పొరేట్లకు వివిధ రూపాల్లో రాయితీలు కల్పిస్తోంది. బడ్జెట్లో దాదాపు 8% కార్పొరేట్ పన్ను రాయితీల ద్వారా వారికి లక్షల కోట్ల రూపాయల లబ్ధి చేకూర్చింది. అంటే ఆ మేరకు ఖజానాకు కన్నం పడిందన్న మాట. మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించి వాటిని కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు. ప్రతి ఏటా డిజిన్వెస్ట్‌మెంట్ పేరుతో ప్రజల సొత్తు అప్పనంగా కుబేరులకు అప్పగిస్తున్నారు. గత ఏడాది భారీ ప్రచారంతో తీసుకొచ్చిన మానిటైజేషన్ పైప్ లైన్ పథకం కూడా ఆ కార్పొరేట్లకే లబ్ధి చేకూరుస్తుంది. ఇలా అన్ని విధాలుగా సంపన్నులకు ప్రజల సంపదను దోచిపెడుతున్న సర్కారు సామాన్య రైతులు, సాధారణ ప్రజలపట్ల మాత్రం కర్కశంగా వ్యవహరించడం దాని నైజాన్ని విశదపరుస్తోంది. కరువు కాటకాల వలన, వరదలు, తుపాను వలన నష్టపోయి లేదా పంటకు న్యాయమైన ధర దక్కక తీవ్రంగా నష్టపోయిన కారణంగా బ్యాంకులో తీసుకున్న రుణం తిరిగి తీర్చలేని రైతుల నుండి మాత్రం ఎటువంటి మినహాయింపు లేకుండా గోళ్లూడగొట్టి వసూలు చేయాలని బ్యాంకులను సర్కారు ఆదేశిస్తుంది. మధ్యతరగతి ప్రజానీకం తమ గృహ రుణాలు లేదా వినిమయ రుణాలను తీసుకొని కోవిడ్ సమయంలో తిరిగి కిస్తీలు కట్టలేని పరిస్థితిలో వాటిని మాఫీ చేయాలని గగ్గోలు పెట్టినా బ్యాంకుల ఆర్థిక క్రమశిక్షణ దెబ్బతింటుందనీ, అలా చేయడం సాధ్యం కాదనీ మోడీ సర్కారు సుప్రీం కోర్టులో సుద్దులు చెప్పింది. మరి ఈ ఐదేళ్లలోనే పది లక్షల కోట్ల రూపాయలకు పైగా కార్పొరేట్లకు మాఫీ చేస్తే ఆర్థిక క్రమశిక్షణ పటిష్టమవుతుందా? సమాధానం మోడీ సర్కారే చెప్పాలి. కార్పొరేట్ల కోసం, క్రోనీల కోసం ఏర్పడిందే మా ప్రభుత్వమనీ, వారి దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు ప్రతిఘటించకుండా ఉండేందుకు మతం పేరిట, కులం పేరిట, ప్రాంతం పేరిట విద్వేషాలు సృష్టించి జనాన్ని చీల్చడమే మా విధానమని చెబుతారా! కాకుల్ని కొట్టి గద్దలకు వేసిన చందంగా ప్రజల సొత్తును కార్పొరేట్లకు కట్టబెడుతున్న కేంద్ర ప్రభుత్వ దుష్ట విధానాలను ప్రజలు అర్థం చేసుకోవాలి. వాటిని తిప్పి కొట్టాలి. విశాల ఐక్య ప్రజా ఉద్యమాలే అందుకు మార్గం.

మంచి మాట



మన లోపాలను
మనం తెలుసుకోవడం
అన్నింటికన్నా పెద్ద చదువు.
- మీర్జా గాలిబ్,
ప్రసిద్ధ కవి.

కాళ్లు పట్టుకోవడం ఉద్యోగుల సంస్కృతి కాదు

విశ్లేషణ

వి.రాజగోపాల్

అవసరమైతే ఉద్యోగులకు కాళ్ళ పట్టుకునే నేర్పు కూడా వుండాలని గౌరవ విద్యాశాఖ మంత్రివర్యులు బొత్సా సత్యనారాయణ ఈ మధ్య జరిగిన ఒక సభలో వ్యాఖ్యానించారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి గత మూడున్నరేళ్ల పాలనలో అనేక మార్లు ఉద్యోగులను చిన్నబుచ్చే ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు వారి ప్రభుత్వంలోని మంత్రులు, ఇతర చోటా మోటా నాయకులు మాట్లాడటం పరిపాటిగా మారింది. ఈ పరిస్థితి ఉద్యోగుల పట్ల వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న వైఖరి ఎలాంటిదో తెలియజేస్తున్నది. నిజానికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఎంతో ఆదరంగా స్వాగతించారు. వారి తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తరహాలో ఉద్యోగుల పట్ల , వారి సమస్యల పట్లా సానుకూలత ప్రదర్శిస్తారని ఆశించారు. జగన్మోహన్‌రెడ్డి కూడా ఎన్నికలకు ముందు చేపట్టిన పాదయాత్రలో ఉద్యోగులు తన పై పెంచుకున్న ఆశలను బలపరుస్తూ హామీల వర్షం కురిపించారు.

కాస్త ఓపిక పట్టండి.. మన ప్రభుత్వం వస్తుంది. మీ సమస్యలన్నింటికీ పరిష్కారం చూపుతుందని నమ్మబలికారు. సిపిఎస్ సమస్య నాకొక లెక్కలోదే కాదని, వారం రోజులు చాలు, దాని పీక నొక్కడానికి అంటూ మురిపించారు. కరువు భత్యం బకాయిల కోసం చంద్రబాబును దేబిరించొద్దని, కాస్త ఆగితే మన ప్రభుత్వమే వస్తుంది. కరువు భత్యం బకాయిలను తెచ్చి మీ ఒడిలో కుమ్మరించి తీరుతుందని చెప్పారు. కనీవినీ ఎరుగని మేలు రకం పిఆర్సీ ఇచ్చి ఉద్యోగుల వేతన ఇబ్బందులకు స్వస్తి పలుకుతానని బాస చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను, అర్హత గల ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి, వారిని దశల వారీగా పైకి లాగేస్తామని వాగ్దానం చేశారు. చంద్రబాబు పాలనలో మాదిరి ఇక బానిస వ్యవస్థ ఉండదని, సాయంత్రం 5.30 గంటల తరువాత ఉద్యోగులు ఇళ్లకు వెళ్లి పోయి భార్యాబిడ్డలతో కలసి సంతోషాలు పంచుకోవచ్చని ఊరించారు.

ఇలాంటి వినసొంపు మాటలు అనేకం వెల్లడించడంతో ఉద్యోగులు తమ అభిమానం చాటుకున్నారు. అధికారం వచ్చింది. కానీ ఉద్యోగులకు మాత్రం నిజంగానే కనీవినీ ఎరుగని రివర్స్ పిఆర్సీ ఇచ్చి పుణ్యం కట్టుకున్నారు. ఎదురు తిరిగిన ఉద్యోగుల పైకి పోలీసుల్ని ఉసిగొల్పారు. చలో విజయవాడ పిలుపును అడ్డుకోవాలని శతవిధాలా ప్రయత్నించారు. అయినా తగ్గేదేలే అన్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల మధ్య బ్రిటిష్ పాలకుల మాదిరి విభజించి పాలించే పాచికను విసిరారు. మంత్రి చెప్పిన సామ దాన భేద దండోపాయాలను ఉపయోగించి బలవంతపు పిఆర్సీని కట్టబెట్టారు.

ఇక సిపిఎస్ విషయానికి వస్తే ..ఎరక్కపోయి హామీ ఇచ్చి తప్పు చేశామని, సిపిఎస్ రద్దు చేస్తే ప్రభుత్వం కొంప కొల్లేరు అయిపోతుందని, కాబట్టి జిపిఎస్‌తో ఎలాగోలా

సిపిఎస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ విజయవాడలో జరిగిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల భారీ ర్యాలీ (ఫైల్)

> **"75 సంవత్సరాల స్వతంత్ర భారత దేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులది ప్రత్యేక పోరాట చరిత్ర. ఉద్యోగుల సొంతమైన హక్కులు, అవకాశాలు, రాయితీలు, సౌకర్యాలు...ఇవేవీ ప్రభుత్వాలు దయతో ఇచ్చినవి కావు. ఉద్యోగులు సమరశీల పోరాటాలు సాగించి సాధించుకున్నవి. మంత్రి చెప్పినట్టు పాలకుల కాళ్లు చేతులు పట్టుకుంటేనో, లేక వాళ్ల అడుగులకు మడుగులొత్తితేనో వచ్చినవి కాదు. అపార త్యాగాల సొత్తుగా సంపాదించుకున్నవి. ఇప్పటి వరకు అమలైన ఏ పిఆర్సీ కూడా అయాచితంగా రాలేదు. తీవ్ర పెనుగులాట సాగిన తరువాతే అమల్లోకి వచ్చాయి. ఆ నాటి ప్రభుత్వాలు కూడా ఉద్యోగుల పట్ల ఉక్కు పాదం మోపిన అనుభవాలు కోకొల్లలు. సస్పెన్షన్లు, డిస్మిస్‌లు , అరెస్టులు , కాల్పులు వంటి అనేక క్రూర చర్యలు దాటుకుంటూ వస్తే తప్ప నేటి అవకాశాలు అంది రాలేదు."**

సరిపెట్టుకోమని సర్ది చెప్పడం మొదలు పెట్టారు. ఉద్యోగులు ఒప్పుకోలేదు. చలో విజయవాడకు పిలుపిచ్చారు. ఆ పిలుపును గృహ నిర్బంధాలతో నిర్వీర్యం చేసింది ప్రభుత్వం. పోలీసులను ప్రయోగించి భయానక వాతావరణం సృష్టించింది. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ అంశం కూడా నేటికీ అతీ గతీ కానక నత్తనడకన సాగుతున్నది. ఇప్పుడు తాజాగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఉసురు తీసే పనిలో పడింది. ఉద్యోగుల పట్ల ఇంత బాధ్యతా రహితంగా ప్రవర్తించిన ప్రభుత్వం తిరిగి నేరం ఉద్యోగుల మీద నెట్టడానికి ప్రయత్నించడం అన్యాయం. ఉద్యోగులు కావాలనే రోడ్డు ఎక్కి ప్రభుత్వాన్ని అల్లరి పాలు చేస్తున్నారని ఆరోపించడమే కాకుండా , కాళ్ల పట్టుకోవడం నేర్చుకోవాలని , చీటికిమాటికి ధర్నాలు, ఆందోళనలు అంటూ రోడ్డు ఎక్కకూడదని ఎగతాళి చేస్తూ మాట్లాడటం మంత్రి స్థాయికి తగని పని. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో వున్న ప్రజాప్రతినిధులే నోటిని అదుపులో పెట్టుకోకుండా వ్యవహరించడం దురదృష్టకరం.

ఉద్యోగ సంఘాల స్వతంత్రతను కాపాడటం ప్రభుత్వ రాజ్యాంగ విధి

ఉద్యోగులు ప్రభుత్వ పాలనా యంత్రాంగంలో భాగం. కాబట్టి ఉద్యోగుల సంక్షేమాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వానికి వుంటుంది. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా వ్యవహరించే ఉద్యోగుల బాగోగులు చూడటం ప్రభుత్వ కనీస ధర్మం. ఉద్యోగ సంఘాలు ప్రభుత్వానికి తోకలుగా వ్యవహరించాలని పాలకులు కోరుకోరాదు. వాటి స్వతంత్రతను గుర్తించి కాపాడటం ప్రభుత్వ విధి. ప్రజాస్వామ్య వ్యవస్థలో సంఘాలు పెట్టుకొనే హక్కును ఉద్యోగులకు రాజ్యాంగం కల్పించింది. వాటిని ప్రజాస్వామ్య బద్ధంగా నడవనివ్వాలి. ఉద్యోగులు తమ హక్కుల కోసం ప్రశ్నించడం నేరం కాదు. అలా ప్రశ్నించ కూడదని ప్రభుత్వం భావించడం కూడా తగదు. అది ప్రజాస్వామ్య లక్షణం కాదు. ప్రశ్నించిన వారిని శిక్షలకు గురి చేయడం, వేధించి వేపుకు తినడం, భజనపరులను మాత్రం బుజ్జగించి ప్రోత్సహించడం , నజరానాలతో సత్కరించడం సమానత్వ స్ఫూర్తికి విరుద్ధం. నాయకత్వాలను లోబర్చుకొని సంఘాలను నిర్వీర్యం చేయాలనుకోవడం రాజ్యాంగం ఔన్నత్యానికి విఘాతం కలిగించడమే అవుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడవలసిన కనీస ధర్మం ప్రభుత్వానిది. దాన్ని గౌరవించి మసలు కోవడం ప్రభుత్వానికైనా ఉద్యోగులకైనా తప్పనిసరి. పారదర్శకత గురించి ప్రభుత్వ పెద్దలు పదే పదే నొక్కి వక్కాణించడం కద్దు. మరి ఉద్యోగుల విషయంలో ఆ పారదర్శకత పాటించాలని ప్రభుత్వ నేతలకు గుర్తు చేయవలసిన పరిస్థితి తెచ్చుకోవడం వాంఛనీయం కాదు.

ఉద్యోగులు ప్రజల్లో కూడా భాగంగా వుంటారని ప్రభుత్వ పెద్దలు మరువ రాదు. ఓటు వేసే హక్కు, తమ బాధలు చెప్పుకొని పరిష్కారం చూపమని అడిగే హక్కు సాధారణ ప్రజలతోపాటు ఉద్యోగులకు కూడా వుంటుందని పాలకులు గుర్తెరగాలి. ఉద్యోగులు ప్రభుత్వ యంత్రాంగంలో భాగంగా ఉన్నంత మాత్రాన వారిని కట్టు బానిసలుగా భావించి తాము చెప్పినట్టు నడుచుకు తీరాలని, ఇచ్చింది పుచ్చుకుని మూసుకొని కూర్చోవాలని అధికార జులుం చూపించడం అప్రజాస్వామికం. అన్యాయం. ప్రజాస్వామ్య స్ఫూర్తికి అది విరుద్ధం. నష్టం జరిగితే నిరసన తెలపడం, అన్యాయం జరిగితే ఆదుకోమని కోరడం, హక్కులు హరిస్తే ప్రశ్నించి ప్రతిఘటించడం ఉద్యోగులకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు. కానీ ఈ రోజు రాష్ట్రంలో ఆ హక్కులన్నీ ఆగమైపోతున్న పరిస్థితి నెలకొని ఉంది. ఈ పరిస్థితి ఉద్యోగ- ఉపాధ్యాయ- కార్మిక- పింఛనుదారులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నది. ప్రశ్నించే గొంతుల్ని బెదిరించడం , నిరసన కారుల్ని నిర్బంధించడం పౌర స్వేచ్ఛకు ఆంక్షలు విధించడం ఆనవాయితీగా మారిపోయింది. కక్ష సాధింపులు , వ్యక్తిగత వేధింపులు ఉద్యోగ- ఉపాధ్యాయ- కార్మిక- పింఛనుదారులను మాత్రమే కాదు, వారి సంఘాలను, సంఘ నాయకుల్ని కూడా వదలడం లేదు. స్వతంత్ర భారత దేశంలో మునుపు ఎన్నడూ ఎరుగని కొత్త అనుభవం ఇది. హక్కులు హరించుకు పోతున్నాయి. ప్రయోజనాలు అడుగంటి పోతున్నాయి. రాయితీలు రద్దైపోతున్నాయి. అయినప్పటికీ చిత్తం, భత్యం అనాలి తప్ప ఎదిరించి అడగ కూడదు. ఆత్మాభిమానం చంపుకొని కాళ్ల పట్టుకోవడం ఒక్కటే మార్గమని స్వయానా మంత్రే చెప్పడం కంచే చేను మేసిన చందంగా వుంది.

హక్కులు ఊరికే రాలేదు, పోరాడి సాధించుకుంటేనే సమకూరాయి

75 సంవత్సరాల స్వతంత్ర భారత దేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులది ప్రత్యేక పోరాట చరిత్ర. ఉద్యోగుల సొంతమైన హక్కులు, అవకాశాలు, రాయితీలు, సౌకర్యాలు...ఇవేవీ ప్రభుత్వాలు దయతో ఇచ్చినవి కావు. ఉద్యోగులు సమరశీల పోరాటాలు సాగించి సాధించుకున్నవి. మంత్రి చెప్పినట్టు పాలకుల కాళ్లు చేతులు పట్టుకుంటేనో, లేక వాళ్ల అడుగులకు మడుగులొత్తితేనో వచ్చినవి కాదు. అపార త్యాగాల సొత్తుగా సంపాదించుకున్నవి. ఇప్పటి వరకు అమలైన ఏ పిఆర్సీ కూడా అయాచితంగా రాలేదు. తీవ్ర పెనుగులాట సాగిన తరువాతే అమల్లోకి వచ్చాయి. ఆ నాటి ప్రభుత్వాలు కూడా ఉద్యోగుల పట్ల ఉక్కు పాదం మోపిన అనుభవాలు కోకొల్లలు. సస్పెన్షన్లు, డిస్మిస్‌లు , అరెస్టులు , కాల్పులు వంటి అనేక క్రూర చర్యలు దాటుకుంటూ వస్తే తప్ప ప్రయోజనాలు, హక్కులు అంది రాలేదు.

ఈ రోజు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఎగవేస్తున్న కరువు భత్యం ఒక హక్కుగా పొందడం కోసం సాగిన వీరోచిత పోరాటంలో ఆనాటి ఎన్జీవో సంఘ నాయకులు బదరీనాథ్, కుటుంబరావులను అప్పటి బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వం పాశవికంగా పొట్టన పెట్టుకుంది. అయినప్పటికీ ఉద్యోగులు వెనక్కి తగ్గలేదు. పోరాటం సాగించి కరువు భత్యాన్ని హక్కుగా సాధించుకున్నారు. అలాంటి త్యాగాల వారసత్వ సంపదగా ఉద్యోగులు సాధించుకున్న కరువు భత్యాన్ని నేడు ఉనికిలో లేకుండా చేయడానికి పాలకులు శత విధాల ప్రయత్నిస్తు న్నారు. కాబట్టి మానాభిమానాలను పక్కకు నెట్టి అధికారం లోని అధినేతల దయాదాక్షిణ్యాల కోసం వెంపర్లాడటం ఉద్యోగుల సంస్కృతి కానే కాదని మంత్రి తెలుసుకోవడం మంచిది. అయితే, ఉద్యోగుల్లో ఆ నాటి పోరాట స్ఫూర్తి ఈ నాడు కనిపించకపోవడం కూడా ఒక వాస్తవం. ఈ పరిస్థితికి పాలకులు తలకెత్తుకున్న సరళీకరణ , ప్రైవేటీకరణ , ప్రపంచీకరణ విధానాలు ముఖ్య కారణం. ప్రయివేటు పెత్తనం పెరిగిన తరువాత ప్రభుత్వ యంత్రాంగం లోకి కాంట్రాక్టు , ఔట్ సోర్సింగ్ , డైలీ వేజ్ లాంటి తాత్కాలిక నియామక విధానాలు మొదలయ్యాయి. రెగ్యులర్ ఉద్యోగ వ్యవస్థ బలహీన పడింది. పోరాడే శక్తులకు ఐక్యత అతి ముఖ్యమైన ఆయుధం. ఆ విషయాన్ని గ్రహించిన ప్రభుత్వాలు ఆ ఐక్యతను విచ్ఛిన్నం చేసే అనేక కుయుక్తులు పన్నుతున్నాయి.

ప్రయివేటు పెత్తనం పెరిగిన తరువాత ప్రలోభాలు కూడా పెరిగాయి. వ్యక్తిగత అవకాశవాదం హెచ్చింది. ఇటువంటి భౌతిక వాతావరణంలో ..ఉమ్మడి ప్రయోజనాల కోసం నిలకడగా నిలబడటం కష్టమవుతుంది. ఇదే ఈ నాటి పాలకుల పాలిట వరమైంది కూడా. కాబట్టే ఈ రోజు ఒక్క ఉద్యోగులే కాదు, బాధిత ప్రజలు ఎవరైనా... వారు తక్షణం ఎదుర్కొంటున్న సమస్యలకు వ్యతిరేకంగానే కాకుండా వాటి మనుగడకు కారణమైన ప్రయివేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా కూడా పోరాడవలసి వుంది.

నేడు ఉద్యోగులతో సహా సకల బాధిత ప్రజల బాధలకు ప్రయివేటీకరణ విధానాలే కారణం. అవి ధనిక వర్గాన్ని బలపరిచేందుకు మాత్రమే అమలు చేయబడుతున్నాయి. కాబట్టే వాటికి అంతరాయం కలిగించే ఏ చర్యలనైనా పాలకులు సహించలేక పోతున్నారు. అందులో భాగంగానే మంత్రి అసహనపు మాటల్ని కూడా ఉద్యోగులు అంచనా వేసుకోగలగాలి. కాబట్టి నేటి తరం ఉద్యోగులు జరుగుతున్న నష్టాన్ని, కోల్పోతున్న హక్కుల్ని, హరించుకు పోతున్న ప్రయోజనాలను గొంతెత్తి నిలదీయగలగాలి. లేకపోతే మిగిలేది బానిసత్వం తప్ప ప్రజాస్వామ్య స్ఫూర్తి కాదని గుర్తెరగాలి. బాధిత ప్రజలు ఎవరైనా వారి బాధల నివారణకు పోరాటాలకు సిద్ధపడటం ఒక్కటే మార్గం. ఇంతకు మించిన దగ్గర దారి మరొకటి లేదని గ్రహించడం మీదే వారి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. చరిత్ర తెలియక అవాకులు, చవాకులు మాట్లాడే వారి నోళ్లు మూత పడేటట్లు చేయగల శక్తి కేవలం సమైక్య పోరాటాలకు మాత్రమే ఉందని ఉద్యోగులు, వారి సంఘాలు గ్రహించడం ముఖ్యం.

/ పూర్వ అధ్యక్షులు ఎపిఎన్జీఓ అసోసియేషన్, విజయనగరం జిల్లా /

★

ఉచితాల పేరుతో సంక్షేమంపై ప్రధాని దాడి

సందర్భం

ఎ.కోటిరెడ్డి

ప్రధాని మోడీ ఉచితాల పేరుతో ప్రజాసంక్షేమ పథకాలపై దాడి చేయటం పెరిగింది. ఈ నెల 11న వివిధ పథకాలను ప్రారంభించటానికి మహారాష్ట్రకు వచ్చిన ప్రధాని నాగపూర్‌లోని ఎయిమ్స్ గ్రౌండ్‌లో జరిగిన సభలో ప్రసంగిస్తూ.. సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతున్న రాజకీయ పార్టీలపై తీవ్రమైన దాడి చేశాడు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్ష పార్టీలు అడ్డదారులు వెతుకుతున్నాయని, అడ్డదారుల్లో ప్రయత్నం చేస్తున్నవారు తమ వికృత రాజకీయాలతో దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తున్నారని ఆయన పేర్కొన్నాడు. ఇది పన్ను చెల్లింపుదారుల డబ్బును వృథా చేయటమేనని, ఈ అడ్డదారులు తొక్కేవారు పన్ను చెల్లింపుదారులకు పెద్ద శతృవులని, ప్రభుత్వం రానున్న 25 సంవత్సరాల భారతదేశ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని పనిచేస్తుంటే.. కొన్ని రాజకీయ పార్టీలు దేశాన్ని నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని చెప్పాడు. ప్రధానితో పాటు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు, ఆ పార్టీకి, నయా ఉదారవాద విధానాలకు మద్దతిస్తున్న మేధావులు కూడా ఈ ప్రచారాన్ని జోరుగా కొనసాగిస్తున్నారు.

ఈ అంశాలు ప్రధాని స్వయంగా చెబుతున్నవి కావు. పలికెడిది భాగవతమట అని పోతన చెప్పిన చందంగా నయా ఉదారవాద విధానాలు అంతిమదశకు చేరుతున్న సమయంలో కార్పొరేట్, బహుళజాతి సంస్థల ప్రయోజనాలను కాపాడడానికి, హిందుత్వ విధానాలను మరింత ముందుకు తీసుకుపోవటానికి అవసరమైన ఈ విధానాలను ప్రపంచబ్యాంకు, ఆర్‌ఎస్‌ఎస్‌లు ముందుకు తెస్తున్నాయి. వాటినే ప్రధాని వల్లించాడు. తమ యజమానుల ప్రయోజనాలను నెరవేర్చటం కోసం ఆయన దేశప్రజలపై తీవ్రదాడి చేస్తున్నాడు. నయా-ఉదారవాద విధానం అంతిమదశకు చేరుతున్న సమయంలో..పాలకులు వారికి చేస్తున్న సేవలో భాగమే ఇవన్నీ.

ఉచితాలంటే ఏమిటి?

ఉచితాలపై ప్రధాని, ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి నాయకుల దాడి, అది దేశప్రజలపై ఎటువంటి ప్రభావం చూపుతుందో తెలుసుకోవాలంటే ఉచితాలంటే ఏమిటో ముందు అర్థం చేసుకోవాలి. ప్రజలు తమకు అవసరమైన వాటిని పూర్తి వెల

చెల్లించి పొందాలి. అలా కాకుండా ఉచితంగా పొందుతున్నవి మాత్రమే కాక, తక్కువధరలకు పొందుతున్న వాటిని కూడా ఉచితంగా పొందుతున్న వాటిగానే లెక్కించి, ధరలో చెల్లించని మొత్తాన్ని కూడా చెల్లించాలని కోరవచ్చు. ఆ విధంగా చూసినపుడు మార్కెట్ ధర అని చెబుతున్న దాని ప్రకారం కాకుండా అంతకు తక్కువగా ఏది పొందినా ఉచితం లెక్కలోనిదేనని ప్రచారం చేస్తున్నారు. ఆ విధంగా చూసినపుడు ఉచితాల జాబితాలోకి ఏవేవి వస్తాయో, ప్రజలకు లభిస్తున్న రాయితీలను పూర్తిగా రద్దు చేస్తే ప్రజలు ఏం కోల్పోతారో మనకు స్పష్టమౌతుంది.

ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా దేశంలోని 30 కోట్ల కుటుంబాలకు ఆహారధాన్యాలను అందజేస్తున్నారు. వీటిని మార్కెట్ ధర కన్నా చాలా తక్కువ ధరకు పేదలు పొందుతున్నారు. సరుకుల ధరలో ప్రజలు పొందుతున్న రాయితీని రద్దుచేసి, మార్కెట్ ధరలకు బియ్యంతో పాటు నిత్యావసరాలన్నింటినీ కొనుగోలు చేయాలంటే ప్రతి పేద కుటుంబంపైనా ప్రతినెలా వేల రూపాయల భారం పడుతుంది. కోట్లాది మందికి వృద్ధాప్య పింఛన్లు అందుతున్నాయి. వీటిని ఉచితాలుగా పరిగణించి రద్దుచేస్తే వారు బతకలేని పరిస్థితులు వస్తాయి. పనిచేసినపుడు జీతం ఇచ్చారు, కాబట్టి రిటైరైన తర్వాత ఇచ్చేవి ఉచితాలవుతాయని చెప్పి ఉద్యోగులు, కార్మికులకు ఇచ్చే పెన్షన్, పిఎఫ్ తదితరాలను రద్దు చేయటానికి అవకాశం ఉంది. ప్రభుత్వ విద్య, వైద్యం దాదాపుగా ఉచితంగానే అందుతున్నాయి. వీటిని పూర్తిగా రద్దు చేయటం లేదా ప్రైవేటు విద్య, వైద్యాలకు చెల్లించిన విధంగానే భారీ మొత్తాలను చెల్లించే విధానాన్ని అమలులోకి తెస్తారు. ప్రజలు తమ ఇంటినుండి బయటికి రావాలన్నా, ఎక్కడికైనా వెళ్లాలన్నా రోడ్లు అవసరం. ఇంటిలో వివిధ సరుకులను వినియోగించటం వల్ల వచ్చిన చెత్తను పారబోయాలి. మురుగునీరు బయటకు పోవాలి. మంచినీటి సరఫరా, మురుగునీరు, చెత్తను పారబోయటం తదితరాలకు ఇప్పటికే ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఇవి కూడా ఉచిత సేవల లెక్కలోకే వస్తాయి కాబట్టి వీటికోసం ప్రజలందరి నుండి డబ్బు వసూలు చేస్తారు. రైతులు పంటలు పండించటానికి విత్తనాలు, ఎరువులు కావాలి. పంటలకు మద్దతు ధరలు కావాలి. తక్కువ వడ్డీకి రుణాలు కావాలి. విత్తనాలు, ఎరువులపై రైతులకు ఇస్తున్న సబ్సిడీలను పూర్తిగా రద్దుచేస్తారు. వడ్డీ రాయితీ ప్రసక్తి ఉండదు. పంటలను అమ్ముకొనేటపుడు మార్కెట్‌లోవచ్చినదే తీసుకోవాలే కాని మద్దతు ధర గురించి ప్రస్తావించకూడదు. నిరుద్యోగులు నిరుద్యోగభృతి ఇవ్వాలని కోరటం కూడా ఉచితాల లెక్కలోకే వస్తుంది కాబట్టి అడగటమే తప్పయిపోతుంది. ప్రైవేటు వారు ప్రవేశించని విద్యుత్ సరఫరా, పంపిణీ, సాగునీరు, రైలు తదితర సేవలను రాయితీలపై ప్రభుత్వం నుండి ప్రజలందరూ పొందుతున్నారు. ఈ రంగాల్లోకి ప్రైవేటు వారిని తీసుకొచ్చి, వారు భారీగా ధరలు పెంచి దోచుకోవటానికి అవకాశం కల్పిస్తారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవటాన్ని ఇప్పటికే ప్రారంభించారు. డబ్బు చెల్లించి పొందుతున్న ప్రభుత్వసేవలు పోస్టల్, టెలిఫోన్, బస్సు, ఇతర సేవలకు ప్రైవేటు సంస్థలతో సమానంగా చెల్లించమని డిమాండ్ చేస్తారు. వ్యవసాయ కార్మికులు భూములు పంచాలని, ఇళ్లు లేనివారు ఇళ్ల స్థలాలివ్వాలని కోరకూడదు. అవి భూమి, స్థలాలను ఉచితంగా పొందటానికి ప్రయత్నం చేయటమే అవుతుంది. ఉపాధి హామీ పనులు, వేతనాల పెంపు కోసం డిమాండ్ చేయడాన్ని కూడా ఈ లెక్కలోకే చేర్చి, అవి తప్పని చెప్పి, మొత్తం చట్టాన్నే రద్దుచేయవచ్చు. ఈ విధంగా దేశంలోని సామాన్యులు పొందుతున్న వాటన్నింటికీ ఉచితాలని ముద్రవేసి, మొత్తంగా అన్ని పథకాలు,పేదలు, శ్రామిక ప్రజలకు మేలు కలిగించే చట్టాలను రద్దుచేయటానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది.

దీనిని కప్పిపుచ్చుతూ... దీర్ఘకాలంలో ప్రయోజనాలు దక్కుతాయని, 25 సంవత్సరాల అభివృద్ధి అని సుద్దులు చెబుతున్నాడు. పంచవర్ష ప్రణాళికా విధానమే పనికిరానిదని రద్దు చేసిన వీరు 25 సంవత్సరాల అభివృద్ధి పథకం అని చెబితే నమ్మేటంత వెర్రివాళ్లా ప్రజలు !

ప్రభుత్వం కార్పొరేట్లకు దోచిపెట్టటం ఉచితాల లెక్కలోకి రాదా!

పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలపై తీవ్రమైన దాడిచేస్తున్న ప్రధాని మోడీ, ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి నాయకులు కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలకు దేశసంపదను అప్పనంగా కట్టబెడుతున్నారు. దీనిని గురించి మేధావులు, మీడియా ప్రస్తావించడం లేదు. కోట్లాది మంది పేదలు, ప్రజలకు అందుతున్న రాయితీలు ప్రభుత్వ భిక్షకాదు. శ్రమజీవులైన కార్మికులు-కర్షకులు, ఉద్యోగులు, ఇతర శ్రామికులు తమ శ్రమతో దేశసంపదను పెంచుతున్నారు. కోట్లాది మంది ప్రజల శ్రమ ద్వారా సృష్టించబడ్డ సంపద వారికే చేరాలని కోరటం అడ్డదారి ఎలా అవుతుంది? లక్షల కోట్ల రూపాయల రుణాల రద్దు, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, ద్రవ్యీకరణ పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను, ప్రభుత్వ ఆదాయాన్ని కార్పొరేట్లు, సామ్రాజ్యవాదులకు అప్పగించటం అడ్డదారి, చీకటిదారి అవుతుంది. కళ్లుమూసుకుని పాలుతాగుతున్న పిల్లి తనను ఎవ్వరూ చూడటం లేదని భ్రమలో ఉన్నట్లుగా ఆర్‌ఎస్‌ఎస్-బిజెపిలు దేశ సంపదను కొల్లగొట్టటానికి, కార్పొరేట్, సామ్రాజ్యవాద శక్తులకు కట్టబెట్టటానికి పూనుకున్నారనే విషయాన్ని ప్రజలు గమనించటం లేదన్న భ్రమల్లో ఉన్నారు. ప్రజలు అన్నింటినీ, అందరినీ గమనిస్తున్నారు. తగిన సమయంలో ఆర్‌ఎస్‌ఎస్-బిజెపిలకు గుణపాఠం చెబుతారు.

జనవాక్యం

జీ-20 సారథ్య బాధ్యతలు లక్ష్యం నెరవేరేలా ఉండాలి

జీ-20 కూటమి అధ్యక్ష బాధ్యతలను చేపట్టిన భారతదేశం తనదైన ముద్రతో కూటమి దేశాలకు మార్గదర్శనం చేయాల్సిన వేళ దేశవాసులు సగర్వంగా ఎదురు చూస్తున్నారు. ఈ కూటమి ఎజెండాలో ప్రధానంగా వాతావరణ ప్రతికూల మార్పుల కట్టడి, ఉగ్రవాదంపై ఉక్కు పాదం మోపడం, విపత్తుల సమర్థవంతమైన నిర్వహణ, కరోనా లాంటి విపత్తుల నిర్వహణ, కార్బన్ ఉద్గారాల అదుపులో గ్రీన్ శక్తి వనరుల వినియోగాన్ని పెంచడం, సుస్థిరాభివద్ధి, మహిళా సాధికారత, డిజిటల్ పౌర సేవలు, టెక్నాలజీ సమ్మిళిత అభివద్ధి, వరల్డ్ ఎకానమీ, క్లైమేట్ ఫైనాన్స్ లాంటి ముఖ్య అంశాలను చేర్చారు. జీ-20 కూటమి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన భారతం ప్రత్యేకమైన కార్యాచరణను తీసుకొని అమలు చేస్తూ, మాటలకు మాత్రమే కాదు చేతల్లో కూడా ముందున్నామని సభ్యదేశాలకు వివరిస్తూ నాయకత్వం వహించాలని కోరుకుంటున్నాం. వాతావరణ రాజద్రవ్యం (క్లైమేట్ ఫైనాన్స్), పర్యావరణహిత శక్తి రక్షణ, ఆహార భద్రత, డాలర్ రేటు పెరుగుదల, యుద్ధ ప్రభావం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం/వడ్డీ రేట్లు లాంటి అంశాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అగత్యం ఏర్పడుతున్నదని మరువరాదు. రిఫైనరీలు, ఎరువులు, ఉక్కు, సిమెంట్ లాంటి ఉత్పత్తుల్లో హరిత శక్తి వనరులు వాడేలా పథక రచనలు చేసి కార్బన్ ప్రింట్ తగ్గించే పథకాల అమలుకు ఉపక్రమించాలి.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
కరీంనగర్ - 9949700037



తమిళనాడు క్రీడా మంత్రిగా ఉదయనిధి

చెన్నయ్ : డిఎంకె యువజన విభాగం అధ్యక్షులు, చేపాక్-తిరువల్లికేణి నియోజకవర్గం ఎమ్మెల్యే ఉదయనిధి స్టాలిన్ బుధవారం తమిళనాడు కేబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో ఉదయం జరిగిన కార్యక్రమంలో ఉదయనిధి చేత గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉదయనిధి తండ్రి ఎంకె స్టాలిన్, క్యాబినెట్ మంత్రులు, అధికారులు, ఇతరులు పాల్గొన్నారు. ఉదయనిధి రాకతో తమిళనాడులో మంత్రుల సంఖ్య 35కు పెరిగింది. ఉదయనిధికి యువజన సంక్షేమం, క్రీడల అభివృద్ధి, ప్రత్యేక కార్యక్రమాల అమలు, పేదరిక నిర్మూలన కార్యక్రమం, గ్రామీణ రుణభారం శాఖలను కేటాయించారు. ప్రమాణస్వీకారం అనంతరం విలేకరులతో ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ తమిళనాడును క్రీడల రాజధానిగా మార్చడమే తన ప్రాధాన్యత అని తెలిపారు.

అయ్యన్నపాత్రుడికి సుప్రీం నోటీసు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఫోర్జరీ కేసులో మాజీ మంత్రి, టిడిపి నేత చింతకాయల అయ్యన్నపాత్రుడికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాలు సవాల్ చేస్తూ ఏపి ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సిటి రవికుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే విధించమని ఏపి ప్రభుత్వం తరపున హిరేన్ రావల్ కోరారు. అందుకు ధర్మాసనం విముఖత వ్యక్తం చేసింది. అయ్యన్నపాత్రుడుకి నోటీసులు జారీ చేసిన ధర్మాసనం తదుపరి విచారణ ఫిబ్రవరి 3కు వాయిదా వేసింది.

మేఘాలయలో ఆపరేషన్ కమల్

- బిజెపిలోకి నలుగురు ఎమ్మెల్యేలు

న్యూఢిల్లీ : మేఘాలయాలో వచ్చే ఏడాదిలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు లక్ష్యంగా అక్కడ పాగా వేసేందుకు బిజెపి ఇప్పటి నుంచే కుయుక్తులకు తెర లేపుతోంది. ఆపరేషన్ కమల్‌ను చేపట్టింది. దీంతో నలుగురు ఎమ్మెల్యేలు తాజాగా ఆ పార్టీలో చేరిపోయి కాషాయ కండువాలు కప్పుకున్నారు. ఇందులో ఇద్దరు ఎమ్మెల్యేలు రాష్ట్రంలో అధికార పార్టీ, బిజెపి మిత్రపక్షమైన నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి)కి చెందిన వారు కూడా ఉండటం గమనార్హం. 2018 ఎన్నికల్లో బిజెపి రెండు అసెంబ్లీ స్థానాలను మాత్రమే గెలుచుకుంది. ఎన్‌పిపికి చెందిన ఎమ్మెల్యేలు బెనెడిక్ మారక్, ఫెర్లిన్ సంగ్మాతో పాటు టిఎంసి ఎమ్మెల్యే హిమాలయ ముక్తన్ షంగ్ప్లిలాంగ్, ఇండిపెండెంట్ ఎమ్మెల్యే సామ్యూల్ ఎం సంగ్మా తాజాగా బిజెపిలో చేరారు.

ఢిల్లీలో బాలికపై యాసిడ్ దాడి

న్యూఢిల్లీ : దేశారాజధాని ఢిల్లీలో మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. బుధవారం ఉదయం 7:30 గంటల సమయంలో ద్వారకా మోర్ సమీపంలో 17 ఏళ్ల బాలికపై యాసిడ్‌తో దాడి జరిగింది. బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఈ దాడికి పాల్పడ్డారు. బాధితురాలిని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో చేర్పించారు. బాలిక ముఖం, కళ్లపై గాయాలయ్యాయని వైద్యులు చెప్పారు. బాలిక పరిస్థితి స్థిరంగా ఉందని, ఐసియులో చికిత్స పొందుతుందని తెలిపారు. నిందితుల్లో ఒకరిని అరెస్టు చేసినట్లు పోలీసులు చెప్పారు.



ఢిల్లీలో బిఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) ప్రస్థానానికి తొలి అడుగు పడింది. ఢిల్లీ నడిబొడ్డున బిఆర్ఎస్ పార్టీ జాతీయ కార్యాలయం ఆవిర్భవించింది. బుధవారం నాడిక్కడ సర్దార్ పటేల్ మార్గ్‌లో రోడ్డు నెంబర్ 5లో పలువురు జాతీయ నాయకుల సమక్షంలో బిఆర్ఎస్ జాతీయ కార్యాలయాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు ప్రారంభించారు. జాతీయ అధ్యక్షునిగా తొలి సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగానే బిఆర్ఎస్ తరపున పలు నియామకాలను చేస్తూ కెసిఆర్ నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి, తమిళనాడు విసికె పార్టీ అధ్యక్షుడు, ఎంపి తిరుమావళవన్, హర్యానా రైతు సంఘం అధ్యక్షులు గుర్నాం సింగ్ చారుని, రాష్ట్ర మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

'మద్దతు' చట్టం కోసం ఐక్య పోరు

ఎఐకెఎస్ మహాసభ తీర్మానం

ఢిల్లీ రైతాంగ మహోద్యమంపై సుందరయ్య ట్రస్టు ప్రచురించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కేరళ ఆర్థిక మంత్రి బాలగోపాల్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- కె వరదరాజన్ నగర్ (త్రిసూర్)

రైతులు పండించే ప్రధాన పంటలన్నింటికీ కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కు చట్ట బద్ధత కల్పించాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని ఎఐకెఎస్ మహాసభ డిమాండ్ చేసింది. ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంలో మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీ అయిన చట్ట బద్ధతను సాధించేందుకు ఐక్య ఉద్యమానికి పిలుపునిచ్చింది. ఈ మేరకు బుధవారం మహాసభ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. తీర్మానాన్ని ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు అమ్రారామ్ ప్రతిపాదించారు. తీర్మానంలోని ముఖ్యాంశాలు... నయా-ఉదారవాద విధానాలొచ్చాక వ్యవసాయానికి ప్రభుత్వ నిధులు, సబ్సిడీలు, బ్యాంక్ అప్పులు బాగా తగ్గాయి. మరో వైపు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, ఇతర ఉత్పాదకాల ధరలు విపరీతంగా పెరిగాయి. డీజిల్ రేట్ల పెరుగుదల ప్రభావం రైతులపై ఎక్కువగా ఉంది. ఇదే సమయంలో పంటలకు ధరలు పడిపోయాయి. ప్రభుత్వం రైతుల వద్ద నుంచి కొంటున్న వరి, గోధుమ ధాన్యాలు చాలా తక్కువ. ఇతర పంటలకు ఎంఎస్‌పి లేనే లేదు. ప్రభుత్వ సబ్సిడీలు తగ్గడం, ఉత్పాదకాల ధరలు పెరగడం, పంటల ధరలు దిగజారడం వలన రైతులు నష్టపోతున్నారు. ఇంకోవైపు ప్రజాపంపిణీ వ్యవస్థ నిర్వీర్యం కావడంతో ప్రజల ఆహార భద్రత ప్రమాదంలో పడింది. ప్రధాన పంటలన్నింటికీ, పశు సంవర్ధక ఉత్పత్తులు, చిన్న అటవీ ఉత్పత్తులకు ఎంఎస్‌పిని గ్యారంటీ చేస్తూ చట్టబద్ధత కల్పించాలి. వ్యవసాయానికి ప్రభుత్వ నిధులు పెంచాలి. అలా చేస్తే పంట ఉత్పాదకాలు, సర్వీసులు, వ్యవసాయ ఖర్చులు తగ్గుతాయి. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు పంట పండించడానికి రైతులు చేసే ఖర్చుకు యాభై శాతం కలిపి ప్రభుత్వం ఎంఎస్‌పి ప్రకటించాలి. వరి, గోధుమలతో సహా ఇతర పంటల సేకరణకు, నిల్వకు సదుపాయాలు కల్పించాలి. పంటల సేకరణ, ఆహార పంపిణీ, గోదాముల వ్యవస్థలలో సహకార రంగాన్ని ప్రోత్సహించాలి... అని మహాసభ తీర్మానించింది. కేంద్రం తెచ్చిన లేబర్ కోడ్స్‌ను వ్యతిరేకిస్తూ తీర్మానాన్ని పి షణ్ముగం ప్రవేశపెట్టగా వి కృష్ణయ్య బలపరిచారు. లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా కార్మికులు చేసే పోరాటాలకు ఎఐకెఎస్ సంపూర్ణ మద్దతిస్తుందని, కార్మికులు- కర్షకులు ఐక్యంగా పోరాడాలని మహాసభ పిలునిచ్చింది. అటవీ హక్కుల చట్టం అమలుకు, మహిళా రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కుల రక్షణ కోరుతూ మరో రెండు తీర్మానాలను మహాసభ ఆమోదించింది. మూడు నల్ల వ్యవసాయ చట్టాల రద్దు కోసం ఢిల్లీ సరిహద్దులో రైతులు నిర్వహించిన మహత్తర పోరాటానికి సంబంధించిన కథనాలతో ఆంగ్లంలో సుందరయ్య ట్రస్టు ప్రచురించిన పుస్తకాన్ని కేరళ ఆర్థిక మంత్రి బాలగోపాల్ మహాసభ వేదికపై ఆవిష్కరించారు. మొదటి ప్రతిని వెంకటేష్ ఆత్రేయ అందుకున్నారు. పుస్తకావిష్కరణ సభలో అశోక్ ధావలే, హన్నన్ మొల్లా, సారంపల్లి మల్లారెడ్డి, విజూ కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి నింపిన చర్చలు

- ఉత్సాహంగా పాల్గొన్న ప్రతినిధులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- కె వరద రాజన్ నగర్ (త్రిసూర్)

ఎఐకెఎస్ మహాసభ రెండవ రోజు బుధవారం ప్రతినిధుల చర్చలు ఉత్సాహపూరితంగా జరిగాయి. ఈ కాలంలో నిర్వహించిన పోరాటాలను, ఎదురైన అనుభవాలు, సవాళ్లపై సింహావలోకనం చేసుకున్నారు. సాధించిన విజయాలను తెలిపినప్పుడు ప్రతినిధులు స్ఫూర్తి పొందారు. మహాసభ ఇచ్చే భవిష్యత్ కర్తవ్యాల సాధనకు ప్రతిన బూనారు. సమస్యలను అధిగమిస్తామని, ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. చర్చలు గురువారం కూడా సాగనున్నాయి. వామపక్ష ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ రైతుల సమస్యలపై తాలూకా, జిల్లా స్థాయిలో పోరాటాలు నిర్వహించామని కేరళ ప్రతినిధి జార్జి మెతిన్ తెలిపారు. సహకార ఉద్యమంలోకి రైతులను సమీకరిం చేందుకు చైతన్యపరుస్తున్నామన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుకనుగుణంగా దేశంలో కేరళ ఒక్కటే ధాన్యానికి రూ.2,880 మద్దతు ధర కల్పించిందన్నారు. బిజెపి దాడులకు, విద్వేష ప్రచారాన్ని సమర్ధవంతంగా ఎదుర్కొంటున్నామని వివరించారు. పశ్చిమబెంగాల్ ప్రతినిధి ప్రిష్‌పాల్ మాట్లాడుతూ గ్రామ, బ్లాక్, జిల్లా స్థాయికి కార్మిక-కర్షక పోరాటం తీసుకెళుతున్నామన్నారు. తృణమూల్ ప్రభుత్వంలో అవినీతి, అక్రమాల వలన రైతులకు పథకాలు, అందట్లేదన్నారు. బెంగాల్‌లో బిజెపి ప్రజలను మతాలు, కులాల వారీగా విడగొట్టి అసలు సమస్యలను పక్కదారి పట్టిస్తోందని చెప్పారు. త్రిపురలో బిజెపి ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని తపన్‌దాస్ తెలిపారు. ప్రజాపంపిణీ, విత్తనాల పంపిణీ కోసం పోరాడాల్సి వస్తోందన్నారు. జమ్మూ కాశ్మీర్‌ను విడగొట్టడం ద్వారా అక్కడ పరిపాలన లేకుండా పోయిందని, యూనియన్ పోలీస్ స్టేషన్‌గా మారిపోయిందని ఆ రాష్ట్రం నుంచి చర్చల్లో పాల్గొన్న సాకో తెలిపారు. రాజస్థాన్ ప్రతినిధులు బల్వాన్ పునియా, రూప్‌సింగ్, ఉమ్రాజ్ మాట్లాడుతూ ఫసల్ బీమా, విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులు, కాల్వలు, రుణ మాఫీ, పశువుల పాలన, ఉత్పత్తులకు ధరలపై ఆందోళనలు చేశామన్నారు.

మండీలు పని చేయట్లేదు

గుజరాత్ నుంచి వినోద్ ప్రమోద్ మాట్లాడుతూ బిజెపి సర్కారుకు వ్యతిరేకంగా స్వతంత్రంగా, సంయుక్తంగా పోరాడుతున్నామన్నారు. మండీలు రైతులకు ఉపయోగ పడట్లేదని చెప్పారు. రైతుల నుంచి భూములు లాక్కొంటు న్నారని తెలిపారు. యుపిలో యోగి సర్కారు రైతులను పట్టించుకోవట్లేదని తికంబర్‌సింగ్, స్థానిక, స్థానికేతర సమస్యను బిజెపి ముందుకు తెచ్చిందని అసోం ప్రతినిధి రసోజ్ అలీ, ధాన్యం కొనుగోలు కోసం పోరాడామని హర్యానా ప్రతినిధి బల్బీర్ సింగ్, ఒడిశాలో బిజెడి ప్రభుత్వాన్ని బిజెపి బలపరుస్తోందని సురేంద్రదాస్, భూపోరాటాలు, గిరిజనుల హక్కుల కోసం పోరాడామని జార్ఖండ్ ప్రతినిధి మహ్మద్ అలీ, కార్పొరేట్లకు భూములు, మార్కెట్‌ను కర్నాటక సర్కారు అప్పగించడానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నామని యశ్వంత, బీహార్‌లో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు రైతు పోరాటాలకు ఆశాకిరణంగా ఉన్నాయని రాజేంద్ర ప్రతాప్‌సింగ్, ఢిల్లీ రైతు ఉద్యమంలో ముందు పీఠిన నిలిచామని పంజాబ్ ప్రతినిధి బల్జిత్‌సింగ్ అగర్వాల్, పంటలపై వాతావరణ మార్పులు, కోతులు, అడవి పందుల బెడద, కార్పొరేటీకరణ, భూనిర్వాసితుల సమస్యలు ఎక్కువగా ఉన్నాయని హిమాచల్‌ప్రదేశ్ నుంచి ఉమ్రాన్ ఠాకూర్, ఉత్తరాఖండ్ నుంచి కమ్రాత్ తెలిపారు. పలు సమస్యలపై పోరాటాలు చేసి విజయాలు సైతం సొంతం చేసుకున్నామని మధ్యప్రదేశ్ ప్రతినిధి అరుణ్ చౌహాన్ తెలిపారు. కేంద్ర ఇళ్ల పథకం అమలుపై పోరాడాలని మహారాష్ట్ర నుంచి ఇంద్రజిత్ గేవిట్ సూచించారు.

ఢిల్లీ ఉద్యమంతో కొత్త ఒరవడి

నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దుల్లో నిర్వహించిన ఉద్యమం వలన రాష్ట్రంలో రైతు పోరాటాల్లో కొత్త ఒరవడి ఆవిష్కృతమైందని ఆంధ్రప్రదేశ్ నుంచి చర్చల్లో పాల్గొన్న ఎం సూర్యనారాయణ చెప్పారు. రాష్ట్రంలో 40 వరకు సంఘాలు కదిలొచ్చాయన్నారు. ఈ కాలంలో భూసేకరణ, ధాన్యం కొనుగోలు, చక్కెర రైతుల బకాయిలు, పాల రైతులు, కల్తీ విత్తనాలు, నారు, విపత్తు నష్ట పరిహారం, వరి, ఉల్లి, టమాటా మార్కెట్ ధరలు, తదితర సమస్యలపై ర్యాలీలు, ధర్నాలు నిర్వహించామన్నారు. 80 శాతం ఉన్న కౌలు రైతుల సమస్యలపై కేంద్రీకరించి పనిచేస్తున్నామని, పలు ఆందోళనలు చేశామని హరిబాబు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడంలేదని ఆ రాష్ట్ర ప్రతినిధి బొంతు రాంబాబు తెలిపారు. రైతు బంధు పథకంతో భూస్వాములు, సాగుతో సంబంధం లేని బ్యూరోక్రాట్ల వంటి వారు కూడా లాభపడుతున్నారన్నారు. భూసేకరణ, నష్ట పరిహారం, ఆదివాసీ హక్కులు కోసం పోరాటాలు చేశామన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాలో భాగమే ఎన్ఇపి

- ఫాసిస్టు, మతతత్వ విధానాలు దేశానికి ప్రమాదం
- హక్కుల సాధనకు పోరాటమే మార్గం
- ప్రత్యామ్నాయ విద్యావిధానం అమలు చేస్తున్న కేరళ ప్రభుత్వం
- ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభల్లో మాజీ నేతలు

స్టూడెంట్ స్ట్రగుల్ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న వైవి, ఎంఎ బేబి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేయడం కోసమే నూతన జాతీయ విద్యావిధానం (ఎన్ఇపి)-2020ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తోందని ఎస్ఎఫ్ఐ జాతీయ మాజీ నాయకులు అన్నారు. విద్యార్థుల హక్కులు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గమని సూచించారు. ఫాసిస్టు, మతతత్వ విధానాలు దేశానికి ప్రమాదకరమని, విద్యారంగంతోపాటు సాంస్కృతిక రంగం, జాతీయవాదంపైనా కేంద్రీకరించి పనిచేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రత్యామ్నాయ విద్యావిధానాన్ని అమలు చేస్తోన్న కేరళలోని వామపక్ష ప్రభుత్వం దేశానికి ఆదర్శనమని తెలిపారు. ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభలో భాగంగా బుధవారం జరిగిన సదస్సులో ఎస్ఎఫ్ఐ జాతీయ మాజీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు సౌహార్ద సందేశమిచ్చారు. ఎస్ఎఫ్ఐ అఖిల భారత మాజీ అధ్యక్షులు ఎంఎ బేబి మాట్లాడుతూ విద్య కాషాయీకరణ, ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ, వ్యాపారీకరణతోపాటు కేంద్రీకరణ ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఫాసిస్టు, మతతత్వ విధానాలను ఎన్ఇపి ద్వారా మోడీ ప్రభుత్వం విద్యారంగంలో అమలు చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఇందులో ఆర్ఎస్ఎస్ సైద్ధాంతిక ఎజెండా ఉందని పేర్కొన్నారు. ప్రగతిశీల, అభ్యుదయ భావాలు, శాస్త్రీయ విద్యను అందించకుండా విద్యార్థులు, యువకులే లక్ష్యంగా వారు సృజనాత్మకంగా ఆలోచించకుండా చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫాసిస్టు, మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ అఖిల భారత మాజీ అధ్యక్షులు వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యారంగాన్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ధ్వంసం చేస్తోందన్నారు. విద్యార్థి సంఘాలే లక్ష్యంగా నిర్బంధాన్ని ప్రయోగిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి నీలోత్పల్‌బసు మాట్లాడుతూ దేశంలో కార్పొరేట్, మతతత్వ శక్తులు ఏకమవుతున్నాయన్నారు. విద్యార్థులకు నాణ్యమైన చదువు అందించకుండా, యువతకు ఉపాధి అవకాశాలను కల్పించకుండా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సిఐటియు జాతీయ కార్యదర్శి కెఎన్ ఉమేశ్ మాట్లాడుతూ విద్యార్థులు,కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని, దేశాన్ని కాపాడేందుకు కలిసి పోరాడాలని అన్నారు. ఎన్‌పిఆర్‌డి ప్రధాన కార్యదర్శి మురళీధర్ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానం (ఎన్ఇపి)ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఉన్నత విద్యలో వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ ఉన్నా అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఐద్వా నేత సుకన్య మాట్లాడుతూ ఎన్ఇపి ద్వారా ఆర్ఎస్ఎస్ మనువాద భావజాలాన్ని అమలు చేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తోందని, దీనిన వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. డివైఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి హిమాంగరాజ్ భట్టాచార్య మాట్లాడుతూ దేశంలోని విద్యార్థులు, యువకులకు ఉపాధి అవకాశాల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎఐఎడబ్ల్యుయు జాతీయ కార్యదర్శి విక్రంసింగ్ మాట్లాడుతూ లక్షలాది మంది రైతులు ఐక్యంగా పోరాడడం వల్లే మూడు వ్యవసాయ నల్ల చట్టాలను మోడీ ప్రభుత్వం వెనక్కి తీసుకుందన్నారు. అదే తరహాలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ, అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఎఎఆర్ఎం) జాతీయ కమిటీ సభ్యులు ఆర్ శ్రీరాంనాయక్ మాట్లాడుతూ గిరిజనులకు మెరుగైన విద్యావిధానం కోసం పోరాడాలన్నారు. అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు మోడీ ప్రభుత్వం కట్టబెడుతోందని తెలిపారు. గిరిజనుల సంస్కృతిపై దాడి చేస్తోందన్నారు. అనంతరం స్టూడెంట్ స్ట్రగుల్ మ్యాగజైన్‌తో పాటు విద్యార్థి అమరుల ఫొటోలతో కేరళ ఎస్ఎఫ్ఐ కమిటీ ముద్రించిన కేలండర్‌ను నేతలు ఆవిష్కరించారు.

కాంగో రాజధానిని ముంచెత్తిన వరదలు

- వంద మంది పైగా మృతి, పలువురికి గాయాలు

కిన్షాషా : కాంగో రాజధాని కిన్షాషాను వరదలు ముంచెత్తాయి. భారీ వర్షాల కారణంగా పెద్ద ఎత్తున వరదలు సంభవించడం, కొండచరియలు విరిగిపడడంతో మంగళవారం వంద మంది పైగా మరణించారు. అనేక మంది గాయపడ్డారు. ఆచూకీ తెలియకుండా పోయిన వారి కోసం గాలింపు జరుగుతోందని ప్రధాని జేన్ మైఖేల్ సామా లుకోండె తెలిపారు. ఈ వరదల ధాటికి జరిగిన నష్టాన్ని అంచనా వేయాల్సి వుందని, ప్రాథమికంగా అయితే మానవ నష్టం ఎక్కువ జరిగిందని ప్రధాని చెప్పారు. రాజధానిలో దాదాపు కోటీ 20 లక్షల మంది నివసిస్తున్నారు. వర్షాలు, వరదల కారణంగా ఇళ్ళు మునిగిపోయి, రోడ్లు దెబ్బతిన్నాయని, ఆస్తి నష్టం కూడా ఎక్కువగానే వుందని అధికారులు తెలిపారు. నాగలెమా ప్రాంతంలో దాదాపు 40 మంది చనిపోయారని ఆ ప్రాంత మేయర్ తెలిపారు. అధికారికంగా అనుమతులు లేకుండా కట్టిన ఇళ్ళలోనే ఎక్కువగా విధ్వంసం చోటు చేసుకుందని అధికారులు పేర్కొంటున్నారు.

అక్రమ వలసలకు ఐదంచెలతో అడ్డుకట్ట !

- బ్రిటన్ ప్రధాని రిషి సునాక్



లండన్ : అక్రమ వలసలకు అడ్డుకట్ట వేసేందుకు ఐదంచెల వ్యూహాన్ని అనుసరించాలని బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ యోచిస్తున్నారు. తమ దేశంలో ఆశ్రయం కోరుతూ వచ్చిన దరఖాస్తులన్నింటినీ వచ్చే ఏడాది చివరికల్లా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇంగ్లీషు చానెల్‌ను దాటేందుకు ప్రయత్నించే చిన్న చిన్న బోట్లను పర్యవేక్షించేందుకు కొత్త యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని, అందులో వందలాదిమంది అదనపు సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. అల్బేనియా సురక్షితమైన దేశంగా పేరొందినప్పటికీ అక్కడ నుండి పెద్ద సంఖ్యలో అక్రమ వలసదారులు వస్తూ వుంటారని, అందువల్ల అల్బేనియన్ల క్లెయిమ్‌లను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా ఒక యూనిట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. క్లెయిమ్‌ల పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న 10వేలమంది శరణార్థులకు హోటళ్ళ కన్నా తక్కువ ఖర్చు కాగల వసతి సదుపాయం కల్పించాలని కూడా సునాక్ ఆలోచిస్తున్నారు. అక్రమంగా ఇక్కడకు రావడం సరికాదు, పైగా సురక్షితంగా వున్న, భద్రత కలిగిన దేశాల నుండి కూడా ప్రజలు ఇక్కడకు రావడం సరికాదని సునాక్ పేర్కొన్నారు. హౌస్ ఆఫ్ కామన్స్‌లో ఆయన ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. చిన్న బోట్ల ఆపరేషనల్ కమాండ్ ఏర్పాటు చేస్తామని, ఇందులో 700మంది కొత్త సిబ్బంది వుంటారని తెలిపారు. యూరప్‌లో సంఘటిత ఇమ్మిగ్రేషన్ నేరాలను ఎదుర్కొనడానికి గానూ బ్రిటన్ నేషనల్ క్రైమ్ ఏజెన్సీ (ఎన్‌సిఎ)కి నిధులు రెట్టింపు చేస్తామని చెప్పారు.

మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర కమిటీ సభ్యులు బి.కుసుమ, రాష్ట్ర కమిటీ సభ్యులు రాణి

ఎస్ఎఫ్ఐ పోరాట ఫలితమే ఎయిడెడ్ విద్యాసంస్థల మనుగడ

- అఖిల భారత మహాసభలో ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు

మహాసభకు హాజరైన ఎస్ఎఫ్ఐ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో విద్యారంగ పరిరక్షణ, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ నిర్విరామంగా కృషి చేస్తోందని ఆ రాష్ట్ర ప్రతినిధులు తెలిపారు. ఎస్ఎఫ్ఐ 17వ అఖిల భారత మహాసభలలో రెండో రోజు బుధవారం ప్రతినిధుల సభ జరిగింది. ఎస్ఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి మయూక్ బిస్వాస్ ప్రవేశపెట్టిన నివేదికపై ప్రతినిధులు చర్చించారు. ఆయా రాష్ట్రాల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థి ఉద్యమాలు, సమస్యలను ప్రతినిధులు వివరించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్న, అశోక్‌తోపాటు మొత్తం 69 మంది ప్రతినిధులు జాతీయ మహాసభకు హాజరయ్యారు. కార్యకలాపాల నివేదికను రాష్ట్ర కమిటీ సభ్యులు రాణి, నిర్మాణ నివేదికను రాష్ట్ర కమిటీ సభ్యులు బి.కుసుమ ప్రవేశపెట్టారు. గత మహాసభ నుండి ఇప్పటివరకూ రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి చేసిన కృషిని మహాసభకు రాణి వివరించారు. ఎస్ఎఫ్ఐ పోరాటాల ఫలితంగానే ఆంధ్రప్రదేశ్‌లో ఎయిడెడ్ విద్యాసంస్థలు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కరోనా వంటి సమయంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.

మూడు తీర్మానాలు ఆమోదం

రెండో రోజు మూడు తీర్మానాలను మహాసభ ఆమోదించింది. యుజిసిని నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకుని తిరిగి స్వయంప్రతిపత్తి కోసం పోరాడాలని, సామ్యవాద పరిరక్షణలో భాగంగా క్యూబా ప్రజలకు అండగా నిలవాలని, మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థుకు పౌష్టికాహారం అందించాలని మహాసభ తీర్మానించింది.

షెడ్యూల్ తెగలుగా 'యుపి' గోండులు

- బిల్లుకు రాజ్యసభ ఆమోదం

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లోని నాలుగు జిల్లాల్లో (చందౌలి, ఖుషినగర్, సంత్ కబీర్ నగర్, సంత్ రవిదాస్) గోండు సామాజిక తరగతిని షెడ్యూలు తెగలు (ఎస్‌టి) జాబితాలో చేర్చేందుకు ఉద్దేశించిన సవరణ బిల్లుకు రాజ్యసభ బుధవారం ఆమోదం తెలిపింది. రాజ్యాంగ (ఎస్‌సి, ఎస్‌టిలు) ఉత్తర్వు (రెండో సవరణ) బిల్లు ప్రాముఖ్యతను కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి అర్జున్ ముండా సభకు తెలియజేశారు. ఆ తర్వాత కొద్ది సేపటికే బిల్లు ఆమోదం పొందింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది. రాజ్యసభలో ఈ బిల్లుపై మంగళవారం సుదీర్ఘ చర్చ జరిగింది. 26 మంది ఎంపిలు ప్రసంగించారు. పార్టీలకు అతీతంగా సభ్యులు ఈ బిల్లుకు మద్దతు పలికారు. అయితే ప్రతిపక్ష ఎంపిలు మాత్రం ఇతర సామాజిక తరగతుల చేర్పును పరిగణనలోకి తీసుకోవాలని కోరాయి. కుల ఆధారిత జనాభా గణనను చేయాలని, దీని ద్వారా కచ్చితమైన సమాచారం ఆధారంగా చేర్పులు చేయవచ్చని విజ్ఞప్తి చేశారు. గోండులను ఎస్‌టి జాబితాలో చేర్చడాన్ని నాలుగు జిల్లాలకే ఎందుకు పరిమితం చేస్తున్నారని కాంగ్రెస్ ఎంపి ప్రమోద్ తివారీ ప్రశ్నించారు.

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

పోస్టు ఆఫీసుల్లో 75,384 పోస్టులు ఖాళీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశవ్యాప్తంగా పోస్టు ఆఫీసుల్లో 75,384 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి దేవుసిన్ చౌహాన్ తెలిపారు. లోక్‌సభలో ఎంపిలు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. గ్రూప్ ఎలో 236, గ్రూప్ బిలో 7,743, గ్రూప్ సిలో 67,405 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

బిసిలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించలేం

విద్యా, ఉపాధి రంగాలలో ఒబిసిలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వం వద్ద లేదని సామాజిక న్యాయ శాఖ సహాయ మంత్రి సుశ్రీ ప్రతిమా భౌమిక్ బుధవారం రాజ్యసభలో ప్రకటించారు. ఒబిసిలకు జనాభా ప్రాతిపదికపై విద్యా, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్ కల్పించాలని సుదీర్ఘకాలంగా వస్తున్న న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుందా? పరిగణలోకి తీసుకున్న పక్షంలో ఒబిసిలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏంటీ? అని వైసిపి ఎంపి విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఇందిరా సహానీ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునకు లోబడి ఒబిసిలకు 27 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలతో 50 శాతం రిజర్వేషన్‌ను అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. జనాభా ప్రాతిపదికపై ఒబిసిలకు రిజర్వేష్ కల్పించాలంటూ దేశం వ్యాప్తంగా వివిధ వ్యక్తులు, సంస్థల నుంచి ప్రభుత్వానికి వినతులు అందుతున్నట్లుగా కేంద్ర మంత్రి తెలిపారు.

భూమిస్తే..ఉద్యోగమిచ్చే విధానం రద్దు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రైల్వే ప్రాజెక్టుల్లో భూమి కోల్పోయిన వారికి ఉద్యోగులు కల్పించే విధానాన్ని రద్దు చేసినట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఒక ఎంపి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2019 నవంబర్ 11న రైల్వే మంత్రిత్వ శాఖ ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. నియామకాల కోసం భూమి కోల్పోయిన వారి డిమాండ్లను ఎప్పటికప్పుడు అందించిన సూచనల మేరకు పరిష్కరిస్తామని అన్నారు.

బీమా కొరెగావ్ కేసులో నిందితులందరినీ విడుదల చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

దాచి వుంచారు. ఈ సాక్ష్యాధారాలను గుర్తించడానికి ఎన్ఐఎ తిరస్కరించడం, వీటిపై తన స్వంత విచారణకు ఆదేశించడం తీవ్రంగా ఖండించదగ్గ విషయమని సిపిఎం పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఎన్ఐఎపై అధికారమున్న కేంద్ర ప్రభుత్వం కూడా ఈ నివేదికలను గుర్తించడానికి తిరస్కరించడం కూడా ఖండించాల్సిన అంశమేనని పేర్కొంది. గత నివేదికలతో పాటూ తాజాగా వెలువడిన ఆర్సెనల్ నివేదిక ప్రకారం బీమాకొరెగావ్ నిందితులందరిపై కేంద్ర ప్రభుత్వం చేసిన ఆరోపణలన్నీ తప్పుడు ఆరోపణలేనని, లక్ష్యంగా చేసుకొని సృష్టించినవేనని తెలిపోయిందని సిపిఎం పేర్కొంది. తనకు తానుగా సృష్టించుకున్న నకిలీ ఆధారాలు మినహా మరే ఇతర సాక్ష్యాధారాలు లేకుండానే తాను లక్షించిన వారినీ జైల్లో పెట్టడం ఎన్ఐఎ వ్యవహార శైలిగా ఉందని సిపిఎం తప్పుబట్టింది. నేడు ఈ ప్రమాదకరమైన సాంకేతికతతో, మాల్వేర్‌తో బలైపోతున్నది బీమా కొరెగావ్ కేసులోని నిర్బంధితులేనని ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించే ఎవరైనా రేపు ఇదే రకంగా బలైపోయే ప్రమాదముందని సిపిఎం తెలిపింది. బీమా కొరెగావ్ కేసులోని నిందితులందరినీ తక్షణమే జైలు నుండి విడుదల చేయాలని డిమాండ్ చేసింది. నిందితుల బెయిల్ దరఖాస్తులను లేదా విడుదల చేయాలని కోరుతున్న విజ్ఞప్తులను ఇప్పటికైనా ఎన్ఐఎ తిరస్కరించరాదని కోరింది. అందుబాటులో వున్న ఫోరెన్సిక్ సాక్ష్యాధారాలను పరిగణనలోకి తీసుకుని నిర్దిష్ట కాలపరిమితిలో నిపుణులచే, పున్ణపరిశీలన జరిపించాలని డిమాండ్ చేసింది.

మీకోసం

ఒక కప్పు వేడినీటిలో చిటికెడు పసుపు వేసి రాత్రి పడుకునే ముందు తాగితే గొంతునొప్పి, జలుబు నుంచి ఉపశమనం కలుగుతుంది.

జీవన సౌరభం

పనిని సాధించడానికి సాధనపై గురి ఏర్పరచుకోవాలన్నదే జీవితంలో నేర్చుకోవాల్సిన గొప్ప పాఠం.

జీర్ణక్రియపై ప్రవర్తన ప్రభావం

చిన్నారులూ,



శరీర నిర్మాణ శాస్త్రవేత్త ఇవాన్ పావ్ లోవ్ మనస్తత్వ శాస్త్రవేత్తగా కొన్ని ప్రయోగాలు చేసి, స్పందన చర్యలను కనుగొన్నారు. ఆయన 1849 సెప్టెంబర్ 26 మాస్కోలో జన్మించారు. పిట్స్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో వైద్యంలో డిగ్రీ పొందారు. శరీర ధర్మ శాస్త్ర ఆచార్యునిగా మిలటరీ మెడికల్ అకాడమీలో చేరారు. తర్వాత ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్సపెరిమెంటల్ మెడికల్ డైరక్టర్ పదవీ బాధ్యతలు నిర్వహించారు. శరీర నిర్మాణంలో కొత్త ఆవిష్కరణలు చేసిన ఆయన ఆహారానికి సంబంధించి జంతువుల్లో ఎటువంటి స్పందన, ప్రతిచర్య ఉంటాయో అధ్యయనం చేసి జీర్ణక్రియ విధానాన్ని వివరించాడు.

పావ్ లోవ్ తన ప్రయోగాన్ని ఒక కుక్కపై చేశారు. దానిని ఒక తాడుతో కట్టి, దాని నోట్లోని లాలాజలం ఒక బీకరులోకి వచ్చేట్టు ఒక పైపును అమర్చాడు. కుక్కకు ఆహారం చూపించడం అనేది సహజ ఉద్దీపనగా, గంట కొట్టడం అనేది అసహజ ఉద్దీపనగా భావించి ప్రయోగం నిర్వహించారు. వివిధ సందర్భాల్లో వచ్చిన లాలాజల పరిశీలనతో తగిన నిర్ధారణకు వచ్చారు. ఈ ప్రయోగాన్ని మూడు దశలుగా నిర్వహించారు.

లాలాజల గ్రధులు, ఉదరం, క్లోమం, కాలేయం, ఎలా రసాయనాలు కలుపుతూ ఆహారం కార్బొహైడ్రేట్లు, ప్రోటీన్లు, కొవ్వులుగా మారుతుందో అధ్యయనం చేసి, ఎంటరో కైనేజ్ అనే ఎంజైమ్‌ను కనుగొన్నారు. నేర్చుకొన్న ప్రవర్తన అనేది అసంఖ్యాకమైన నిబంధనాయుత ప్రతి చర్యల సమాహార నిర్మాణం అని వివరించారు. ఉద్రిక్తత, భయం అనేవి విపరీత ప్రపర్తనకు దారి తీస్తాయని పావ్ లీవ్ పరిశీలనలో తేల్చారు. జీర్ణక్రియకు సంబంధించిన పరిశోధనకు ఆయనకు నోబెల్ బహుమతి లభించింది. ఫిబ్రవరి 27వ పావ్ లీవ్ మరణించారు.

అవి ఏవీ?

చిన్నారులూ, ఇక్కడ కొంతమంది హాకీ ప్లేయర్స్ ఉన్నారు. వీరిలో ఇద్దరూ ఒకే విధంగా ఉన్నాయి. వారు ఎవరో కనిపెట్టండి.

8 - 9 : జవాబు

నేను గీసిన బొమ్మ

- జి. రిబుక ,7వ తరగతి, రాయిలాపూర్, మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

గెలుపుకొక చిహ్నంగా ..
చిన్నారులకు ధైర్యంగా ...

రమ్య ఆస్టియోజెనిసిస్ ఇంపెర్ఫెక్టా (పెళుసు ఎముక వ్యాధి)తో బాధపడుతోంది. ఇది పుట్టుకతో వచ్చే అరుదైన జన్యుపరమైన రుగ్మత. ఆమె పుట్టినప్పుడు మూడు నెలలకు మించి బతకదన్నారు వైద్యులు. వ్యాధితో పోరాడుతూనే 33 ఏళ్లుగా జీవిస్తోంది. ప్రతికూల పరిస్థితిలో కూడా రమ్య చదువుకుంది. ఇంగ్లీషు, కన్నడ భాషలపై పట్టు సాధించింది. ఇప్పుడు ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల స్కూలు ఉపాధ్యాయురాలిగా బాధ్యతలు నిర్వహిస్తోంది. పట్టుదల ఉంటే సాధించొచ్చు అనటానికి ఒక ఉదాహరణగా, తన విద్యార్థులకు ఒక ధైర్యవచనంగా ఆమె నిలబడుతోంది.

బెంగళూరు దగ్గర హోస్కోట్‌కు చెందిన రమ్య ... చదువుకునేందుకు కూడా పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చింది. ఊహ వచ్చినప్పటి నుంచి తనకు చదువు మీద గొప్ప ఆసక్తి. స్కూలుకు వెళ్లి బాగా చదువుకుంటానని తోటివారితో చెబుతుండేది. కానీ, తనని చూసిన పాఠశాల యాజమాన్యాలు 'ఆమెకు చదువు చెప్పలేమని' అడ్మిషన్‌కు తిరస్కరించేవి. రమ్య వాళ్లమ్మ అంగన్‌వాడీ టీచర్. దాంతో తాను ఏ స్కూల్లో పాఠాలు చెబుతుందో అక్కడే చేర్చింది. రోజూ ఆటోలో తీసుకెళ్లి, తీసుకువచ్చేది. రమ్యను తోటి పిల్లలు హేళన చేసేవారు. తమలా కదలలేదని ఆట పట్టించేవారు. అవన్నీ భరిస్తూనే తరువాతి కాలంలో– రమ్య పదో తరగతి, ఇంటర్ ఫస్ట్‌క్లాసులో ఉత్తీర్ణత సాధించింది. తర్వాత ఇంటికి దగ్గర్లో ఉన్న ఓ ప్రయివేటు డిగ్రీ కళాశాలకు వెళ్లింది. వారు అడ్మిషన్ ఇవ్వలేదు. రమ్య వాళ్ల అమ్మ వారి ఎంత బతిమిలాడినా, నిర్లక్ష్యంగా మాట్లాడారు. 'అటువంటి పరిస్థితి అమ్మకు మళ్లీ రాకూడదు' అని రమ్య నిర్ణయించుకుంది. అందరూ గౌరవించేలా మంచి ఉద్యోగం సాధించాలని అనుకొంది.



పోటీ పరీక్షలకు దూరం

ఆమె డిగ్రీ చదవడం కోసం తల్లి తమ బంధువులు నివాసం ఉన్న కోలార్ జిల్లాకు నివాసం మార్చింది. ముల్బాగల్‌లో ప్రభుత్వ కళాశాలలో చేర్చింది. అక్కడ సిబ్బంది, అధ్యాపకులు రమ్యను అన్ని విధాలా బాగా చూసుకున్నారు. నిదానంగా పాఠాలు చెప్పడం, నోట్స్ రాయించడం, పరీక్షల సమయంలో ఇబ్బంది కలగకుండా చూడడం .. ఇలా సహాయపడ్డారు. వారి ప్రోత్సాహంతోనే దూరవిద్యలో రాజకీయ శాస్త్రంలో ఎంఎ పూర్తి చేసింది రమ్య. సివిల్ ఎగ్జామ్స్ రాసి, తనలాంటి బాధితులకు అండగా నిలవాలనుకుంది. కోచింగ్ తీసుకుంది. ఆరోజు పరీక్ష మూడో అంతస్తులో జరిగింది. రమ్యను ఎత్తుకుని మెట్లు ఎక్కలేక తల్లి కుప్పకూలిపోయింది. దాంతో రమ్య ఆ పరీక్ష రాయలేకపోయింది. తాను అనుకున్న లక్ష్యం చేరుకోలేనని నిరాశపడింది. కాని తల్లి ధైర్యం చెప్పి, అండగా నిలిచింది. దాంతో రమ్య లక్ష్యం మార్చుకుని ముల్‌బాగల్లో శారదా కళాశాల్లో బీఈడీ కోర్సులో చేరింది. మంచి మార్కులు సాధించింది.

వికలాంగుల పిల్లలకు బోధిస్తూ ...

రమ్య పట్టుదల, ప్రతిభను గుర్తించి బెంగుళూరులో అసోసియేషన్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసేబిలిటీ సంస్థ లింగరాజపురంలో ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా నియమించింది. ప్రస్తుతం ఆమె పాఠశాలకు సమీపంలో అద్దె ఇంట్లో ఉంటోంది. అక్కడ నుంచి ఎలక్ట్రిక్ వీల్‌చైర్‌లో స్కూలుకు వస్తూ ... 4వ నుంచి 7వ తరగతి విద్యార్థులకు కన్నడ నేర్పుతుంది. మొదట్లో పిల్లలను తన పర్యవేక్షణలోకి తెచ్చుకోవటానికి చాలా ఇబ్బంది పడింది. తరువాత నిదానంగా మాటలతోనే పిల్లల్ని నియంత్రించి, తన మాట వినేలా చేయగలిగింది. రోజంతా విగలాంగులైన పిల్లలకు బోధిస్తూ గడపటం తనకు మానసిక ఆనందాన్ని కలిగిస్తుందని రమ్య అంటోంది. ఖాళీ సమయంలో ఆమె ఎడమ చేత్తో బొమ్మలు గీస్తోంది. తల్లికి వంట గదిలో సహాయమూ చేస్తోంది.

బాధితులకు తోడుగా ...

తనలాంటి వారికి ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలు, అవకాశాల తెలియక రమ్య జీవితంలో చాలా ఇబ్బందులు పడింది. అందుకే ఇప్పుడు తనలాంటి బాధితులకు సంక్షేమ పథకాల పట్ల అవగాహన కల్పిసోతంది. దగ్గర ఉండి సహాయం అందిస్తోంది. ఇటీవల అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా బెంగళూరులోని లాల్‌బాగ్ బొటానికల్ గార్డెన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. అక్కడ వికలాంగులకు బహిరంగ ప్రదేశాల్లో స్కేలింగ్ యాక్సెసిబిలిటీ గురించి ఆమె మాట్లాడింది. చిన్న వయసు నుండే పిల్లలకు వీలైనంత ఎక్కువ ఎక్స్‌పోజర్ ఇవ్వాలని, దాంతో వారిపై వారికి నమ్మకం కలుగుతుందని రమ్య చెబుతోంది.

విటమిన్ 'డి'.. ఇలా పొందండి...

శీతకాలంలో ఎముకలు, కండరాలు నొప్పులు వస్తుంటాయి. మెదడుకు అందాల్సిన సంకేతాలూ అందవు. స్తబ్దతో కూడిన వాతావరణమే అందుకు కారణం. వర్షం, మంచు కారణంగా సూర్యకాంతి నుండి శరీరానికి తగినంత మొత్తంలో విటమిన్ డి లభించదు. ఇది మన శరీరంలో కాల్షియం గ్రహించడంలో సహాయపడుతుంది. నరాలు. రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి కూడా సహాయపడుతుంది. ఇలాంటప్పుడు ఆహారంలో క్రమం తప్పకుండా కొన్ని నియమాలు చేర్చుకోవాలి.

- విటమిన్ డి పుష్కలంగా ఉండే ఆహారాలలో చేప ఒకటి. 100 గ్రాముల చేపలో విటమిన్ డి సమృద్ధిగా దొరుకుతుంది. చేప తినడానికి ఇష్టపడని వారు కాడ్ లివర్ ఆయిల్ ఉపయోగించవచ్చు.
- గుడ్డులోని తెల్లసొనలో ప్రోటీన్లు పుష్కలంగా ఉన్నప్పటికీ, సొనలు ఎక్కువగా కొవ్వు, విటమిన్లు, మినరల్స్‌లో విటమిన్ డి అధికంగా ఉంటుంది.
- పుట్టగొడుగులు సూర్యరశ్మి నుంచి విటమిన్ డిని సంశ్లేషణ చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. అందుకే ఆహారంలో వారంలో రెండు, మూడు సార్లు పొట్టగొడుగులను చేర్చుకోవచ్చు.
- పాలలో కాల్షియం అధికంగా ఉంటుంది. గ్లాసు పాలలో రోజుకు అవసరమైన విటమిన్ డి అందుతుంది. పాలులో ప్రోటీన్, కాల్షియం, భాస్వరం, మెగ్నీషియం, మాంగనీస్, జింక్‌తో పాటు, విటమిన్ కె కూడా ఇందులో ఉన్నాయి.
- పాలు తాగడం ఇష్టం లేనివారు పెరుగును ఆహారంలో చేర్చుకోవాలి. ప్రత్యేక విటమిన్ లోపాన్ని తీర్చగల సామర్థ్యం పెరుగుకు ఉంది. సోయా పదార్థాల్లో విటమిన్ డి ఉంటుంది.
- ఈ సీజన్‌లోదొరికే నారింజ పండులో కాల్షియం, ఇనుము, జింక్, మెగ్నీషియం, విటమిన్ ఎ,బి,సి, డి పుష్కలంగా లభిస్తాయి. వీటిలో ఏదో ఒకటి రోజూ తీసుకుంటే వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చు.

ఫెర్రో ఎల్లాయిూస్ పరిశ్రమలకు షాక్!

- భారం కానున్న విద్యుత్తు ఛార్జీల పెంపు
- అప్పటికే గ్లోబల్ మార్కెట్లో నిలబడలేని పరిస్థితి

ఫ్యాక్టరీ

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

విద్యుత్తు ఛార్జీల పెంపుతో రాష్ట్రంలోని ఫెర్రో ఎల్లాయిస్, అల్యూమినియం కంపెనీలు మరింత సంక్షోభంలోకి వెళ్లనున్నాయి. ఇప్పటికే కొన ఊపిరితో నడుస్తోన్న పరిశ్రమలు మూతపడే ప్రమాదం ఉంది. 2023–24లో విద్యుత్తు ఛార్జీలకు సంబంధించిన వార్షిక ఆదాయ, అవసరాల నివేదిక (ఎఆర్ఆర్)ను రాష్ట్రంలోని మూడు డిస్కములు ప్రవేశపెట్టాయి. దీని ప్రకారం పవర్ ఇంటెన్సివ్ పరిశ్రమలపై రూ.697.06 కోట్ల భారం పడనుంది. దీనివల్ల ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు మరింత ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతాయని యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 40 ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో 37 వరకు ఉత్తరాంధ్రలోనూ వాటిలో అత్యధికంగా 18 వరకూ విజయనగరం జిల్లాలోనూ ఉన్నాయి. ఒకప్పుడు ఈ పరిశ్రమలు మూడు పువ్వులు ఆరు కాయలుగా పనిచేసేవి. విజయనగరం జిల్లాలో ఈ పరిశ్రమలపై వేలాది కుటుంబాలు ఆధారపడేవి. గరివిడి ఫేకర్‌లో ఉద్యోగం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాలు వదులుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఇటువంటి పరిశ్రమలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల నాలుగు దశాబ్దాలుగా ఎప్పటికప్పుడు మూతపడడం, తెరుచుకోవడం వంటి స్థితిలోకి వెళ్లాయి. ముఖ్యంగా విద్యుత్తు ఛార్జీలను తట్టుకోలేకపోతున్నాయి. 2018 నుంచి ఈ పరిశ్రమలకు విద్యుత్తు రాయితీలు లేవు. గత ఆర్థిక సంవత్సరానికి ముందు యూనిట్ ధర రూ.4.95 ఉండగా, ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రూ.5.95 చొప్పున అమలవుతోంది. విద్యుత్తు ఛార్జీలను తట్టుకోలేక రాష్ట్రంలోనే అతిపెద్ద గరివిడి ఫేకర్ 20 ఏళ్లగా తన ఉత్పత్తిని తగ్గించుకుంటూ వస్తోంది. దీంతో, ఒకప్పుడు ఆరు వేల మంది పర్మినెంట్ కార్మికులు, సుమారు 1500 మంది రోజువారీ కూలీలతో కళకళలాడే ఈ ఫ్యాక్టరీలో పరిసర ప్రాంతం నేడు బోసిపోయినట్టుగా కనిపిస్తోంది. విద్యుత్తు రాయితీలు కల్పిస్తామని ఎన్నికలు వచ్చినప్పుడల్లా రాజకీయ పార్టీలు హామీలు గుప్పించడం, అధికారంలోకి వచ్చాక దీనికి భిన్నంగా వ్యవహరించడం మామూలైంది. విద్యుత్తు ఛార్జీలు దాదాపు రూ.700 కోట్ల మేర అదనపు భారం పడుతుందని సాక్షిత్తు డిస్కంలే అంచనాలు వేయడంతో యాజమాన్యాల్లో ఆందోళన మొదలైంది. మరోవైపు పరిశ్రమలకు గనులు కేటాయించడం లేదు. మన రాష్ట్రంలోని పరిశ్రమలు 90 శాతం ముడిసరుకును ఒడిశా నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి. అక్కడి గనుల్లో 70 శాతం ఆ రాష్ట్ర ప్రభుత్వం టాటా మల్టీనేషనల్ కంపెనీకి లీజుకు ఇచ్చేసింది. మిగిలిన 30 శాతం ఓపెన్ టెండర్ రూపంలో విక్రయిస్తుండడంతో ముడిసరుకు కోసమే ఫెర్రో యాజమాన్యాలు ఎక్కువగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ఈ పరిశ్రమల్లో ప్రధానంగా ఫెర్రో క్రోం, సిలికాన్ మాంగనీస్ తయారు చేసి, మనదేశంలోని వివిధ ప్రాంతాలతోపాటు చైనా, దక్షిణాఫ్రికా వంటి దేశాలకు విక్రయిస్తారు. మారిన గ్లోబల్ మార్కెట్ విధానాల వల్ల ఎగుమతి, దిగుమతులపై నియంత్రణ లేదు. దీంతో, మార్కెట్ ధరల్లో నిలకడ లోపించింది. దీనికితోడు విద్యుత్తు ఛార్జీలపై రాయితీలు ఇవ్వకపోవడం, ఏటా పవర్ ఛార్జీలు పెంచడం వల్ల వంటి కారణాల వల్ల మన రాష్ట్రంలోని చిన్నచిన్న పరిశ్రమల మనుగడ కష్టతరంగా మారింది. విజయనగరం జిల్లాలో బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లోని యోనా, మెరకముడిదాం మండలంలోని ఆంధ్రా ఫెర్రో మూతపడ్డాయి. కొత్తవలసలోని ఆంధ్రా ఫెర్రోను పూర్తిగా ఎత్తివేశారు. మరికొన్ని పరిశ్రమలు కొన ఊపిరితో నడుస్తున్నాయి.

విద్యుత్తు ఛార్జీలు పెంచితే మరింత కష్టం

విద్యుత్తు ఛార్జీలు పంచితే ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమల మనుగడ మరింత కష్టతరంగా మారుతుంది. ఇప్పటికే రాష్ట్రంలో చాలావరకూ మూతపడ్డాయి. ఎప్పుడూ ఛార్జీలు పెంచడం తప్ప, రాయితీలు ఇవ్వడం లేదు. 2018 తరువాత ఏటేటా ఛార్జీలు పెంచారు. విద్యుత్తు బిల్లులు రూ.లక్షల్లో వస్తున్నాయి. వేతనాలు, మెయింటినెన్స్, మరమ్మతులు చాలా భారంగా పరిణమించాయి. దీనికితోడు ముడిసరుకు సమస్య ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌ను తట్టుకోలేకపోతున్నాం. మమ్మల్ని నమ్ముకుని ఉన్న కార్మికులకు పూర్తి స్థాయిలో ఉపాధి కల్పించలేకపోతున్నాయి.

–లక్కరాజు నారాయణమూర్తి, గరివిడి ఫేకర్ డిజిఎం

ఫైనల్లో అర్జెంటీనా

- సెమీస్‌లో క్రొయేషియాపై 3-0తో గెలుపు
- ఫిఫా ప్రపంచకప్

దోహా: ఫిఫా ప్రపంచకప్ గ్రూప్ లీగ్ తొలి మ్యాచ్‌లో సౌదీ అరేబియా చేతిలో ఓడిన అర్జెంటీనా జట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం అర్ధరాత్రి జరిగిన తొలి సెమీఫైనల్లో అర్జెంటీనా జట్టు 3–0గోల్స్ తేడాతో క్రొయేషియాను ఓడించింది. అర్జెంటీనా తరఫున కెప్టెన్ లియోనెల్ మెస్సీ ఒకటి, జులియన్ అల్వరెజ్ రెండు గోల్స్ కొట్టారు. కతార్‌లోని లూసైల్ స్టేడియంలో జరిగిన సెమీస్‌లో తొలి గోల్‌ను మెస్సీ 34వ ని.లో పెనాల్టీని గోల్‌గా మలిచి అర్జెంటీనాకు 1–0 ఆధిక్యతను చేకూర్చాడు. ఆ తర్వాత జులియన్ 39వ ని.లో ఒక గోల్ కొట్టడంతో తొలి అర్ధభాగం ముగిసే సమయానికే అర్జెంటీనా జట్టు 2–0గోల్స్ ఆధిక్యత లో నిలిచింది. రెండో అర్ధభాగం 69వ ని.లో జులియన్ మరో గోల్ కొట్టడంతో అర్జెంటీనా తిరుగులేని ఆధిక్యతను సంపాదించింది. ఇరుజట్లకు చెందిన ఇద్దరేసి ఆటగాళ్లు ఎల్లోకార్డు గురికావడం విశేషం. దీంతో అర్జెంటీనా రికార్డుస్థాయిలో 6వ సారి ఫిఫా ప్రపంచకప్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. క్రొయేషియాపై గెలిచి ఫైనల్‌కు చేరడంతో అర్జెంటీనాలో అభిమానులు వీధుల్లోకి వచ్చి సంబరాలు జరుపుకున్నారు. అర్జెంటీనా 1986లో డిగో మారడోనా సారథ్యంలో చివరిసారిగా ప్రపంచకప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. అంతకుముందు 1978లో ఒకసారి, మొత్తం రెండుసార్లు ఫిఫా టైటిల్‌ను అర్జెంటీనా గెలిచి మరో మూడుసార్లు రన్నరప్‌గా నిలిచింది. బుధవారం మొరాకో–ఫ్రాన్స్ జట్ల మధ్య జరిగే రెండో సెమీస్ విజేతతో ఆదివారం టైటిల్‌కై ఫైనల్లో తలపడనుంది.

అర్జెంటీనాలో వీధుల్లోకి వచ్చి సంబరాలు జరుపుకుంటున్న అభిమానులు

ఫైనల్ తర్వాత మెస్సీ రిటైర్మెంట్..?

అర్జెంటీనా కెప్టెన్, స్టార్ ఆటగాడు లియోన్ మెస్సీ అంతర్జాతీయ ఫుట్ మ్యాచ్‌లకు రిటైర్మెంట్ ప్రకటించనున్నట్లు సమాచారం. మంగళవారం అర్ధరాత్రి జరిగిన ఏకపక్ష పోటీలో అర్జెంటీనా జట్టు క్రొయేషియాను ఓడించి ఫైనల్లోకి దూసుకెళ్లిన సంగతి తెలిసిందే.

అర్జెంటీనా జట్టు సెమీస్‌లో గెలుపు అనంతరం మెస్సీ మీడియాతో మాట్లాడుతూ.. 'నా చివరి గేమ్ ఫైనల్‌తో నా ప్రపంచకప్ ప్రయాణాన్ని ముగిస్తున్నందుకు సంతోషంగా ఉంది' అని పేర్కొన్నాడు. చాలాకాలం తర్వాత అర్జెంటీనా జట్టును ఫైనల్‌కు చేర్చడంలో సఫలీకృతుడనయ్యానని, ఈ టోర్నమెంట్‌లో తాను అత్యుత్తమ ప్రదర్శనను కనబరిచినట్లు తెలిపాడు. మెస్సీ అర్జెంటీనా తరఫున ఇప్పటివరకు 172 మ్యాచ్‌లు ఆడాడు. 35ఏళ్ల మెస్సీ రికార్డుస్థాయిలో 5వ సారి ఫిఫా ప్రపంచకప్ టోర్నమెంట్‌లో ప్రాతినిధ్యం వహించాడు. డిగో మారడోనా, జావియర్ మాఛెరానోల కెప్టెన్సీలో దేశం తరఫున ప్రాతినిధ్యం వహించాడు. ఈ టోర్నమెంట్‌లో మెస్సీ 5గోల్స్ కొట్టి టాప్ స్కోరర్‌గా ఉన్నాడు.

ఇప్పటం రైతులు జరిమానా చెల్లించాల్సిందే

హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి–అమరావతి

గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, ఇప్పటం గ్రామానికి చెందిన 14 మంది పిటిషనర్లకు రూ.లక్ష చొప్పున రూ.14 లక్షలను జరిమానా విధిస్తూ సింగిల్ జడ్జి బెంచ్ గతంలో ఇచ్చిన తీర్పును రద్దు చేసేందుకు డివిజన్ బెంచ్ నిరాకరించింది. రోడ్డు ఇరువైపులా ఆక్రమించుకుని ఇళ్ల నిర్మాణం చేసుకున్న వారిని తొలగించి రోడ్డు విస్తరణ పనులు చేయాలని అధికారులు నిర్ణయించారు. వారికి నోటీసులు ఇచ్చారు. అయితే, తమకు నోటీసులు ఇవ్వకుండా ఇళ్ల కూల్చివేత చర్యలు తీసుకుంటున్నారని వారు కేసు దాఖలు చేశారు. ప్రభుత్వం ముందుగానోటీసులు ఇచ్చిందని తేలడంతో దీనిని సవాల్ చేస్తూ దాఖలు చేసిన రిట్ అప్పీల్‌ను చీఫ్ జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ ఎన్.జయసూర్యలతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం కొట్టేస్తూ తీర్పు చెప్పింది.

22న సీఎస్ విచారణకు హాజరుకావాలి : హైకోర్టు

పాఠశాలల ప్రాంగణాల్లో సచివాలయాల నిర్మాణంపై దాఖలైన వ్యాజ్యాలను బుధవారం హైకోర్టు మరోసారి విచారణ జరిపింది. ఆ విధంగా ఎందుకు చేయాల్సివచ్చిందో ఈనెల 22న కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి దేవానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలల ప్రాంగణాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు నిర్మించవద్దని గతంలో హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయినా, నిర్మాణాలు చేశారని, కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు కూడా చేశారని పిటిషనర్ల తరపు న్యాయవాది చెప్పారు. 22వ తేదికి కేసు విచారణను వాయిదా వేశారు.

'రిషికొండ' కమిటీలో అధికారులా...: హైకోర్టు ఆగ్రహం

విశాఖలోని రిషికొండ రిసార్ట్ పునరుద్దరణ పనుల నిమిత్తం జరిపిన తవ్వకాలపై సర్వే కోసం ఏర్పాటు చేసిన అయిదుగురుతో కూడిన కమిటీలో ముగ్గురు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఉండటంపై హైకోర్టు ఆక్షేపించింది. కొండను ఇష్టానుసారంగా తవ్వేస్తున్న ప్రభుత్వ ఆధీనంలోని అధికారులకు కమిటీలో చోటు ఇవ్వడం సరికాదని చెప్పింది. దీనిని తిరిగి పరిశీలన చేయాలని డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశించింది. విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది.

రాణించిన పుజారా, శ్రేయస్

భారత్ 278/6

చిట్టగాంగ్ : బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్‌లో టీమిండియా మిడిలార్డర్ బ్యాటర్స్ ఛతేశ్వర పుజారా, శ్రేయస్ అయ్యర్ రాణించారు. వీరిద్దరికి తోడు వికెట్ కీపర్ రిషబ్ పంత్ మెరుపు ఇన్నింగ్స్ తోడవ్వడంతో టీమిండియా తొలిరోజు ఆట ముగిసే సమయానికి 6 వికెట్ల నష్టానికి 278పరుగులు చేసింది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు శుభారంభం లభించలేదు. ఓపెనర్, కెప్టెన్ కేఎల్ రాహుల్(22), శుభ్‌మన్ గిల్(20) తొలి వికెట్‌కు 41పరుగులు మాత్రమే జతచేశారు. ఆ తర్వాత సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లి(1) కూడా నిరాశపరచడంతో భారతజట్టు 48పరుగులకే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో టెస్ట్ బ్యాటర్ ఛతేశ్వర పుజారా(90), రిషబ్ పంత్ కలిసి 64పరుగులు జతచేసి ఇన్నింగ్స్‌ను కుదుటపరిచారు. ఆ తర్వాత పంత్(46; 45బంతుల్లో 6ఫోర్లు, 2సిక్సర్లు) వన్డే తరహాలో బ్యాటింగ్ చేశాడు. పంత్ నిష్క్రమణ అనంతరం శ్రేయస్– పుజారా కలిసి 5వ వికెట్‌కు 149పరుగులు జతచేశారు. ఈ క్రమంలో సెంచరీకి చేరువ లో పుజారా ఔటయ్యాడు. చివర్లో అక్షర్ పటేల్ కూడా పెవీలియన్‌కు చేరడంతో టీమిండియా తొలి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 278పరుగులు చేసింది. క్రీజ్‌లో శ్రేయస్ (82) ఉన్నాడు. తైజుల్ ఇస్లామ్‌కు మూడు, మెహిదీ హసన్‌కు రెండు వికెట్లు దక్కాయి.

ప్రపంచ కుబేరుల్లో బెర్నార్డ్ టాప్

- రెండో స్థానంలోకి మస్క్

న్యూయార్క్ : ప్రపంచ కుబేరుల జాబితాలో ఫ్రెంచ్ వ్యాపారవేత్త బెర్నార్డ్ అగ్రస్థానంలోకి వచ్చారు. ఇంతకాలం ఈ స్థానంలో కొనసాగిన టెస్లా అధినేత ఎలన్ మస్క్ రెండో స్థానంలోకి పడిపోయారని బ్లూమ్‌బర్గ్ బుధవారం ఓ రిపోర్టులో తెలిపింది. స్టాక్ మార్కెట్లలో కార్పొరేట్ల కంపెనీల సంపద ఆధారంగా ఈ జాబితాను తరుచుగా రూపొందిస్తారు. మస్క్ సంపద 168.5 బిలియన్ డాలర్లుగా ఉండగా.. బెర్నార్డ్ సంపద విలువ 172.9 బిలియన్ డాలర్లకు ఎగిసింది. మస్క్ వ్యక్తిగత ఆస్తుల విలువ తగ్గడంతో ఆయన రెండో స్థానానికి తగ్గారు. ట్విటర్ కొనుగోలుతో మస్క్ ఆస్తి కరిగిపోతోంది. ఈ ఒక్క ఏడాదిలోనే ఏకంగా 107 బిలియన్ డాలర్లు (రూ.8.84 లక్షల కోట్ల)ను కోల్పోయారు.

ముంబయికి ఆధిక్యత

ప్రజాశక్తి – విజయనగరం టౌన్

విజయనగరంలోని చింతలవలస పివిజి రాజు క్రికెట్ మైదానంలో జరుగుతున్న రంజీట్రోఫీ మ్యాచ్‌లో ముంబయి జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. రెండోరోజు తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ముంబయి జట్టు ఆట నిలిచే సమయానికి ఆరు వికెట్లు నష్టానికి 290 పరుగులు చేసింది. దీంతో ముంబయి జట్టుకు ఇప్పటికే 52 ఆధిక్యత లభించింది. బుధవారం ముంబయి బ్యాటర్ అమామ్ జాఫర్(116 పరుగులు) సెంచరీకి తోడు యశస్వి జైస్వాల్ (45) కెప్టెన్ అజింక్య రహానే(44), తనుష కొటియన్(43నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. ఆంధ్ర బౌలర్లలో శశికాంత్ మూడు వికెట్లు, సోయాభ్ ఎండి ఖాన్ రెండు వికెట్లు పడగొట్టారు.

హైదరాబాద్ 395ఆలౌట్

ఎలైట్ గ్రూప్–బిలో హైదరాబాద్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 395పరుగులకు ఆలౌటైంది. ఆ తర్వాత తమిళనాడు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 203పరుగులు చేసింది. వికెట్ కీపర్, ఓపెనర్ జగదీశన్(116), సుదర్శన్(87) తొలి వికెట్‌కు ఇప్పటికే 203పరుగులు జతచేశారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68